సృజన

189
జులై 1991

ఆధునిక సాహిత్యవేదిక
మాసపత్రిక

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

189 | మాసపత్రిక | జులై 1991

ఈ సంచికలో....

నిర్వహణ

'సాహితీమిత్రులు'

ఈ సంచిక రు. 4 | సంవత్సర చందా రు 40

Edited, Printed and Published by P. Hemalatha, Flat 11, Block 2, MIG II, Baghlingampalli, Hyderabad-500 044 and Printed at Nagendra Press, Vijayawada-520 002

Working Editor : Vara Vara Rao

వనజ

సంపాదకీయం :

భేతాళశవం

పోలీసుల రాజ్యం ఇది
పోలింగొక బూటకం
ఫాసిజమై మారుతోంది
ప్రజాస్వామ్యనాటకం!

—శ్రీశ్రీ

ఎన్నికలు అయిపోయాయి. ప్రధాని ఎన్నికకూడా అయిపోయినట్లే.

తెనాలి రామలింగడు గోడమీద తోకల బొమ్మలు వేసి గుర్రాలు ఆవల వున్నాయన్నట్లుగా రాజ్యాలు కూలిపోయాయి. చామరాలు సింహాసనాన్నలంకరించాయి. ముఖంలేని శంఖ చక్రాంకిత త్రినామధారి దేవుడే కాదు రాజు కూడా అవుతాడని బ్రహ్మంగారు చెప్పారో లేదో తాత్వికులు చెప్పాలి.

ఎన్నికల విశ్లేషణలో ప్రతి ఒక్కరూ సానుభూతి పవనాల గురించి మాట్లాడారు. మందిర్, మండల్ ప్రభావాల గురించి మాట్లాడారు. బీహార్, ఆంధ్రలలో అధికార దుర్వినియోగం గురించి మాట్లాడారు. ఇంకా ఎవరు గెలవడానికైనా, ఎవరు ఓడడానికైనా ఉండగల, ఊహించగల కారణాల గురించి మాట్లాడారు. కానీ ఏ ఒక్కరూ ఎన్నికలపట్ల ప్రజల అనాసక్తత గురించి మాట్లాడలేదు. వ్యతిరేకత గురించి మాట్లాడలేదు. ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ వ్యతిరేక ఓటు వేస్తారనో, అధికారంలో వున్న పార్టీ ఓడిపోయే ఒక ఆనవాయితీ గురించో మాట్లాడారు తప్ప అసలు ప్రజలు క్రియాశీలంగా ఓటు వేశారా అని ఎవరూ విశ్లేషించలేదు. కాకపోతే లోకసభ ఎన్నికలలో ఇంత తక్కువ శాతం పోలింగు ఎప్పుడూ కాలేదు అని లెక్కలు చెప్పారు. ఇదే సమయంలో వేళ్ళాడే పార్లమెంటు అయినాసరే ఏర్పడి తీరవలసిందే-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పరనాల్సిందే- ప్రతిపక్షంలో కూర్చుంటాం కాని సమస్యల ప్రాతిపదికపై సమర్థనో, వ్యతిరేకతో వుంటుంది అంటారే తప్ప, మళ్ళీ ఎన్నికలొస్తాయేమో ననేభయం ప్రతిపార్టీ ప్రతినిధి మాటల్లో వ్యక్తమవుతూనే వున్నది.

మళ్ళీ ఎన్నికలోస్తే ఏం మొహం పెట్టుకుని ప్రజల దగ్గరికి వెళ్ళాలి. ఏ

వాగ్దానాలతో వెళ్ళాలి. "మేం చేతులు నరుకుతామనో, చంపుతామనో బెదిరించలేదు. మేం బహిష్కరించమని బలవంతం చేసి అడగడంలేదు. అభ్యర్థులే ఓటర్లకు మొహం చూపలేక ఊళ్ళల్లోకి రావడంలేద"ని పీపుల్స్‌వార్ వాళ్ళు స్పష్టం చేసిన అంశాన్ని ప్రసారసాధనాలు, ఎన్నికల పార్టీలు వక్రీకరించి ప్రచారం చేశాయి. ఎన్నికల్లో ఓట్లు వేయించడానికి జరిగిన హింస, పోలీసు యంత్రాంగం ప్రచారం గమనిస్తే- ఈసారి ఎన్నికలు వస్తే ఫలానా పార్టీకి ఓటు వేయమనే ప్రచారంకాదు అసలు ఓటు వేసి తీరాలనే ప్రచారమే ప్రబలమవుతుందనిపిస్తున్నది.

రెండు దృష్టాంతాలు జ్ఞాపకం చేసుకుందాం.

మే 20న మొదటి విడత ఎన్నికలు జరిగినరోజు మధ్యాహ్నం ప్రాంతీయ వార్తల సమయానికి పాతనగరంలో, వికారాబాదు తాండూరు ప్రాంతాల్లో ఎన్నికలు మందకొడిగా సాగుతున్నాయి. సాయంత్రానికి తొంభై శాతం పోలయిన పోలింగు కేంద్రాలు కూడ శతాధికంగా వున్నట్లు తేలిందంటే ఏమయివుండాలి?

జూన్ 15న ఉత్తర తెలంగాణా అంతటా, ఏజన్సీ ప్రాంతాల్లో కూడ మధ్యాహ్నం ప్రాంతీయ వార్తల సమయానికి పోలింగు 15-20 శాతం మించలేదు. అది సాయంత్రానికి ఏభై అరవై శాతం ఎలా అయింది?

రెండవ విడతనాటికి పోలీసులు పోలింగు జరిగేట్లు చూడడం మాత్రమేకాదు. కాంగ్రెసుకు అనుకూలంగా పోలింగు జరిగేట్లు కూడ చూసారని ఫలితాల సరళి చూసిన ఎవరికైనా అర్థమవుతుంది.

ఎన్నికల బహిష్కరణకు పట్టుగా వున్న గ్రామాలమీద దాడులు, దౌర్జన్యాలు, చిత్రహింసలు మొదలుకొని, ఎన్నికల్లో పాల్గొంటున్న నక్సలైట్ అభ్యర్థులు వున్నచోట ఎన్‌కౌంటర్ హత్యలదాకా పోలీసులు పోలింగు పవిత్రత్వాన్ని కాపాడారు.

ఓటు పవిత్రమైనది. ఓటుహక్కు ప్రజాస్వామిక హక్కు అనే ప్రచారం మొదలుకొని 'ఓటేయకపోతే చచ్చిపోయినట్లే' అనే మూఢ విశ్వాస ప్రచారం దాకా కరపత్రాలు, పోస్టర్లు వేస్తూనే పోలీసులు స్వయంగా పోల్‌చీటీలు పంచారు. ఓటర్ల జాబితాలు తీసుకుని తిరిగారు. ఎన్నికల బహిష్కరణ నినాదాలు గోడలమీద లేకుండా తుడిపించారు. ఇళ్ళమీదపడి ధ్వంసం చేశారు. యువకుల ఒళ్ళు హూనం చేశారు. ఎన్నికల కాలంలోనూ పోలీసు రాజ్యం బహుశా ఇదివరకెన్నడూ లేనంతగా

బలాదూర్‌గా సాగింది. అయినాసరే చేపలగూడెం వంటి గ్రామాల్లో ప్రజలు ఎన్నికల బహిష్కరణకే కృతనిశ్చయులై నిలబడ్డారు. హసనకొండ నియోజకవర్గంలో నలభైఏడు శాతం ఓట్లు కూడ పోల్ కాలేదు. బహిష్కరణ ఈసారి ఒక చైతన్య స్ఫూర్తితో అమలయింది. వాచ్ కమిటీలు ఈ ప్రజాస్వామిక ప్రక్రియను కూడ ఎన్నికలరోజు పర్యటించి చూసి వుంటే ప్రజలకు భరోసావుండేది.

ఇంతే పట్టుదలతో పోలీసులు కరీంనగర్, ఖమ్మం నియోజకవర్గాల్లో ప్రజలు ఓటు వేయకుండానైనా, వేస్తే కాంగ్రెసుకు వేసే విధంగానైనా ఒత్తిడి చేశారు. కరీంనగర్‌లో తెల్లబీభత్సం ఎన్నికల్లో పాల్గొంటున్న ఎం.ఎల్. పార్టీమీద తీవ్ర తరమైంది. సిరిసిల్లలో పట్టపగలు ప్రజలు చూస్తుండగా పట్టుకొని 'ఎన్‌కౌంటర్' చేయడం ప్రారంభమైంది. ఖమ్మంలో మాజీ పోలీసుశాఖ కార్యదర్శిని అభ్యర్థిగా ప్రకటించినప్పటినుంచి పోలీసులే ఓటర్లు అయ్యారు. అందుకే ఎన్‌కౌంటర్‌ల చరిత్ర లోనే కనీవినీ ఎరుగనంత దారుణమైన హత్యలకు పోలీసులు కాచినపల్లిలో పూను కున్నారు.

ఏ 'ఎన్‌కౌంటర్'లోనూ శవాలనైనా తలిదండ్రులను, భార్యాబిడ్డలను చూడ నివ్వలేదు. ఈ ఎన్నికల సందర్భంగానే చచ్చిన రాజీవ్‌గాంధీ శవం మాత్రం నిజానికి చూడడానికి ఏమీ మిగలకపోయినా మూడురోజులపాటు ప్రతి ఇంట్లో పెట్టెలోని రహస్యమై అదృశ్యదృశ్యమయింది. ఆయన బూడిద దేశంలోని అన్ని నదుల నీళ్ళలోకి రైళ్ళయి ప్రవహించింది. హిమాలయాలకన్న ఉన్నతమైన త్యాగాల్ని చేసిన తమవాళ్ళ బూడిదనైనా చూడనోచుకోని విప్లవకారుల రక్తబంధువులు, ప్రజలు హిమాలయాల్లో చల్లిన రాజీవ్ బూడిద గురించి చదివి విని చావులో కూడా సమా నత్వంలేని సమాజంలో అందరికీ సమానమైన ఓటుహక్కు ఎంత క్రూరమైన హాస్యమోనని విషణ్ణులయ్యారు.

నక్సలైట్ల సంగతేకాదు రాజీవ్‌తోపాటు చచ్చిన పద్దెనిమిది మంది మనుషులది చచ్చిన చావే కాని గౌరవమరణం కాలేదుగదా.

అభ్యర్థుల సంగతి చూద్దాం. ఎన్నికలు జరగకముందు చస్తే ఆ నియోజకవర్గం ఎన్నిక ఆగిపోతుంది. ఎన్నికలరోజు చస్తే ఏదీ ఆగదు. తన నియోజకవర్గంలో

ఎన్నికలు అయిపోయాక చచ్చిన రాజీవ్ కోసం దేశవ్యాప్తంగా ఎన్నికలు మూడు వారాలు ఆగిపోయాయి.

అది పాపకాదు, హత్య గనుకనా ? ఎన్నికల హత్యలు కనీసం ఐదువందల దాకా జరిగాయి దేశంలో. అయినా ఈ హింసాకాండ ఏదీ ఎన్నికలను ఆపలేక పోయింది.

ఏనుగు బతికినా చచ్చినా ఏనుగువిలువ చేస్తుందంటారు.

రాజీవ్‌గాంధీ చచ్చిసాధించాడు— ఇందిరాగాంధి చచ్చిసాధించిన విజయంలో సగం. కాంగ్రెస్‌పార్టీ దింపుడు కళ్ళంలో బతికింది.

ఇపుడింక ఎన్నికల రక్తసిక్తమయిన దేశాన్ని, ఓట్లగాట్లు పడి మిగిలిన కాలాన్ని, ఎన్నికల ఖర్చుకోసం బంగారం లాంటి దేశాన్ని మదుపు పెట్టి ఖాళీ అయిన ఖజానాను సుస్థిరంగా పాలించడానికి, అఖండంగా పాలించడానికి ఎన్నికయిన ప్రతిపార్టీ ప్రభుత్వంగానో, ప్రతిపక్షంగానో ప్రతిజ్ఞ చేస్తున్నాయి.

గుర్రప్పందాలకు వెళ్ళి ఇల్లుచేరిన వ్యసనపరులకు అపుడుగానీ ఇల్లుగుల్లయిన సంగతి స్పృహలోకి రానట్లుగా ఇపుడన్ని పార్టీలు దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి, ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం గురించీ మాట్లాడుతున్నాయి. ఐ. ఎం. ఎఫ్ అప్పులు చేయడానికీ, ప్రజల మీద పన్నులు వేయడానికీ రంగం సిద్ధం చేసుకుంటు న్నాయి: శాంతి, సుస్థిరతల గురించి మాట్లాడుతున్నాయి- పార్లమెంటు ద్వారా నియంతృత్వ శాసనాలు తేవడానికి.

రాజ్యాంగాన్ని లోపల్నించి భగ్నం చేస్తామని ఎన్నికల బరిలోకి దిగిన నంబూద్రిపాద్ ఇపుడింక దేశం హంగ్ పార్లమెంటుకు అలవాటు పడాలంటున్నాడు.

పార్లమెంటులో బాంబులు వేసిన భగత్‌సింగ్‌ను ఉరితీసారు. ఫాస్సు పార్ల మెంటును ఉరితీసే భగత్‌సింగ్‌లు ఏకమయ్యేదాకా మనకు ఉట్టికీ స్వర్గానికీ కాకుండా వేళ్ళాడే ఈ గుదిబండ చట్టసభ తప్పదేమో.

సంపాదకుడు

స్టాప్‌ప్రెస్- జూన్ 20, 91- భారత్ గణతంత్ర అధ్యక్షుడు పార్లమెంటును రమ్మనెను. అదీ ఆయెను.

గద్దర్ వచన కవితలు :

ఆటపాటల్లోన...

పోరుగీతం పాడే నీ గొంతు
మూగపోయినపుడు
నా గొంతు అరువిద్దామనుకున్నా

నాట్యమాడే నీ కాలు
నలతబడి నడవలేనప్పుడు
కాళ్ళు మార్చుకుందామనుకున్న

కవితలల్లే నీ కలం
నీ మునివేళ్ళలో వాలిపోయినపుడు
నా వేళ్ళు నరికి ఇద్దామనుకున్నా

నీ కనుపాపలను
చలి చీమలు చించుకొని తిన్నప్పుడు
నా కనుపాపలనిద్దామనుకున్నా

నీవు నిస్వార్థివి
ఇవ్వడమే తప్ప
తీసుకోవడం నేర్చుకోలేదు

మృత్యువుతో పోరాడడం నేర్చుకో
మన్నావు
మాటకూ, పాటకూ కట్టుబడమన్నావు
బతుకు పోరు కళ్ళకు గట్టేటట్లు
ఆడమన్నావు

నీ తలకొరివి పెట్టినపుడు
నా తలపుల్లోకి
మంటలై ప్రవేశించావు

ఆ మంటలే పెనుమంటలై
ప్రపంచాన్ని మారుస్తాయన్నావు
అప్పుడే బ్రతుకు కర్థం వుందన్నావ్

[అజ్ఞాతంలో చెరబండరాజు తలపోతలు - చెర సంస్మరణ-జూలై 2]

రేపటికాలం మీదే

బిడ్డా !
ఒంటిగాడవు
ఒంటిరెక్కోడవు
ఎనుకముందు లేనోడవు
అయినోనితోని, కానోనితోని
కొట్లాడబోకు
బాయి లోతు తెలుస్తది కాని
మనిషి లోతు తెల్వదు
ఉరుకులాడితె పనిగాదు
నిదానమే పదానము
ఎయ్యికాళ్ళ జెర్రితోని
ఒంటి కాలోడు గెల్వడు

తన్ను కష్టం చేసి
కనిపెంచిన
సీతమ్మ వనవాసం చేసిన
కలువబోయి, కొయ్యబోయి
గంజి తాగి, గట్కతిని
కడుపు చిన్నది చేసుకొని
కండ్లు పెద్దవి చేసుకొని
కాళ్ళరెక్కలు సున్నం సున్నం చేసుకొని
అయ్యో బిడ్డలు
దిక్కలేనోళ్లని
రెక్కలు రానోళ్లని
నోరు పెండ చేసుకొని
పచ్చినీళ్లు తాగి పెంచిన

ఏ పని చేసినా
మంచి సెడు ఆలోసించుకో
ఏ పుట్టలో ఏ పామున్నదో

పదిమందిని ఇసారించి
పదిమందిని కల్పుకొని చెయ్యి

ఓడిపోతే ఏడ్వద్దు
దస్కు తినొద్దు
అది రండబతుకు
గుండెకాయ రాయి చేసుకోవాలె
రణ రంగంల దూకాలె
నేను సెప్పినంత సెప్పిన
ఇగ నీ ఇష్టం నీ రాజీ
నీ మన్‌మానె చెయ్యి

నీ బుద్ధి నీ గ్యానం
మావి ఎనుకటి బతుకు
ఎడ్డి బతుకు
మా కాలం అయిపోయింది
రేపటికాలం మీదే

[తల్లి లచ్చమమ్మ చెప్పిన మాటలను ఏర్చి కూర్చిన కవిత]

నేనదే పాట పాడ్తా !

అప్పుడే పుట్టిన కూనలను
పండ్లతో కరచి సురక్షిత స్థలం
చేరుస్తున్న
కుక్కతల్లి
తొక్కులాట చూసినపుడు

గుడ్డులోనుండి బయటపడ్డ
నెత్తురు గుడ్డుకై
గద్దతో తెగించి పోరాడే
తల్లి కోడి
తెగింపు చూసినపుడు

రెక్కలు మొలవని పిట్టపిల్ల
నోటిలో నోరు పెట్టి
జీవం పోస్తున్న
తల్లి పక్షి

చల్లని ప్రేమ చూసినపుడు
అంబా అంటే అంబా అంటు
చెంగున దూకిన లేగ
మొహంలో మొహంపెట్టి ముద్దు పెట్టుకొని
పాల పొదుగులో ఒదిగి పెట్టుకొని
నాలుక చాచి
పెయ్యంత నెనరుతో నిమురుతున్న
తల్లి ఆవు
కన్నుల్లో చూసినపుడు

కన్నకడుపు తీపేంటిదో
కన్నుల్లో కదిలింది

ఒక్క నిమిషం కన్నుమూసి
ఆకాశంపై పు చూసినపుడు
గుర్తుకొస్తారు నా బిడ్డలు
సూర్యుడూ, చంద్రుడూ, వెన్నెల

వాళ్ళను ఎత్తుకోవాలని
గుండెకు హత్తుకోవాలనీ
ముద్దుపెట్టుకోవాలనీ ముచ్చటలాడాలనీ
మనసంతా తొక్కులాడ్తది

నా బిడ్డలారా మీరే నయం
ఇంగ్లీషు చదువులు, పట్నంబతుకులా
పేరున్న కవి బిడ్డలు
ఎవరన్నా ఆదుకుంటరు

పల్లెల్లో మీ తమ్ములు
పసుల వెనుక పరుగులు తీస్తున్నరు
కచ్చికాయలు, పచ్చికాయలు తిని
కడుపు నింపుకుంటున్నరు
కాళ్ళకు చెప్పులు లేవు
కడుపుల మెతుకులు లేవు
ఒంటినిండ గుడ్డలేదు
గుడిసె మీద గడ్డి లేదు

వాళ్ళ అయ్య సంఘంలో చేరిండని
గుడిసె తగల బెట్టింరు
చాపలు బొంతలు తగల కాలబెట్టింరు
బొళ్ళు బొకలు సజ్జ సజ్జ చేసింరు
కూలిగింజల్లో కిరసనాయిలు పోసి
మసి చేసింరు

వాళ్ళ అవ్వ
దొరకాళ్ళమీదా పోలీసోళ్ళ కాళ్ళమీదాపడి
బాబూ! బిడ్డలు చిన్నోళ్ళు
గుండె పగిలి చస్తరు
గాళ్ళ మొఖం చూసి గీ కూలిగింజలు
గంజికాసుకోనికిచ్చి పోండి
అని బోరుమని నోరూ నెత్తి కొట్టుకుంది

గద్దను చూసి కోడిపిల్లలు చెల్లా చెదురైనట్లు
బిడ్డలు చెల్లా చెదురై పోయింరు
పిల్లిని చూసే ఎలుక పిల్లల్లా
పులిచి చూసే జింకపిల్లల్లా
దొరలా పోలీసుల జులుంచూసి
నక్కి నక్కి దాగున్నరు
ఏడ్చేడ్చి మూర్ఛబోయిన తల్లి
కన్నీళ్ళను తుడుస్తున్నరు బిడ్డలు

కన్నులు తెరచి చూసిన తల్లి
గద్ద నీడ చూసిన తల్లి కోడి
పిల్లలను రెక్కలకింద డొక్కలో
దాచుకున్నట్టు
బిడ్డలను ఒడిలో దాచుకొని
బావు నిదుర తీసింది

తెల్లారి
పసుల వెనుక పరుగుదీస్తున్న పోరగాణ్ణి
అరే మీ గుడిసెందుకు కాలబెట్టిండు
అనడిగింది సోపతిగాడు
"మా అయ్య సంఘంలో చేరిసందుకు"
"సంఘంలో ఏం చేస్తుండె ?"
"పాట పాడ్తుండె"
'ఏం పాట ?'
'భూమి మనది భుక్తి మనది
దున్నేటోనిదే భూమి
నడుమ దొర ఏందిరో
పెత్తనమేందిరో'
'మరి నువ్వేం చేస్తవ్‌రా'
'నేనదే పాట పాడ్తా
మా తమ్మునికదే నేర్పిస్త
మా సెల్లెకూడ....'

గాయపడ్డ కోయిల
సర్గీన్

వెలుగును మింగిన
చీకటి రెక్కల సందులనుంచి వచ్చి
నడిరాత్రి నాయింటి తలుపు తట్టింది కోయిల
నెత్తురోడుతున్న మొండిరెక్కల్ని చూడగానే
నా కళ్ళలో గుబగుబా కన్నీళ్ళు !
లోకపు దుఃఖాన్నంతా కంఠంలో దాచుకుని
కాలి గోళ్ళకు చిక్కిన 'డేగ' మాంసాన్ని చూసుకుంటూ
'కన్నీళ్ళకు యిది కాలం కాదం'టూ
ఆకురాలిన అరణ్యంలోకి దింపిరావా అన్నది
నా మనసు మంచులా ద్రవించిపోయింది
'నరకబడ్డ' కోయిల రెక్కల నుండి
బొట్లు బొట్లుగా
నెత్తురు రాలడం కన్పిస్తూనే వున్నది
చీకటి రాక్షసత్వానికి నేను మౌనంగా రోదిస్తుంటే
"ఆకురాలిన అరణ్యంలోకి పోయి
వసంతం తప్పక వస్తుందని పాడాలి" అన్నది కోకిల

నీరో రాగం

వసీరా

ఒకచోట బాంబులు కురుస్తుండగా
మిగతా ప్రపంచమంతా
కనికట్టు కురుస్తుంది
మీడియా నీరోచేతి ఫిడేల్ రాగమై పోతుంది
తెగుతున్న గొంతుచేసే ఆర్తనాదాలు
పెనుగులాట ప్రతిఘటన సెన్సారై పోయి
మన ఇంద్రియాలన్నీ తెగిపోయి
ఎలక్ట్రానిక్ ఇంద్రియాలు
శరీరాలకి అమరిపోతాయి
వాడి కమాండ్స్‌కి అనుగుణంగా
ప్రపంచం పెదవులు కదులుతాయి
చెవులు వింటాయి కళ్లు చూస్తాయి
స్వేచ్ఛా ప్రతిమ చేతిలో
మిస్సైలే జ్ఞాన దీపం కావడం
ముమ్మాటికీ అంతర్జాతీయ న్యాయమని
హైటెక్ నోళ్లు అరిచి ఘీపెడతాయి
మన గుండెల మీద తిష్టవేసి
సాటి వాటిమీద బాంబులు కురిపించడం
లోక కల్యాణార్థం పోసిన
తలంబ్రాలు భ్రమని గొల్పుతాయి
మనపై చేసే అత్యాచారాలు సెన్సారైపోయి
మనం స్నేహంగా సరిపెట్టుకోవడమూ
మన భుజంమీద వాడిచేయి వేయించుకుని
కళ్లు మూసుకుని వెంటనడవటం
సిసలైన స్వేచ్ఛగా భ్రాంతి కలుగుతుంది

నెత్తుటి చేతులు తుడుచుకుందుకు
టిష్యూ పేపర్లమై పోయినా
స్నేహ హస్తం చాచడం
పేగులు చీలుస్తున్నా
ఫిడేలు రాగాలు పలికించడంలో
ప్రపంచం ఎలక్ట్రానిక్ కనికట్టుబడై పోతుంది
ఉపగ్రహాల మీంచి బొమ్మలా
ఆకాశంలోంచి బాంబులా కురిసి
భూగోళం సకలేంద్రియాలా దగా అయిపోతాయి
భృకుటి ముడిపడిన ముఖాలకి
లొంగుబాటు మాస్కులు అతుక్కుపోతాయి
తెగిపడిన ముఖాలకి
ప్రపంచ బూచి మాస్కులు అతుక్కుపోతాయి
నిజంగా లొంగిన ముఖాలకి ఆనంద దరహాసాల మాస్కులా
చిలకపలుకుల రబ్బరు పెదవులా అతుక్కుపోతాయి
పాలపొడి ఫాక్టరీ శవానికి
తొడిగిన మిలట్రీ యూనిఫాం
శిశుహత్యని నూతన ప్రపంచ న్యాయం చేస్తుంది
అతుక్కుపోయిన చెక్కముఖాల వెనుక
పెనుగులాడే అసలు ముఖాలు
రహస్యంగా తునాతునకలై పోతాయి
తాతలా తల్లులా పిల్లలా
తలదాచుకున్న గూట్లోకి
మిసైళ్ల గుమ్మరింపాకా
గూడు ఆర్మీ ఆఫీసుగానూ
గుమ్మరింపు దీనజన విముక్తిగానూ మారిపోతుంది
మనం నీరో ఫిడేల్ రాగాల్లో రాగంగా
తీగల్లో తీగలుగా కల్సిపోయినట్లే అన్పిస్తుంది

అసలు నిజం
కన్పించని గాయాలసలుపు చెప్తుంది
కన్పించే గాయాల నెత్తురు చెప్తుంది
మూడో ప్రపంచ మంతటా
గుల్లైపోయిన బంగారు గనులు చెప్తాయి

సిరులు పొంగే పొలాల్లోని
ఆకలి చావులు చెప్తాయి
సిరిగల దేశాల్లో పుట్టిన
పుల్లచేతుల బానపొట్టల పిల్లలు చెప్తారు
ఖాళీ అయిపోయిన జేబులూ
నెత్తిమీద కూర్చున్న అప్పులూ చెప్తాయి
కత్తిరించబడిన జీవితం చెప్తుంది
వాడి పాదాలు ఒత్తుతూనే
మన పీకలమీద బిగుసుకున్న
కీలుబొమ్మల నెత్తుటి చేతులు చెప్తాయి
బాంబు పేలుళ్ళ షాక్‌కి
బిక్కచచ్చి పైకిరాని స్తన్యం చెప్తుంది
ఏడ్చే ఓపిక కూడా లేక
ఎడారి పాలిండ్ల మీద
తలవేలాడేసిన పాపాయి చెప్తుంది

ఎవరి ఉద్ధరింపుకు
ఒక ప్రపంచం శ్మశానమవుతుందో
చితుల మీది డాలర్ల పంట చెప్తుంది
ఉపగ్రహ గోళాల మీంచి మాత్రం
కనికట్టు కురుస్తూనే ఉంటుంది
నూతన ప్రపంచం గురించి
ప్రపంచ పోలీసు పాఠాలు చెప్తూనే ఉంటాడు
ఎవడు ఎన్ని మాయలుచేసి ఏం చేసినా

అవగాహన :

సామాజిక సంక్షోభం

ఆర్. యస్. రావు

మనం వాస్తవికతను ప్రతీకల ద్వారా, నమూనాల ద్వారా గుర్తించి వాస్తవికతతో వ్యవహరిస్తూ ఉంటాం. వాస్తవ క్రమాలలో భాగస్వాములుగా ప్రజలు స్వయంగా గుర్తించే ప్రతీకలకు, నమూనాలకు, ప్రజలు గుర్తించాలని మనం అనుకునే ప్రతీకలకు, నమూనాలకు మన ప్రతీకలు, నమూనాలు అతి సన్నిహితముగా ఉంటాయని మనం నమ్ముతాం. మన ప్రతీకలకు, నమూనాలకు వాస్తవికతకు మధ్యన సామాన్యత లేనప్పుడు ఒక వ్యవస్థలో సంక్షోభం మొదలవుతుంది. అప్పుడు, ఒక విషయం గురించిన జ్ఞానం ఆ విషయంతో వేరుబడిపోతుంది. సరుకుల మాయాజాలం తప్పుడు చైతన్యంగా వాస్తవ ప్రతీకలను ఎట్లా అస్పష్టం చేస్తుందో, ఆ మేరకు అది సామాజిక సంక్షోభం పట్ల వ్యగ్రతను ఎట్లా అస్పష్టం చేస్తుందో గతంలో వివరించాను. ఇప్పుడు ఆ వాదననే మరికొంత విస్తరించదలిచాను. భారతదేశంలో వాస్తవ వ్యవస్థలన్నీ- అది ఆర్థిక వ్యవస్థగానీ, అది విద్యావ్యవస్థగానీ, అది సామాజిక వ్యవస్థగానీ - ఆ వ్యవస్థలు మన ప్రతీకలకన్న చాల పెద్దవి. చాగా భిన్నమైనవి. మానవ ఆలోచనలోనే, ప్రతీకలు ఎప్పుడైనా వాస్తవ వ్యవస్థలకన్న పరిమాణాత్మకంగా చాల చిన్నవిగా ఉంటాయి. వాస్తవికతకు క్రమక్రమంగా సన్నిహితంగా వెళ్ళే క్రమంలోనే జ్ఞానం పురోగమిస్తుంది. అటువంటి సందర్భాలన్నిటి

బాంబులు చెప్పే పాఠాన్ని మాత్రం
జనం ఎప్పటికీ మర్చిపోరు
బాంబుల్ని నాశనం చేసే పాఠాలు
చెప్పకుండా వదల్రు
పులి బలహీనత ఏమిటో
దాని బలమే చెప్తుంది
దాని మృత్యు రహస్యం ఏమిటో
వియత్నాం అడవుల్లోని
అకుపాటు విల్లమ్ములు చెప్తాయి.

లోనూ, ప్రతీక అనేది ఒక రకమైన అద్దంలోని ప్రతిబింబంలాగానే ఉంటుంది. అద్దం నాణ్యతనుబట్టి ప్రతిబింబాలు నాసిరకంవి కూడా కావచ్చును. అయితే, భారతీయ నేపథ్యంలో, భారత వాస్తవికతకు ప్రతిబింబాలు కాకుండానే కొన్ని ప్రతీకలు, నమూనాలు బైటినుంచి మనకు అందాయి. కాలంగడిచే కొద్దీ వాస్తవమే మన నమూనాకు సన్నిహితంగా వస్తుందని మనం ఆశిస్తూ ఉంటాం. భారతీయ వ్యవస్థలలో సంక్షోభం బహుశా ఇక్కడే ఉంది.

దీన్ని ఇంకా వివరించనివ్వండి.

ఇంద్రావతి నదిమీద ఆనకట్ట నిర్మాణంవల్ల నిరాశ్రితులవుతున్న ప్రజల గురించి ఈమధ్య అధ్యయనం చేశాను. ఆ ఆనకట్ట ఒరిస్సాలో కలహండి - కోరాపుట్ జిల్లాల్లో ఉంది. ఆ ఆనకట్టవల్ల 65 గ్రామాలు మునిగిపోతాయి. నిరాశ్రిత కుటుంబాలలో అత్యధిక సంఖ్యాకులు పరజ ఆదివాసి తెగకు చెందినవాళ్ళు. ఈ ప్రాంతంలో మొట్టమొదట ఆవాసం ఏర్పరచుకున్న వాళ్ళు పరజలే అయి ఉంటారు. చుట్టూరా విశాల అరణ్యాలతో పరజలు తమదైన జీవన విధానాన్ని రూపొందించుకున్నారు. ఈ జీవన విధానం బ్రాహ్మణ వ్యవస్థతో పోలిస్తే ఎంత భిన్నమైనదో చూపేందుకు ఒకరిద్దరు మానుష శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. ఈ ప్రజల జీవన విధానాన్ని గోపీనాథమొహంతి తన నవల 'పరజ'లో చిత్రించాడు. ఈ ప్రజల జీవన విధానాన్నే ఇప్పుడు ఆనకట్ట రద్దు చేయబోతోంది.

భూ ఆక్రమణ క్రమం అనేది రాజ్యాంగయంత్రపు ఆస్తి ఆక్రమణ క్రమమే. అందుకు చట్టపరమైన అధికారాన్ని 1894 భూ ఆక్రమణ చట్టం ఇస్తుంది. ఈ చట్టం ప్రకారం, ప్రజా కార్యక్రమాలకోసం భూమిని ఆక్రమించుకునేందుకు, చట్టబద్ధమైన భూమి సొంతదార్లకు, ముంపుకు గురవుతున్న భూమి సొంతదార్లకు మార్కెట్ రేట్ల ప్రకారం నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. ఇది ఆమోదయోగ్యమైనదేనని అనిపిస్తుంది. ఇది న్యాయమైన ప్రతీకేనని అనిపిస్తుంది. కాని ఇక్కడ రెండురకాల సమస్యలు తలెత్తుతాయి. ఎందుకంటే వాస్తవం 1894 చట్టం గుర్తించిన దానికన్న భిన్నమైనదీ, పెద్దదీ కూడా. మొదటి సమస్య, భూమి రికార్డులకు, పట్టా రికార్డులకు సంబంధించినది. ఈ రికార్డులు ఉండనైనా ఉండవు. ఒకవేళ ఉంటే, ప్రజలు గుర్తిస్తున్నట్టుగా అవి నిజమైన హక్కుల రికార్డులుగా ఉండవు. సమాజంలో చాలా చోట్ల, ప్రత్యేకంగా 'ఆది

వాసి ప్రాంతాలలో భూమి హక్కును ప్రజలు సాధారణ మౌఖిక సాంప్రదాయంలో గుర్తుపెట్టుకుంటుండగా, బ్రిటిష్ పాలకులు రైతుల హక్కులను నమోదుచేసే లిఖిత సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. మౌఖిక సాంప్రదాయంనుంచి లిఖిత సాంప్రదాయానికి మార్పు జరిగినప్పుడల్లా తప్పనిసరిగా మౌఖిక సాంప్రదాయంలోని సూక్ష్మఅంశాలు విస్మరణకు గురవుతాయి. లిఖిత సాంప్రదాయం వ్యక్తిగత స్థాయిలో ప్రతీకలను గ్రహిస్తుంది. మౌఖిక సాంప్రదాయం సామూహిక స్థాయిలో ప్రతీకలను గ్రహిస్తుంది. అందువల్ల లిఖిత ప్రతీకలో సామూహిక అంశం అదృశ్యమైపోతుంది. ఏ ప్రజల హక్కులు నమోదు అవుతున్నాయో (లేదా నమోదవడం లేదో) ఆ ప్రజల్లో చాలామందికి లిఖిత భాష పరాయిది కావడంవల్ల కూడ లిఖిత సాంప్రదాయం మరిన్ని సమస్యలను సృష్టిస్తుంది. తత్ఫలితంగా, ప్రతీకలను నమోదు చేయడంలో సవరణ క్రమాలు ఉండనైనా ఉండవు. ఉంటే డబ్బు రూపంలోనూ, సమయం రూపంలోనూ చాల ఖరీదయినవవుతాయి. అంతేకాక, హక్కుల రికార్డుల తయారీకి బ్రిటిష్ పాలకులను, సంస్థానాధీశులకు పురికొల్పినది ఆదాయపు అంచనాలే గనుక, భూమినుంచి ఆదాయం చాల తక్కువగా ఉన్నచోట్ల ఈ నమోదు అసంపూర్ణంగానూ, అస్తవ్యస్తంగానూ ఉంది. స్వాతంత్ర్యం తర్వాత కూడ, రాజ్యాంగయంత్రానికి ఎంత ఆదాయం వస్తుందనే ప్రాతిపదికపైనే ప్రజల హక్కులు నమోదు చేయడం ఆసక్తికరమైన విషయం.

"ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత మొదటి కార్యక్రమాన్ని సవరించడం జరిగింది. జిల్లా అంతటినుంచీ కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత, 1951లో, ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, మొత్తం జిల్లాను ఈ కార్యక్రమం కిందికి తేవాలని ఆదేశించింది. ఆ కార్యక్రమం సర్వే, సెటిల్‌మెంట్ కార్యక్రమం. అందువల్ల మొత్తం జిల్లాను 9 సమితులుగా విభజించే కొత్త కార్యక్రమాన్ని ప్రభుత్వం 1951 ఆగస్ట్ 26న ఆమోదించింది. మళ్ళీ 1958లో, సర్వే ఖర్చులను కూడ రాబట్టలేనంత తక్కువ స్థాయిలో వ్యవసాయం సాగుతున్నందువల్ల, మల్కాన్‌గిరి ప్రాంతాన్ని ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు." అని కోరాపుట్ జిల్లా గెజటీర్ రాసింది.

చట్టబద్ధంగా ఆమోదం పొందిన ప్రతీకలకన్న నిజమైన ఆర్థిక వ్యవస్థ చాల

పెద్దదిగా ఉండడానికి కారణం ఇటువంటి పరిస్థితులే. చట్టబద్ధమైన ఆర్థిక వ్యవస్థ, దాని ప్రతీకలు మిగిలిన భాగాన్నంతటినీ రాజ్యాంగ యంత్రపు హక్కులలో భాగం చేస్తాయి. అందువల్లనే అలవాటుగా సాగేదీ, స్థానిక విజ్ఞతకు అద్దం పట్టేదీ అయిన సహజవనరుల వినియోగం అంతా అధికార పరిభాషలో "దురాక్రమణ"గా ఉంటుంది. అతిక్రమణ అనే సమస్య ఎవరు ఎలా చూస్తున్నారనేదానిపై ఆధారపడి ఉంటుంది. ప్రజల హక్కులపై ప్రభుత్వం దురాక్రమణ జరిపిందా, ప్రభుత్వ హక్కులపై ప్రజలు దురాక్రమణ జరిపారా అనే విషయం మనం ప్రతీకలనుంచి వాస్తవాన్ని చూస్తున్నామా, వాస్తవంనుంచి ప్రతీకలను చూస్తున్నామా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. మౌఖిక సాంప్రదాయపు సూక్ష్మాంశాలను లిఖిత సాంప్రదాయం ఎంత వరకు పట్టుకోగలుగుతుందనే విషయంపై కూడ అది ఆధారపడి ఉంటుంది. అది అలా పట్టుకోలేకపోతే మిగిలిన హక్కులు మౌఖిక సాంప్రదాయానికే ఉండిపోతాయి. మిగులును సొంతం చేసుకునే రాజ్యాధికారపు ప్రతీకలు లొంగిపోవలసి వస్తుంది.

ప్రతీకలకూ, వాస్తవానికీ మధ్య విస్తృతి లోనూ, పరిమాణంలోనూ ఉండే తేడాలకు ఆసక్తికరమైన ఫలితాలుంటాయి. అధికారిక లెక్కలలో ఒక గ్రామంలో వ్యవసాయదారులు, వ్యవసాయకూలీలు ఉన్నారని ఉంటుంది. వ్యవసాయదారులంటే భూమికి సొంత పట్టాలున్నవాళ్ళు. వ్యవసాయ కూలీలంటే అటువంటి చట్టబద్ధమైన పట్టాలు లేనివాళ్ళు. భూమినీ, ఇంటినీ కోల్పోయినప్పుడు పట్టాదార్లకు మాత్రమే నష్టపరిహారం కోరే అధికారం ఉంటుంది. అంటే, ఈ చట్టం ప్రకారం, జనాభాలోని 60 శాతం మందికి మాత్రమే నష్టపరిహారం కోరే హక్కు పరిమితమై ఉంది. మిగిలిన వాళ్ళందరూ వ్యవసాయ కూలీలే. ఈ సమాచారం జీర్ణించుకుని, ఈ ప్రతీకతో, ఎవరయినా ఇంద్రావతి పరీవాహక ప్రాంతంలోని ఏ గ్రామానికి వెళ్ళినా కొంచెం దిగ్భ్రాంతి కలుగుతుంది. వ్యవసాయకూలీ కుటుంబాలు నిజానికి వ్యవసాయం చేస్తూ కనబడుతాయి. ఏదో ఆక్రమించిన భూమి మీదనో, పోరంబోకు భూమి మీదనో వాళ్ళు సాగుచేస్తుంటారు. లేదా భూస్వామికి కౌలుదార్లుగా వ్యవసాయం చేస్తుంటారు. ఆ రైతు చేసే వ్యవసాయం అంతటికీ స్థానిక ఆమోదం ఉంటుంది. ఆ వ్యవసాయానికి రాజ్యాంగ యంత్రపు స్థానిక ఛోటా అధికారి అనుమతి కూడ ఉండవచ్చు. అందుకోసం ఆ రైతు కొంత డబ్బు కూడ ముట్టజెప్పి ఉండవచ్చు. ఆ రైతు తన సొంత వినియోగం కోసం కొన్ని పంటలు పండిస్తాడు. అప్పుడప్పుడూ కొన్ని

పంటలను మార్కెట్లో అమ్ముతాడు గనుక బైటి సమాజం కోసం కూడా కొన్ని పంటలు పండిస్తాడు. అధికారం ప్రతీకలు ఈ వాస్తవాన్ని పట్టుకోలేవు. తత్ఫలితంగా, నష్టపరిహారం అధికారిక ప్రతీకల ప్రకారం ఆస్తిగా గుర్తించబడిన దానికే గాని, నిజజీవిత సంబంధాలకు ఉండదు గనుక వ్యక్తికి విపరీతమైన నష్టానికి దారితీస్తుంది. ఒక వ్యవసాయదారుకు చట్టపరమైన పట్టా లేకపోతే, అతనికి వ్యవసాయదారుగా గుర్తింపు ఉండదన్నమాట. అతను గ్రామంలోనే ఉంటాడు గనుక అతనికోసం వ్యవసాయ కూలీ అనే ప్రతీక తయారవుతుంది. నిజానికి అతను వాస్తవ జీవితంలో వ్యవసాయమే చేస్తుంటాడు.

ఇటువంటిదే, ఇంతకన్న ముఖ్యమైనదీ స్త్రీల విషయం. ఇక్కడ ప్రతీకలు మరింత ఎక్కువ వికృతమైనవి. మొదట 1981 జనాభా గణాంకాలు పరిశీలించడానికి ప్రయత్నించాం. జనాభా లెక్కల ప్రకారం 65 శాతం స్త్రీలు ఏ శ్రమా చేయనివారు. 15 శాతం స్త్రీలు స్వల్ప శ్రమ చేసేవారు. 7.53 శాతం స్త్రీలు వ్యవసాయ కూలీలు, 10.33 శాతం స్త్రీలు వ్యవసాయదారులు. ఈ ప్రతీకల నుంచి ఎవరయినా ఏ అభిప్రాయానికి రావచ్చునంటే, ఈ ప్రాంతంలో స్త్రీలు ఏ పనీ చేయకుండా సోమరిగా కాలం గడుపుతారని! వాళ్ళు చేసే పనల్లా పిల్లల్ని కనడమూ, బహుశా చిన్నా చితకా ఇంటిపని చేయడమూ మాత్రమేనని! కాని వాస్తవం పూర్తిగా భిన్నమైనది. ఈ గ్రామాలలో స్త్రీలే ఆర్థిక వ్యవస్థకు కేంద్ర స్థానంలో ఉన్నారు. ఒక చీపురులాంటి చిన్న వస్తువు నుంచి, ఇంటి వినియోగానికి అవసరమైన ఎన్నో వస్తువుల వరకు అన్నిటినీ స్త్రీలు, స్త్రీలు మాత్రమే చేస్తారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, ఇంటిని రూపొందించడం, మళ్ళీ మళ్ళీ రూపొందించడం, పెరట్లో కూరగాయలు పండించడం, కొండ వాలుల్లో సాగు చేయడం, ఉత్పత్తులను నిలువ ఉంచడం, కొంత భాగాన్ని మార్కెట్‌కు పంపడం, చేపలు పట్టడం, మంచినీరు తేవడం-ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక కార్యకలాపాలన్నీ స్త్రీల చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. కాని జనాభా గణాంకాల ప్రకారం ఈ స్త్రీలు అల్ప శ్రామికులు గానో, ఏమీ పనిచేయని వారుగానో గుర్తించబడుతున్నారు. వాస్తవాన్ని ప్రతీకల్లో వక్రీకరించడం చాల ఉంది గనుకనే ఈ ప్రతీకలు వికృతంగా కనబడతాయి.

ఇటువంటి వికృత ప్రతీకల ఫలితాలు నిరాశ్రిత కుటుంబాల మీద దారుణంగా ఉంటాయి. ఎందుకంటే ఈ ప్రతీకల్లో గ్రహించలేకపోయిన వారి నిజజీవితాలకు ఏ

నష్టపరిహారమూ దొరకదు. ఈ ప్రతీకల అసంపూర్ణత్వం గురించి ప్రజలు పోరాటం సలపడం ఒక్కటే ఇందుకు మినహాయింపు.

భూమి విలువ నిర్ణయించడంలో కూడ ఇటువంటి దృశ్యమే కనబడుతుంది. సాధారణ పరిస్థితులలో చాల ఆర్థిక వ్యవస్థలు డబ్బుతో ప్రమేయం లేనివిగానే ఉంటాయి. సరుకులు ఏ ప్రధాన పాత్రా వహించవు. అటువంటి సమాజంలో భూ యాజమాన్యంఅంటే జీవిత విధానంలో భాగమే అవుతుంది గాని ఒక సరుకు విలువకు యాజమాన్య వహించినట్టు కాదు. సాధారణంగా భూముల అమ్మకాలు జరగవు. ఒకవేళ జరిగినా, అప్పులు, తాకట్టు క్రమంలో అది ఒక చివరి ప్రయత్నంగానే ఉంటుంది. ఈ కొండ ప్రాంతాల గురించి తెలిసిన వాళ్ళెవరయినా వెంటనే గుర్తించ గల విషయమేమంటే, అమ్మకాలుగా ఉన్నవన్నీ నిజానికి ఆర్థికేతర నిర్బంధాల వల్ల జరిగిన తొలగింపులేనని. అందువల్ల, ఈ అమ్మకంలో భాగస్వాములెవరూ కూడ క్రయ పత్రాల రిజిస్ట్రేషన్లలో నిజమైన ధరలను ప్రకటించరు. కాని, అధికారిక ప్రతీకలు మాత్రం ఈ పత్రాలలో ధరలనే నిజమైన ధరలుగా గుర్తించి, నష్ట పరిహారాన్ని నిర్ణయిస్తాయి. అమ్మకం, అమ్మకపు ధర, నమోదయిన అమ్మకపు ధర అన్నీ కూడ ఒక నిర్దిష్టమైన నిరాశాస్థితినే ప్రతిఫలిస్తాయి. ఇటువంటి ధరను మామూలు ధరగా గుర్తించడమంటే, జ్వరం వల్లనో, మరే జబ్బువల్లనో నిరాశా స్థితిలో ఉన్నప్పుడు మనిషి తినే ఆహారాన్నే అతని మామూలు ఆహారంగా గుర్తించి నట్టుగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితులలో వాస్తవాన్ని వక్రీకరించడమంటే తక్కువలో తక్కువగా చెప్పినా విషాదకరమైనది. మంచినీటి పారుదల సౌకర్యం ఉన్న భూమికి నష్టపరిహారం ఎకరానికి రెండువేల రూపాయలు ఇచ్చారు. నిరాశ్రితుడైన రైతు మరొకచోట ఎకరం భూమి కొనుక్కోవాలంటే పదివేల రూపాయలు కావాలి.

ఆనకట్టలు, తొలగింపు వంటి విషయాల మీద అధ్యయనం చేసి ఉండటం వల్ల నేను ఆ అనుభవం నుంచే నిర్ధారణలకు వస్తాను. చాల తరచుగా, బాగా తెలిసిన నిత్యజీవితంలో ఎదుర్కొనే ప్రతీకల గురించి ప్రశ్నలు చుట్టుముడుతుంటాయి. ప్రతీకల కన్న వాస్తవం పెద్దదీ, భిన్నమైనదీ అనే నా అవగాహన కేవలం ఆన కట్టల అధ్యయనం తర్వాత మాత్రమే రాలేదు. నా చుట్టూ ఉన్న పరిసరాల నుంచి

కూడ ఆ అవగాహనకే రాగలిగాను. మనకు దొరుకుతున్న ప్రతీకలు వాస్తవ జీవితానికి ప్రతిబింబాలు కావు. అవన్నీ అరువు తెచ్చుకున్న ప్రతీకలు. భారతదేశం మీద బ్రిటిష్ వారి పాలన జరుగుతున్న కాలంలో బ్రిటిష్ వారి నుంచి అరువు తెచ్చుకున్నవో, ఆ తర్వాత అభివృద్ధి పేరిట, ఆధునికీకరణ పేరిట సామ్రాజ్యవాద దేశాల నుంచి అరువు తెచ్చుకున్నవో. ప్రస్తుత రాజకీయ దృశ్యాన్నే చూద్దాం. దేశం మొత్తం ఇప్పుడొక ఎన్నికల జ్వరంలో ఉంది. పార్లమెంటరీ ఎన్నికలనేవి గత నలభై సంవత్సరాలుగా మనం అనుసరిస్తూ వస్తున్న ఒక ప్రజాస్వామ్య ప్రతీక. ఇప్పటికి తొమ్మిది సార్లు ఎన్నికల తతంగం జరిగింది. ఇంత జరిగాక, ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలు ఏమి చేయవచ్చునో, ఏమి చేయగూడదో నిర్దేశించవలసి రావటం ఒక వింత విషయం. కట్టుకథలోలాగ నిరక్షరాస్యులూ, విద్యారహితులూ అయిన వోటర్ల కోసం ఈ చేయదగిన, చేయకూడని పనులను నిర్దేశిస్తే అర్థం చేసుకోవచ్చును. కాని ఈ నిబంధనలను దేశాన్ని పాలించదలుచుకున్న రాజకీయ పార్టీలకు, దేశానికి ప్రధాన మంత్రి కాదలచిన పార్లమెంటు సభ్యులకు విధిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతీక, చిహ్నం అసలు వాస్తవం కన్న చాల చిన్నది, చాల వేరయినది. అసలు వాస్తవమేమో కులం, మతం, భాష వంటి ఆర్థికేతర లక్షణాల ప్రాతిపదిక మీద విభజింపబడిన సమాజం. పార్లమెంటరీ ఎన్నికలు అనే ప్రతీకేమో ఒక సరుకుల వ్యవస్థలోని ఆర్థిక విభజనకు ప్రతిఫలనం. ఈ ప్రతీకలకు, చిహ్నాలకు సరిపోయేట్టుగా అసలు వాస్తవం మారిపోతుందని ప్రజల్లో ఆశ ఉండేది. కాని నలభై సంవత్సరాల అనుభవం ప్రకారం తేలిందేమంటే అసలు వాస్తవమే ప్రతీకను మార్చగలిగింది గాని, ప్రతీకకు తగినట్టుగా మారలేకపోయింది. అభ్యర్థుల ఎంపికలో గాని, విజయం కోసం ప్రచారంలోగాని మతాన్ని, కులాన్ని, భాషా భేదాలను వినియోగించుకోని రాజకీయ పార్టీ ఒక్కటికూడ లేదు. ఇటువంటి నిర్ధారణలు సరిపోతాయని చూపడానికి న్యాయవ్యవస్థ నుంచి ప్రాథమిక పాఠశాలల దాకా ఎవరయినా ఎన్ని ఉదాహరణలయినా ఇవ్వవచ్చు.

ఉపాధ్యాయులుగా మనకు ఇటువంటి వ్యవస్థ చెప్పేదేమిటి? సులభంగా చెప్పాలంటే, సామాజిక శాస్త్రాలను, మానవీయ శాస్త్రాలను బోధించేటప్పుడు మనం సాధారణంగా ఈ ప్రతీకలను/చిహ్నాలను పాటిస్తాం. విద్యార్థి పొందవలసిన జ్ఞానంలో వాటిని భాగం చేస్తాం. ఇటువంటి జ్ఞానమంతా అమూర్తమైనది. చాలావరకు

లేత మనసులకు తెలిసిన వాస్తవంతో సంబంధం లేనిది. బోధనా మాధ్యమం కూడా అమూర్తంగా ఉన్న ప్రాథమిక స్థాయిలో ఈ సమస్యలు మరింత జటిలంగా ఉంటాయి. ఈ స్థాయిలో వ్యవహరించే మనలో చాలమందికి మాట్లాడే భాషకూ, రాసే భాషకూ మధ్య చాల భేదం ఉందని తెలుసు. ఈ భేదం ఎంత పెద్దదంటే, మాతృభాషలోనే చదువుతున్నామని అనుకునే వాళ్ళ సంభాషణా శక్తుల్ని అమూర్త లిఖిత భాష చెడ గొడుతుంది. నిమ్న కులాలకు, ఆదివాసి తెగలకు చెందిన పిల్లల విషయంలో ఈ సమస్యలు ఇంకా క్లిష్టంగా తయారవుతాయి. నిజం చెప్పాలంటే, భాష ఒక మాధ్యమం కాకుండా పోతుంది. అది ఒక అడ్డంకి అవుతుంది. అభేద్యమైన వస్తువవుతుంది.

'మాధ్యమం' అనే మాటకు (ఇంగ్లీషులో) రెండు వేర్వేరు అర్థాలున్నాయని గుర్తించడం ఆసక్తికరంగా ఉంటుంది. ఒక అర్థం- "ఒక ఫలితాన్ని బదిలీ చేయ గలిగిన పదార్థం, సంభాషణ కొనసాగించడానికి వీలు కల్పించేది" అని. రెండో అర్థం "లోక్యం చేసుకునే ఏదైనా సాధనం, పరికరం, సంస్థ" అని. మొదటి అర్థంలో కాంతి గానీ, విద్యుచ్ఛక్తి గానీ ఒక మాధ్యమం ద్వారా ప్రవహించే ఉదాహరణ తీసుకోవచ్చు. ఇక్కడ మాధ్యమం తన ద్వారా ప్రవహించే పదార్థాన్ని మార్చదు, గుణాత్మక పరివర్తనకు గురిచేయదు. అదే కాంతి, అదే విద్యుచ్ఛక్తి మాధ్యమం ద్వారా బైటికి వస్తుంది. బోధనా మాధ్యమంగా ఒక ప్రత్యేక భాష ఇటువంటి పాత్రనే నిర్వహిస్తుంది. అధ్యాపకుడు, విద్యార్థి- అంటే మాధ్యమానికి రెండు చివరలా ఉన్న వ్యక్తులు- మాధ్యమంలో ప్రవేశం ఉన్న వాళ్ళయినప్పుడే, అంత వరకే మాధ్యమం ఈ పాత్ర నిర్వహిస్తుంది. అధ్యాపకుడు చెప్పదలచిన విషయాన్ని విద్యార్థికి అందజేయడంలో మాధ్యమం ఒక తటస్థ పాత్రను నిర్వహిస్తుంది. ఇక్కడ మన కనీస ప్రాతిపదిక ఏమంటే, విద్యార్థికి కూడ మాధ్యమంలో సంభాషణా నైపుణ్యం ఉన్నదని, మాధ్యమం పైన పట్టు ఉన్నదని, అయితే ఆ పట్టు అధ్యాపకునికి ఉన్నదానికన్న తక్కువ కావచ్చు. ఇద్దరికీ ఆ పట్టు ఉండడం అనే సాధారణ లక్షణం వల్లనే విద్యార్థి తనకు తెలిసిన దానినుంచి తెలియని రంగాలలో అడుగుపెడతాడు. ఆ రంగాలు అధ్యాపకునికి తెలిసినవే అయి ఉంటాయి. బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనే వాదనకు కేంద్రస్థానంలో ఉన్నది మాధ్యమం గురించిన ఈ అవగాహనే.

కాని మన విద్యావిధానం మాధ్యమపు రెండో అర్థాన్నే తీసుకుంటున్నట్టు కనబడుతున్నది. అంటే "సాధనం, పరికరం, సంస్థ" అనే అర్థాన్ని. మాధ్యమపు ఈ అర్థానికి వెంటనే దొరికే ఉదాహరణ వంట మాధ్యమాలు. వండటానికి, వేయించ టానికి ఉపయోగపడే నూనె ఒక మాధ్యమం. ఇక్కడ మాధ్యమం ద్వారా వెళ్ళే పదార్థం మార్పుకు గురవుతుంది. ఒక రకంగా ఈ క్రమంలో మాధ్యమం కూడ మార్పుకు లోనవుతుంది. మాధ్యమానికి ఉన్న ఈ అర్థం తీసుకుంటే, మన రోజు వారీ బోధనలో ప్రమాదకరమైన ఫలితాలు కనబడవచ్చు. ఒక ఫలితమేమంటే, మాధ్యమం ద్వారా ప్రవహించే జ్ఞానం విద్యార్థికి చేరే సమయానికి మార్పుకు లోనవుతుంది. విద్యార్థి పై తరగతికి వెళ్ళేందుకు అనుమతించే నైపుణ్యాలను మాత్రమే గ్రహిస్తాడు. పరీక్షల్లో పనికివచ్చే జ్ఞానాన్ని మాత్రమే గ్రహిస్తాడు. అందు వల్ల జ్ఞానం కేవలం సమాచారంగా మారిపోతుంది. సమాచారమంతా 'నీరు పల్ల మెరుగు' అన్నట్టు అధ్యాపకుని నుంచి విద్యార్థివైపు ప్రవహిస్తుంది. అధ్యాపకుడంటే సర్వజ్ఞుడని, విద్యార్థి అంటే ఏమీ తెలియని వాడని అనిపిస్తుంది. ఇటువంటి అవ గాహన కేవలం బోధనా మాధ్యమానికి సంబంధించినది మాత్రమే కాదు. విద్యా రంగంలోని వేర్వేరు అంశాలకు వర్తించేది. ఉదాహరణకు అభివృద్ధి చెందిన పెట్టు బడిదారీ దేశాలలో ఇన్నాళ్ళూ శోషితస్తు దేశాలని పిలవబడిన వాటిలో పాఠ్యాంశా లలో, విస్తృతమైన జ్ఞానాన్ని సమకూర్చడం జరుగుతోందని అందరికీ తెలుసు. ఢిల్లీలో కూచున్న వాళ్ళకు ఈ సమాచారాన్నంతా భారతీయ విద్యార్థులకు అందజేయా లని ఒక ఆదుర్దా ఉంది. ఇట్లా గ్రహించిన వివేకంతో ఎన్ సి ఇ ఆర్ టి ఈ సమా చారాన్ని ఇస్తూ పాఠ్యపుస్తకాలు తయారుచేస్తుంది. రాష్ట్రాల విద్యా పరిశోధనా, శిక్షణా సంస్థలు వేర్వేరు భాషల్లో ఈ పుస్తకాలకు తగిన అనువాదాలు తయారు చేస్తాయి. అధ్యాపకుల జ్ఞానాన్ని పెంపొందించడానికి అప్పుడప్పుడు శిక్షణనిస్తాయి. ఈ వ్యవహారమంతా ఒక కమెండో ఆపరేషన్ లాగ అనిపిస్తుంది. జాగ్రత్తగా పరి శీలిస్తే, పాఠశాలలలో ప్రారంభమైన ఈ క్రమం చివరికి విశ్వవిద్యాలయాలకు కూడ చేరింది. దేశవ్యాప్తంగా ఒకే పాఠ్యాంశాలను ఏర్పరచాలని విశ్వవిద్యాలయ నిధుల సంఘం ప్రయత్నాలు చేస్తోంది. కొంతకాలం కింద పాఠశాల ఉపాధ్యాయులతో ప్రారంభమైన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం కళాశాలల అధ్యాపకులకు కూడ చేరింది. వేసవి పాఠశాలలు నడుస్తున్నాయి. ఇప్పుడది విశ్వవిద్యాలయాలకు కూడ

చేరింది. కొన్ని విశ్వవిద్యాలయాలలో అకడమిక్ స్టాఫ్ కాలేజీలు ఉండడం మామూలయిపోయింది. విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఉన్నత పరిజ్ఞానం అందజేసేందుకు అవి సాధనాలయ్యాయి. ఆ అధ్యాపకులు ఆ జ్ఞానాన్ని తమ పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎం. ఫిల్. విద్యార్థులకు అందజేస్తారు. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం పేరిట ఒక విశ్వవిద్యాలయమే సమాచార కేంద్రంగా పనిచేయాలని నిర్దేశించడం జరిగింది. విశ్వవిద్యాలయ స్థాయిలోని అధ్యాపకుల నైపుణ్యాన్ని పెంపొందించే కర్తవ్యం ఆ విశ్వవిద్యాలయానికి ఇవ్వబడింది. పైపైన చూస్తే, విశ్వవిద్యాలయాలు నడుస్తున్న పద్ధతి చూస్తే ఇదంతా తార్కికమైనది గానూ, అవసరమైనది గానూ కనబడుతుంది. ఎందుకంటే జ్ఞానమేమో అతివేగంగా పోగుబడుతున్నప్పుడు, దాన్ని మనం అందుకోకపోతే, మరొకసారి అభివృద్ధి క్రమం నుంచి దూరమైపోతాం. కాని ఇటువంటి తర్కానికి లోబడకుండా జాగ్రత్తపడితే, విశ్వవిద్యాలయం అంటే ఏమిటి, మనం స్వీకరించిన ప్రతీక/చిహ్నం ఏమిటి, అసలు వాస్తవం ఈ ప్రతీకకు అనుకూలంగా మారకుండా, ప్రతీకనే ఎట్లా మార్చేసింది అనే విషయాన్ని గ్రహిస్తే మనం ఎంత సంక్షోభంలో ఉన్నామో అర్థం చేసుకోగలుగుతాం. అభివృద్ధి చెందిన దేశాలలో విశ్వవిద్యాలయాలు వాస్తవంతో ప్రయోగాలు చేసి, జ్ఞానాన్ని రూపొందించి, పరిశోధనా పత్రాల ద్వారా, పత్రికల ద్వారా, పుస్తకాల ద్వారా కింది స్థాయిలకు ఆ జ్ఞానాన్ని అందించేందుకు తయారయిన ప్రతీకలు/చిహ్నాలు. పాఠ్యపుస్తకాలనబడేవి మొదట బోధనా అంశాలు. బోధనా అంశాలనబడేవి మొదట పరిశోధనా పత్రాలు, అన్వేషణలు. ఈ కారణాల వల్లనే విశ్వవిద్యాలయాల నిధుల కేటాయింపు, కళాశాలల నిధుల కేటాయింపుకన్న భిన్నంగా ఉంటుంది. విశ్వవిద్యాలయాలు కళాశాలలకన్న ఎక్కువ నిధులను గ్రంథాలయాల కోసం, ప్రయోగశాలల కోసం పొందుతాయి. అదే విధంగా, పనిభారం పాఠశాల ఉపాధ్యాయునికన్న కళాశాల అధ్యాపకునికి, కళాశాల అధ్యాపకుని కన్న విశ్వవిద్యాలయ అధ్యాపకులకు తక్కువగా ఉంటుంది. అధ్యయనం కోసం సెలవులు, సాంవత్సరిక సెలవులు, పదోన్నతి పద్ధతులు అన్నీ విశ్వవిద్యాలయాలలో భిన్నంగా ఉంటాయి. మనం స్వీకరించిన ప్రతీకలు/చిహ్నాలు ఇవి. వీటినే మనం మన సమాజం ముందు ప్రతీకలుగా ఉంచాం. కాని నలభై సంవత్సరాల అనుభవం మనకు చెప్పేదేమంటే, భారత సమాజపు వాస్తవం ఈ విశ్వవిద్యాలయాలను జ్ఞానాభివృద్ధికి ఏమీ దోహదం చేయకుండానే

కేవలం జ్ఞానపు రీతే పెంటర్లుగా ఉండేట్టు మార్చివేసింది. ఇప్పుడు స్వభావ రీత్యా విశ్వవిద్యాలయాలు ఎంతో భూస్వామికంగా ఉన్నాయి. చుట్టూరా ఉన్న సమాజానికే అవి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి గాని, ఒక ఉన్నతస్థాయి ఉత్పత్తి శక్తులకూ, ఆస్తి సంబంధాలకు అవి ప్రాతినిధ్యం వహించడం లేదు.

పైన చెప్పిన రకపు ప్రతీక కల్పనలో ప్రాతిపదిక ఏమంటే జ్ఞానం పైననే ఉంటుందని, కిందికి ప్రవహిస్తూ వస్తుందని. ఆ మేరకు ఈ ప్రతీక కల్పన ఎంత ఆధునికంగా కనబడినప్పటికీ, దానికీ బ్రాహ్మణ పద్ధతికీ ఏమీ తేడా లేదు. బ్రాహ్మణ పద్ధతిలో కూడ జ్ఞానం కింది స్థాయిలో ఉండదనే ఒక అవగాహన ఉంటుంది. కింది స్థాయిలో జ్ఞానం లేకపోవడమే దారిద్ర్యానికీ, అజ్ఞానానికీ, మూఢ నమ్మకాలకీ కారణ మని ఈ ప్రతీకలు వాదిస్తాయి. టెలివిజన్ మీద ప్రసారం చేసిన ఒక వయోజన అక్షరాస్యతా కార్యక్రమం పాటలో కూడ ఇటువంటి దారుణమైన ప్రతీకా దృశ్యమే చిత్రణ పొందింది. ఆ పాటలో

పఢ్‌నా లిఖ్‌నా సీఖో
భూక్‌సే మర్‌నే వాలే

(ఆకలితో చనిపోయే వాళ్ళారా చదువూ రాతా నేర్చుకోండి) అని ఉంది. రూపంలోనూ, సారంలోనూ కూడ ఇది అన్యాయమైనది. హాస్యంగా చెప్పాలంటే, "విద్యావేత్తలకు విద్య నేర్వాలి" అని రాసినప్పుడు మార్క్స్ ఇటువంటి చిత్రమైన స్థితినే ఊహిస్తూ ఉండి ఉంటాడు.

భారతీయ వ్యవస్థలో సంక్షోభం గురించి మాట్లాడ్డం ఈ రోజుల్లో సాధారణమై పోయింది. ఈ సంక్షోభాన్ని విశ్లేషించే వారిలో కొందరు, ఈ సంక్షోభం ప్రగతిశీల, ఆధునిక ప్రతీకలకు, తిరోగామి, భూస్వామ్య ప్రతీకలకు మధ్య ఉందని సూచిస్తు న్నట్టున్నారు. అయితే ఈ సంక్షోభం పైపై చూపులకే గాని, సారాంశంలో నిజం కాదని నేననుకుంటాను. ఎందుకంటే ఈ రెండు రకాల ప్రతీకలు ఒకదానితో ఒకటి సరిపెట్టుకుంటున్నాయి. అయితే నిజమైన సంక్షోభం ఈ ప్రతీకలకు, వాస్తవ సమాజ చలనానికి మధ్యనే ఉంది. ఈ ప్రతీకల కన్న చాల పెద్దది, చాల వేరయినది అయిన అసలు వాస్తవమే ఈ సంక్షోభపు కోణాలను నిర్దేశిస్తోంది. ఈ సంక్షోభ పరిష్కా రాన్ని కూడ ఆ వాస్తవమే నిర్దేశిస్తుంది.

[ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఎ.పి.టి.ఎఫ్.) 14 వ రాష్ట్ర మహాసభల (ఒంగోలు)లో సమర్పించిన ప్రసంగ పాఠం]

కథ :

గురువులు

చంద్రుడు

"నేనెర్ర గొర్రెన్ తింటా...."
"నీతాత పెంచలేదు...."
"నే నెట్ట మేకలు తింట...."
"నీ అయ్య పెంచలేదు...."

పాట మంచి జోరుమీద సాగుతోంది.... ముడ్డికి కట్టిన పంచె మీదికి ఎగగట్టి-తువ్వాల నడుంకుకట్టి, ఎవలదో అడుక్కున్న పెద్ద అంగీ వేసుకొని ఇంత మీసాలున్న దాని పిలగాడొకడు అవతలి వేపున్న పిల్లల గుంపులోని ఎర్రటి పిలగాని మీదికి ఎగబడుతూ అచ్చు దొరలాగే గుడ్లు తిప్పుతున్నాడు. ఎదుటి పిల్లలు ఆ ఎర్రటి పిల్లవాన్ని మధ్యలో పెట్టుకొని దొరలాగే మీదికొస్తున్న పిల్లవాని మీదికి ఉరుకుతున్నారు. పాట సాగుతోంది.....వాదన పెరుగుతోంది.... ఇరుపక్షాలల్లో కోపం పెరుగుతోంది....

పైన ఆకాశంలో మాఘమాసపు తేటతేట వెన్నెల....చల్లగా మెల్లమెల్లగా వీచే పైరగాలి....ఊరికి దగ్గరగా ఉన్న పెరళ్ళలో ఉండీ ఉండీ కావలివాళ్ళు వేసే కేకలు....అప్పుడప్పుడు వేసంగి పొలాల్లోనో-వాగొడ్డు మీదనో నక్కల ఊళలు.... సాకల్లి ఊరు తిరిగిపోయింది.... పండల కాడికి కావలి పోవలసిన వాళ్ళ కొర్రాయిలు పట్టుకొని శద్దర్లు, గొంగళ్లు కప్పుకొని చుట్టలు తాగుతూ పిల్లల ఆటనుచూస్తూ కావలి మరిచిపోయి నిలుచున్నారు.... దగ్గరి ఇండ్ల ఆడోల్లు అందరికి భోజనాలు పెట్టి ఆఖరి గడుక మాడిసెక్కలు తెల్లగిన్నెల్ల[1] వేసుకొని అరిచేతిల పెట్టుకొని తినుకుంట తినుకుంటనే ఆట దగ్గరికొచ్చి చూస్తున్నారు.... ఏ పని లేని ముసలివాళ్ళు 'అట్ల కాదుర్ర గిట్ల' అని పిల్లలకు సలహాలిస్తున్నారు. ఆటలో పాల్గొని పిల్లలు ఒకరి జబ్బలమీద ఒకరు చేతులేసుకొని దొరవేషగాని తిప్పల్లకు పక్కాడ పక్కాడ నవ్వుతున్నారు....

---

1. అల్యూమినియం పాత్రాలు

పిల్లలు కోలాహలంతో ఆడుకుంటున్న అలాంటి వెన్నెల రాత్రి, ప్రతి మనిషి గుండె రెపరెపలాడే పైరగాలి వెన్నెలరాత్రి—ఊరంతా ఎవరి సంతోషంతో వాళ్ళు, ఎవరి పనుల్లో వాళ్ళుంటే—ఊళ్ళోని కొద్దిమంది మాత్రం మందోట కాడి మర్రి కింద మల్లగుల్లాలు[2] పడుతున్నారు....కొందరు గొణుగుతున్నారు. మరికొందరు గుసగుసగా ఏదో చెప్పుతున్నారు....

తాటి కమ్మల గుడిసె- గుడిసెమీన దెబ్బకొడితే ఒడిసి నన్నట్టు-మీరెక్కలు మీకున్నయి...ఊడగొడు ఇందర్లకు బోయినా మీరెక్కలెవడు తీసుకోడు...ఇగో మనం సంఘం బెట్టినం ...దొరలను తరిమి కొట్టినం.... గండ్ల మీతోపాటు మేము ఉన్నం ...మనందరి మీద కేసులు బెట్టిండ్లు ...మేం కేసుల సుట్టు తిర్గుతాంటే—గొడ్డు, గోదా, పంట గంగల గల్సినయ్.... మేం బాపుకున్న దేంలేదు ...పంచుకున్న దేం లేదు.... పెట్టిన పెట్టుబడి బాపె....రెక్కల కష్టం అట్లా ఉంచండ్లి.... ఇగో మనంల్లే మనకు ఏరుద్దం[3] లేదు ... రైతు కూలీలు బాగు పడాల్నంటే, పాలేరోల్ల జీతాలు పెరుగన్నంటే మేం మీ ఎంటుండ లేదా! గిప్పుడు మరపకాయ ఏరుడు కూలి పెంచాల్నంటే.... సంఘం మా బాధలు సుక[4]మూడాలె" పెర్క వీరసామి చాలా శాంతంగా చెప్పుకొచ్చాడు....

"తెల్సిందయ్యా ! మీ కడుపుల మాట దెల్సింది.... కూలినాకొడుకు ఉపాస ముప్పిడున్నా పర్వాలేదు- మా పంటలు బోయినయనే గదా మీ ఏడుపు ... మేం కేసుల్లబోతే మా పోరగండ్లు ఉపాసాలున్నరు.... మీవోల్లు మంచిగ తినుకుంట కూకున్నరు ..." సారలి లేచిపోతూ అన్నాడు....

"మరి గట్లంటే....మరి ..." వీరసామి దమ్ములు పట్టుకుంటూ ఏదో అన బోయాడు. ఛిక్కని మర్రి ఆకులు ఛేదించుకొని చాకులా వెన్నెల ముక్కొకటి వీరసామి ముఖం మీద మెరిసింది.

రైతుకూలీలను సమర్థిస్తూ కొందరు ఉద్రేకంగా మాట్లాడారు.... అంత ఉద్రేకంతో కాకున్నా సంఘం పెదరైతుల—మధ్యతరగతి రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని—నిజానికి ఇంతవరదాకా జరిగిన అన్ని పోరాటాల్లో తామే ఎక్కువ నష్టపోయామని వీరస్వామి చెప్పుకొచ్చాడు.

2. తర్జన భర్జన 3. భేదాభావం 4. కూడా

ఒక్క పెంటయ్య మాత్రం తలపట్టుకొని కూర్చున్నాడు. అతనికి ఇద్దరి వాదనలు నిజమే ననిపించింది....నిజానికి పోరాటంలో ముందుండి తన్నులు గుద్దులు తిని, ఆకలికి మాడింది రైతు కూలీలే.... కాని మధ్యతరగతి రైతు వీరసామి లేవ నెత్తిన విషయాలకు తనదగ్గర సమాధానం లేదు. ఈ గలాటా చూస్తే రేపు మిరప కాయలు ఏరటానికి కూలి పెంచాలనే పోరాటంలో ఇద్దరూ చెరో పక్క నిలబడ వచ్చు....

"ఇగో ఏది ఏమైనా మాకు సాత్తలేదు.... ఈపారి దినానికి మనిషికి తక్కెడు వరుగు (పండుమిర్చి) సవాసేరు పచ్చికాయలు ఇయ్యాల్సిందే" అన్నాడు సన్నగా పొట్టిగా ఉన్న రాములు....

అక్కడ కూర్చున్న వాళ్లలో అయిదుగురు ఆ మాటకు సపోర్టు చేశారు.... సేరాలు అనే బీదరైతు ఎటూ సప్పుడు చెయ్యలేదు.... లింగయ్య అనే పేదరైతు "వీరాసామన్న చెప్పింది సుత సమజ్ చేసుకోవాలె" నన్నాడు....

అంటే రేపు తక్కెడు వరుగు–సవాసేరు పచ్చికాయలు- ఇచ్చేదాక సమ్మె జరుగ గలదని అక్కడి వాళ్ళందరికి అర్థమయ్యింది.

వీరసామి "మీ అందరికి ఇట్టమైతే నాదేమున్నది.... నాకు యింతో అంత తెలుసుగని.... గీపారి ఊళ్ళె గుసగుసలు లేత్తయి. గదానికి నన్ను అనద్దు.... సంఘం కట్టంటే కట్టే....నేను మాత్రం మాటమీద నిలుసుంట....అందరికి నేను చెప్పేదేమంటే- ఇగో సంఘం ఏదన్న ఒక పక్క ఉంటదని మాటరావద్దు...." వీరసామి ఆఖరు మాటగా చెప్పాడు....

పెంటయ్య తనేదన్నా చెప్పుదామనుకున్నాడు. కాని అతనికి ఏదీ తోయ లేదు....ఇలాంటి ధోరణి అప్పుడప్పుడు బయటపడ్డా ఎప్పటికప్పుడు సదురుక పోవుడేగని-దానికి జవాబు గిదాని స్పష్టంగా తెలియడంలేదు....ఈసారి తెలుసుకో వాలెననుకున్నాడు పెంటయ్య.

ఆ తర్వాత రేపు చేపట్టవలసిన సమ్మె పోరాటంలో ఏ విధంగా మెదుల కోవాలోనని విచారణ సాగింది ... ఊళ్ళో హరిజనవాడలో, గొల్లోల్ల వాడలో, తెను గోల్ల వాడలో, మూడు పానాదులకాడ గోడలకు కాయిదాలు వెయ్యాలని, పొద్దున్నే వాళ్ళ వాళ్ళ వాడల్లో ఈ సంగతి ప్రచారం చేయాలని నిర్ణయం జరిగింది.

ఎటోళ్లటు లేచిపోయారు.... పెంటయ్య మూడు పానాదుల[5]దగ్గర జరిగే పిల్లల ఆట దగ్గర కాసేపు నిలుచున్నాడు. తన చిన్న కీచు గొంతుతో ఏదో పాడుతున్నాడు. ఓ పక్క విష్ణు మరికొంతమంది పిల్లలు "ఢీలమ్మ ఢీవి" ఆడుతున్నారు.... కరెంటు స్తంభం పక్క భార్య సత్తెమ్మ ఎవలతోనో ముచ్చట బెడ్తంది....

పెంటయ్య అక్కడినుండి గుడిసె కొచ్చేటాల్లకు ఇంటిముంగిటి కొట్టంల[6] ఎడ్లకు ఎవలో జొడు సొప్ప కర్ర[7] లేత్తండ్లు....

"ఎవలు ?".... పెంటయ్య లోపటికొచ్చి....

"నేనే...." అన్నాడు కర్రలేస్తున్న వ్యక్తి....

"ఎప్పుడచ్చినవ్....అంత బాగేనా ! నువ్వట్లుండు నేను మీ అక్కను పిలుసు కత్తా...." పెంటయ్య....

"పిల్లలు ఆడుతున్నట్లున్నది....ఉండనియ్ ....నేనిప్పుడే తినచ్చిన....ఎడ్లు చెపులు లొడలొడ గొట్టుకుంటాంటె గడంచా[8] తెచ్చుకోంగ కర్రలు కన్పిస్తే తెచ్చేసిన...." అన్నాడతను....

పెంటయ్య గడంచ పట్టెమీద కూకున్నడు...."ఇగో పోను పోను కంచె సిక్కు బడ్తట్టయితంది.... నాకేం సమఝయిత లేదు" అని మొదలేసి ఇంతక్రితమే జరిగిన సంఘం మీటింగుల సంగతులన్ని వివరంగా చెప్పుకొచ్చాడు ...

మధ్య మధ్య వివరాలడుగుతూ—అప్పుడప్పుడు మళ్ళీ చెప్పించుకుంటూ.... మొత్తానికి అంతా విని కాసేపు మాట్లాడలేదు....

"నిజమే ...అన్ని సంఘాలకు ఇలాంటి సమస్యలొస్తున్నయ్...." లేచి నిలబడి పచారు చేస్తూ ....

"ఎట్లా....మరి దీనికేమన్న ఉపాయం సూడకపోతే !"

"ఇది ఎందువలన ఎదురైలేందన్నది మొదటి సంగతి....దొరలు వాళ్ళ సర్కారు వాళ్ళ పబ్బం గడుపుకోనేటందుకు కులాలను, గిసోంటి భేదాలను పెంచి పోషించింది....మన పల్లెల్లో రైతు కూలినుంచి మొదలుకొని దొరలదాకా చాలా అంతరాలున్నాయి.... పల్లెల్లో కూడు—గుడ్డకు నోచుకోక అనేక వందల ఏండ్లు రైతుకూలీలు అణచబడ్డారు. కనుక తక్షణంగా మనం చేపట్టింది వాళ్ళ సమస్యలనే....

---

5. మూడు దారులు కలిసే కూడలి, 6. పశువుల పాక, 7. పశువుల ఆహారంగా వాడే జొన్న కర్రలు, 8. చిన్న కుక్కి మంచం.

పోరాటంలో ముందు నిలిచింది అధిక సంఖ్యలో ఉన్నవాళ్ళే....వాళ్ళ వాళ్ళ స్వంత లాభాలకోసమైతేంది - దొరలతోటి అంతో యింతో బాధలు పడ్డందుకైతేనేమి కొందరు మధ్యతరగతి రైతులు మనతో కలిసి వచ్చిండ్లు - మరికొందరు - గిదెట్లుంటదోనని ఎటూ పోకుంట సూసుకుంట కూకున్నరు. మనం ఇప్పటివరకు చేసిన పోరాటాలన్నీకూడా ఎక్కువగా రైతు కూలీలకే లాభించాయి.: భూములు పోగొట్టుకున్న పేదరైతులకు లాభించాయి....అయితే మనం కూలీరేట్ల పోరాటం చేపడితే సహజంగా మధ్యతరగతి రైతులు దీన్ని వ్యతిరేకిస్తారు. ధనిక రైతులు "అగో చూసిండ్లా సంఘపోల్లు ఎప్పటికైనా మాదిగ మాలోల్లను దగ్గరికి దీత్తరుగని మిమ్ముల పట్టించుకుంటారా" అని ప్రచారం చేస్తారు....నిజానికి కూలిరేట్లు పెరగటం వలన మధ్యతరగతి నష్టపోయేది చాలా తక్కువ.... ఈ నష్టం గురించి గోరంతలు కొండంతలుగా ఊహించుకుంటారు. నిజానికి రైతాంగమంతా నష్టపోయేది కూలీలకు అధిక కూలీలివ్వడం వలన కాదు....తమ తిండికి పోగా ఏమన్న అమ్ముకుందామంటే గక్కడ నష్టపోతండ్లు - పండించే పంటకు గిట్టుబాటు ధరలేదు - ఇయ్యాలున్న ధర రేపుండదు - దీస్లె[9] సేట్లంత కూడ బలుక్కొని వాళ్ళడిగింది రేటు - నిలకడ లేని ధరలన్నమాట - ఈ రైతులు కొనే ఉప్పు, నూనెలు, బట్టలు, ఎరువులు, ఇనుము అన్నీ ఏడాదికేడాది పెరుగుతయిగని తరుగయ్. నిజంగా రైతు నష్టపోతున్న దక్కడ...."

"అది నిచ్చమే కని మనం గిట్టుబాటు ధరల గురించి ఏదన్నా చేత్తె బాగుండు" పెంటయ్య....

"బాగనే ఉంటది....కని మొదటిది మన వాళ్ళందర్ని అందుకు తయారు చెయ్యాలె— పేదరైతుల, రైతుకూలీలు గది మాదిగాదని ముందుకు రారు.... రెండోది మొత్తం తాలుకానో, జిల్లానో కదిలియ్యాలె....ఆ పిలుపు యివ్వాలె ఈసారి...."

పెంటయ్యకు అది నిజమే ననిపించింది....

"ఇయ్యేడు మెట్టుపల్లి తాలుకాల కాలువ పారుకం భూములకు ఎక్కువ తాసీ[10] లేసిండ్లు....మనం తాలుకా తాలుకా నంత కదిలిచ్చినం.... తాసీలు కట్టకుంట చేసినం....గిందట్ల ధనిక రైతులు మత కలిసచ్చిండ్లు...."

9. వ్యవసాయ మార్కెట్లు. 10. భూమి శిస్తు.

వీళ్ళిద్దరు ఇట్లా మాట్లాడుకుంటూ ఉండగానే సత్తెమ్మ పిల్లలు వచ్చారు.... మూడు పానాదుల కాడ 'పోస్టరేసిండ్లని' పిల్లవాడు చెప్పాడు.

*　　　　*　　　　*

ఇంకా తెల్లారలేదు....కాని ఊరు ఎప్పుడో లేచిపోయింది. బరుకా బరుకా చీపుర్ల చప్పుడు, అలుకు జల్లడం చప్పుడు - చింతలమీద పిట్టలు, కాకుల అరుపులు, దొడ్లల్లో ఆవుల అరుపులు.... పిల్లల ఏడుపులు, ఆలస్యంగా లేచిన కోడిపుంజుల కూతలు - నల్లపిట్ట పీచు పీచు మంటోంది ఎప్పటినుండో. మొత్తానికి ఊరంతా సందడిగా ఉన్నది....

తలపాగలు చుట్టుకొని పండ్ల పుల్లలేసుకొని మన్నెపోల్ల నాంచారి, గౌండ్ల వీరయ్య ఇద్దరు కలిసి పెండ్లి బుచ్చిరెడ్డి ఇంటికొచ్చిండ్లు.... బుచ్చిరెడ్డి రెండుకాల్ల మధ్య సర్వ బెట్టుకొని పాలు పిండుతున్నడు.

కొడుకు సమ్మిరెడ్డి పెద్ద బండికి సిక్కమేత్తండు. కోడలు వాకిట్లో ముగ్గులు పెడులోంది....

"పొద్దుగాల్నే లేసిండ్లు పటేలా!" నాంచారి గోడపక్క బండమీద కూసుంటూ....

అప్పుడప్పుడే తూరుపు రేకలు బారుతున్నాయి - బజార్ల ఒర్ల సాయిలు "ఓ బర్లిడుపుండ్లి బర్లోయ్" అంటూ కేక వేశాడు.

బుచ్చిరెడ్డి బర్రె తలుగు తప్పదీసి దుడ్డెనిడిచి, పాల సరువ గూట్లె బెట్టి "ఎటో వచ్చిండ్లు పొద్దుగాల్నే...." అన్నాడు.... వాల్చున్న గడంచలో కూలబడుతూ - గౌండ్ల వీరయ్య అతని పక్క కూర్చున్నాడు.

"ఇగో మిరుపతోటలు ఏరుదామనుకుంటిమా? నాత్రి గోడలమీద కాయిదా లేసిండ్లు...." వీరయ్య....

"ఎయ్య నియ్యండ్లి - మనం సంగం మనుషులమే గద." బుచ్చిడ్డి ఓరరె గంట నాంచారిని చూస్తూ -

"మన మనుకుంటె అయితాది" నాంచారి కాలుపెండి బేడి[12] అటిటు తిప్పుకుంటూ....

---

11. గేదెలు.　12. సన్నటి కడియం.

"తొండబ్రు ఎనుగుండాక - మరో నాలుగు దినాలు ఎక్కువైతాది. ఎవలమాల్లు ఏరుకుందాం - మనకున్న తోటలెంత దమ్మిడి కానంత...." బుచ్చి రెడ్డి.

"అది నిచ్చమే ననుకోండ్లి - కని నాలుగు దినాలల్ల రాయిండుతది.... అప్పుతల బీళ్లెకు సరుకు బొబ్బలు కొట్టి దిగుతది....తీరింది మగనా ఊరు దాటియ్యమంటె గప్పుడుబోతే పల్ల[13]కు మున్నూరు బత్తె నేను చెపుగోపిచ్చుకుంట...." నాంచారి.

"మరి సల్లకచ్చి ముంత దాసుడేంది. నీ మరుసులున్న మాట చెప్పరాదు...." వీరయ్య అన్నాడు అప్పటికి సూర్యోదయమయ్యింది....

"నాదేమున్నది....ఎట్లయినా మీ ఎక్కువోల్లు ఏదంటే అది చెల్తది...." నాంచారి....

"బాగని....మీ రాజిరెడ్డి ఏమంటండు." వీరయ్య అడిగాడు....

బుచ్చిరెడ్డి కిందా మీద చూసి - వాడు మా అన్నకొడుకన్నమాటేగని నాకేం చెప్పుతడు - నాకన్న ఊళ్ళోళ్లకే దగ్గర....అయినవాడు ఏకాదాసె సంగపోల్లకు దూరముండబట్టి.... వాడే కేసుల్లబడి పీక్క పీక్క సత్తండు...." అన్నాడు.

"అగో గక్కనే ఉన్నది ఎవారమంత.... గీ సంగపోల్లు ఒక్కొక్కన్ని మనలను దూరం గొడుతరు - దొరలకు ఎతిరేకంగా ఉన్నోడంటే ఉన్నోడ అన్నరు. దొరలు బోయినంక మనమీద బత్తరు.... అగో మీ రాజిరెడ్డిని దూరం గొట్టినట్టు...." వీరయ్య....

"అది నిచ్చమే పటేలా...." నాంచారి.

బుచ్చిరెడ్డి ఏం మాట్లాడలేదు కని ఆ మాట అబద్ధమని చెప్పలేకపోయాడు.

"బీళ్లెకు మిరుప పరుగెంత త్తందో ? ధరెట్లున్నదో మావోన్ని తోల్తునా ?" నాంచారి లేచి నిలబడుతూ....

వీరయ్య, నాంచారి మరి కాసేపు మాట్లాడి బజార్లకొచ్చేసరికి పొద్దు బారెడెక్కింది....గంపలు పట్టుకొని ఆడోల్లు మొగోల్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

"కాయరాలిపోయినా ఫర్వాలేదుగని మూడు సవాసేర్ల కన్నా ఎక్కువియ్యమని షాపుకారి, పటేల్వారి, బాయికాడి బాల్ రెడ్డి, సొప్పరోల్లలచ్చిరాజం అంటండ్లు." అని ఒకడు.

---

13. క్వింటల్.

"ఏంచు కోనియ్యండ్లి –" అని మరొకడు అనుకుంటూ పోతున్నారు.... మూడు పానాదుల కాడ అప్పటికే యాభయరుపై మంది జమైండ్లు.

"ఇగో ఇందట్ల మద్దె తరగకోల్లు కూలోల్ల కి త్తె నట్టపోయింది లేదు....ఒకల కొకలం మద్దతిచ్చు కోవాలె....కూలోల్లు కూలీరెట్లు పెరుగాల్నని సమ్మె జేత్తే మధ్య తరగకోల్లు రైతులు మద్దతియ్యాలె – రేపు మిర్చికి గిట్టుబాటు ధర గావాల్నంటె – మల్ల మనందరం పోరాడాలె –" పెంటయ్య తంటాలు పడుతూ చెప్పుకొస్తున్నాడు.

వీరయ్య, నాంచారి ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"పీసుకపోల్లు మాకి త్తేనే గరీబోల్లయితంట్లా? గయి దిని మేం కండలు పెత్త నమా?" స్త్రీలు గుసుస్తున్నారు....

అంతలోకే హరిజన వాడనుండి గడిపెల్లి జక్కులు ఉరికచ్చిండు –

"రాజిరెడ్డిపటేలు తోట్ల సింతకింది బాలి, తగురపుకొండి, గుద్దెంకడు ఇంకో నలుగురు పల్లె మీదోల్లు మిరుపకాయలు ఏరుతండ్లు –" అని చెప్పాడు ఎగపోస్తూ....

"ఓర్నీ! రాజిరెడ్డికేం బుట్టింది – గుంజుక రాపోండ్లె హె...." ఎవరో అరిచారు....

"ఊళ్ళె పాటలు గీటలు బాడి – సంద దొరికుతే సెంగోటిల్లని గిదాసేసే నిర్వాకం....పెయ్యి మలమల పెత్తందేమొ అరుసుకోండ్లెహె —" ఒకడు....

ఇట్లా తలోమాట....

"ఒరే మాటలు గాదుల్లా- ముందుగాల ఆళ్ళకు నచ్చ చెప్పి తీసుకరాండ్లి .... ఆళ్ళను సూసి ఇంకొకలు మొదలుపెట్టారు...."

" మాయింట్ల నాలికకు రాసుకుందా మంటె కారం లేదు అట్లయితె నన్ను సుత ఇడుపుండ్లి —" ఓ ముసలవ్వ.

"ఎవలది గట్టుముల్లు పెద్దవ్వా! ముసలిదానిపై నవు బిస్తా గిట్లేగిర పడి ఎంతెని కేసినవే –" అప్పనోల్ల రాయలింగు —

రాజిరెడ్డి తోట్ల ఏరే మనుషుల తీసుకరాను కొందరు ఉరికారు. అట్లా అందరు తలోమాట మాట్లాడుతూ ఊరుదాటి మంకోట కింది మర్రి కాడి కచ్చిండ్లు.... అప్పటికే ఎండ ముదిరింది....

కనుచూపు మేరలో ఎర్రగా పండిన మిర్చి తోటలు.... అక్కడక్కడ కోసి గూల్లేసిన మక్కజొన్న పెరండ్లు....కొయ్యని చేండ్లు.... ఆసోల్లు గంపలు ముందు

బెట్టుకొని మున్చెట్లు బెట్టుకుంట తలల్ల పేండ్లు చూయించు కుంటున్నారు. మధ్య వయస్కులు ఊళ్ళోకి మర్రిచెట్టు కిందికి లిరుగుతున్నారు. ముసలివాళ్ళు చుట్టలు కాలుస్తూ తొవ్వలు చూస్తున్నారు. యువకులు 'అట్టచెమ్మ' లాడుతున్నారు.

మరికొంత సేపాగితే ఏదో ఒకటి తేలగలదని పెంటయ్య తన చుట్టూ కూర్చున్న వాళ్ళకు చెప్పుతున్నాడు....

ఎండ ముదిరింది—పడమటి దిక్కు పరుచుకున్న చెట్ల నీడలు చెట్ల కిందికి జరుగుతున్నాయి....కాని తోటల వాళ్ళు ఎవరూ అటు కేసి రాలేదు.... పట్టపగ లయ్యింది....ఎవరు కబురు పంపలేదు. మరింక ఈరోజు పని సాగదని కూలోల్లు మళ్ళీ ఊళ్ళో కొచ్చారు....ఈసారి కూలోల్లు నినాదాలిస్తూ వాడలు తిరిగారు....

○ ○ ○

సమ్మె మూడవనాడు విరమించబడింది....పండు కాయలు తక్కెడు యివ్వ డానికి ఒప్పుకున్నారు.... పచ్చికాయలు మాత్రం ఎవరు తెంపవద్దు....ఎవరన్నా పెడితె మాత్రమే తీసుకోవాలి.... ఈ మూడు రోజుల్లోగా ఒక్క రాణిరెడ్డి తోట తప్ప మిగతా మధ్యతరగతి రైతులు ఎవరి తోటలు వాళ్ళే ఏరుకున్నారు....రాణిరెడ్డి తల్లికి, భార్యకు చెప్పి తను మాత్రం తోట ఏరే దగ్గర ఉండకుండా వరంగల్ పోయాడు....అందరితో పాటు వాళ్ళు యిచ్చి ఏరించారు....

మిర్చి ఏరడంలో ఈసారి జనం ఎన్నడు లేనంతగా తర్జన భర్జన చేశారు....

"తలకు బాసిన ఎంటిక ఏరేపున బోతేంది అనుకున్నంగని గిట్ల చేత్తడను కోలేదత్తా...." అంది సత్తెమ్మ పక్కనున్న ముసలమ్మతో....

"ఎవల కడుపుల ఏమున్నదో ఎట్ల తెలుత్తదే పిల్లా! కాలం గడిసిన కొద్ది రంగు బయట పడ్తది...." అత్త అనబడే ఆ ముసలమ్మ కాల్లు నిలేసి నిలబడి గట్టిగానే అన్నది....

"కాయ మంచి రంగుమీదనే ఉన్నది సేటుకు మంచి ధరపడ్తది" అన్నదో అయిమూలలు తెలుపని పిల్ల....

"నేను ఊళ్ళోల్ల కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డది ఎవలు గుర్తించలేదు.... పగోనికన్న అధ్వాన్నంగ చూస్తండ్లు....జనం ఎప్పటి దప్పుడే తన్నులు దిన్నది బోయింది—దెబ్బలు దిన్నది బోయింది ఆఖరుకత్తె నా మీదనే వియనక పడ్డరు.... జనాని కంటె ఎదో తెలుప దనుకుంటాం—పోనీ పెంటయ్యన్న ఆలోచించవద్దా....

అసలు వాలకం చూస్తే....జానెడు జీ త్తేడు లేని పొల్లగండ్లు...." రాజిరెడ్డి గత ఏడాది సంఘటనలు నెమరేసుకుంటూ తిరిగాడు....

○ ○ ○

"ఇగో పిల్ల —జెర పెయిల భయం పెట్టుకొనుండు—పందెలు వతంగ కోడి పిల్లలు గూటికత్తయ్. అగో ఆ ఉట్టిమీది తట్టల పిల్లలకోన్ని కమ్మ. జెర సంద కసువు దీసి కుండలు గడుగు—నీల్లుగిన దెచ్చేవు సుమా! బాయి మంచిగలేదు. ఇగో ఇక్కడున్నట్టత్త...." సత్తెమ్మ బిడ్డకు చెప్పి వాకిట్ల కచ్చింది. మల్లేదో మతికచ్చి "జెరంత సీకటైనంక దీపం ముట్టిచ్చి గూట్లె బెట్టు." బజాట్ల కొచ్చేసరికి భుజం మీద పుస్తకాలు బెట్టుకొని ఒక పిలగాడు దుబ్బను తన్నుకుంట ఎదురయ్యిండు. "శంకరీ మావోడేడ బోయిండు." అడిగింది. ఆ పిల్లవాడు సత్తెమ్మను ఎగాదిగా చూసి "ఎనుకత్తండ్లు—" అని చెప్పి తన దారిన తను వెళ్ళిపోయాడు. "నారిగాడేడ బోయిండో....మాతే సాతగాదవ్వా! పొల్లగండ్లు దొత్తిలకు ఆగ్గల లేకుంటయ్యిండ్లు. ఇంటి యెజమాని పట్టిచ్చుకోకపాయె—అన్నిటికి ఆడిదేం పొరసూగుతది...." గొనుక్కుంటూ నడుస్తున్నది.

"ఓ అవ్వో జెప్పన రావె—సీకటైతె నాకు భయమైతది—" గుడిసె ముందు నిలబడి పిల్ల కేకేసి చెప్పింది.

"నిన్నేం దయ్యం ఎత్తుకపోదులే—మా అత్తపాయె" అనుకుంటనే సత్తెమ్మ ముందుకు నడిచింది.

కొంతదూరం నడిచేసరికి భూదేవి ఈతబొచ్చెలు, ఎండు పుల్లల మోపెత్తుకొని ఎదురయ్యింది. "బానే సత్తెమ్మ మీతోట ఏరిండ్లానె నన్ను పిలువకనే పోతిరి." అన్నది.

"ఎక్కడత్తా! మేం అందరికన్న ఎనుకబెడ్తిమి — నీ కొడుకు ఆర్నెల్లు అత్తగారింట కాన్నెనాయే-" సత్తెమ్మ-

"వాల్లింట్ల పీనిగెల్ల వాళ్ళ పిత్తినా దగ్గినా పట్టుకపోయిరి. వాళ్ళ లాపు సెల్లిచ్చు కుంటండ్లు....ఇంకేం జేత్తరులే.... అయినా పెంటయ్యదేం తప్పే...." భూదేవి మోపు కిందినుండి సత్తెమ్మను పరిశీలనగా చూస్తూ....

"ఏమోనత్తా చెప్పుతె వినడు....మీదికెల్లి దేంట్లనో ఓదాంట్ల ఏలుబెడ్తడు. అయ్యకు బుట్టిన ఆరుగురు పరమ భాగోతులేనాయె. ఓ కూడనేదా కుమ్మనేదా !

సంఘమో సంఘమని కాలుకు బట్టకట్టకుంట తిర్గుదేనాయె — ఎవలకు లేని సంఘం ఇతగానికే పట్టాయె - పెద్దోడు బొయ్యిమల్ల ఉగాద త్తె ఏడాది కావట్టె.... ఏం తింటాండో ఏడున్నడో వాని జాడ తెలువకపాయె...." సత్తెమ్మ గొంతులో గురగుర.... కళ్ళల్లో గుబగుబ నీళ్లొచ్చినయ్....

భూదేవికి కూడ కన్నీళ్ళొచ్చాయి.... వెలిసిపోయిన చీరకొంగుతో చలికిన సత్తెమ్మ చెంపల మీద కారబోయె కన్నీల్లు తుడిసింది.... భూదేవికి మాటలు రాలేదు. మాటలు చెప్పడానికేమున్నది ? ఎన్నైనా చెప్పచ్చు. కాని చెట్టెత్తు కొడుకును, చేతి కందిన కొడుకును కండ్ల ముంగట చూసుకోవాలని, పెండ్లిచేసి బిడ్డపాపలతోని తన కండ్ల ముంగట తిరుగాడుతుంటే చూసుకోవాలని ఏ తల్లికుండదు ?తనదా బట్టు బతుకు. తాగుబోతు మొగని తన్నులు పడలేక భూదేవి కొడుకును బట్టుకొని పది హేనేండ్ల కింద ఈ వూరొచ్చింది. దొరగారి దొడ్లె పాముకరిచి కొడుకు చని పోయిండు — ఎండిన మాను తీరుగ తను మాత్రం మిగిలింది....

"ఏడుత్తారు పిల్లా ! గుండె రాయి జెసుకోవాలె-మీరేగట్ల అదిరిపోతే నా అసొంటి దానికేమున్నది ? ఒంటికాకి తీర్గ బతుకుతలేనా ॥ మనం బిడ్డల గన్నం గనీ వాళ్ళ రాతగన్నమా ? రెక్కలచ్చిన పచ్చులాల్లు.... ఎగిరిపోతరు.... సారయ్య లంగకాదు, దొంగకాదు — మందికోసం - నీ అసొంటి నా అసొంటి ఎందరి తల్లుల చేతుల్ల తిరుగుతున్నడో? సత్తెవ్వా మీ వోడు నీ వొక్కదాని కొడుకు కాదమ్మా" భూదేవి కళ్ళొత్తుకుంటూ చెప్పింది....

"పిల్లొక్కటి భయపడ్తది. తోటకాడికి పోయ త్తనత్త — ఏదో ఉప్పస.... దిక్కు మల్లె బతుకుల కడుపుల సొద సెప్పుకుందామన్న కసంత తీరిక లేదాయె...." సత్తెమ్మ ముందుకు నడువబోయింది....

భూదేవికి ఏదో యాది కొచ్చి మెడలు తిక్కించి దారిపొడుగున ఎవరు రావడం లేదని రూఢీ చేసుకొని గొంతు తగ్గించి- "అపునే పిల్ల మనూల్లెకు పాటలు గీటలు దెచ్చింది గ సొదరోల్ల పిల్లగాడేగద.... మొన్న కూల్లు బెరుగాల్నంటె ఊళ్ళె పెద్ద పెద్దోల్ల పచ్చం జేరిపోయి సంగంకు ఎతిరేకం చేసిండట గద.... అందరంటె మందికి ఎటు దోత్తే అటు అంటరు-మీ యింటికచ్చి అడుగుదామను కుంటున్న" అన్నది....

"అయ్యో అత్తా నీకు గిప్పుడే ఎరికయ్యిందా? రాజిరెడ్డి దూర దూర ముండ బట్టి ఏడాదాయె...."

"సిన్ని దొంగలు బడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టయ్యింది- పిస్సదాన్ని నాకన్ని తెలిసి సత్తయా ఏమన్ననా ? అదేంది 'సిన్నవోయి కూసున్న రాములమ్మ' పదం నాలుగేండ్ల కింద గపిలగాడు పాడంగిన్నగప్పటినుంచి గీ పిలగానికి కట్టసుకం ఎరుకున్నదనుకున్న-జాగని- ఏమచ్చిందట !"

"ఏమో అత్త ... నాతోని నీకొడుకు గయ్యన్ని మాట్లాడ్తడా ? గంత పర్సాతా... అపుతల బతుకు దెరుపుండగ గీల్లతోని గీపుల్లంద లేందనుకున్నదో ఏందో ? ఏదేమైనా ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టడని- సంఘపోల్ల లాగాలన్ని దెలిసినోడు.... ఎప్పడైతె పడకుంటచ్చిందో— రాం రాం చెప్పుకోవాలె—ముసుగుల గుద్దులాటలేంది....మసినవా నీకు తెలువకనేపాయె...."

"కాదు మరి.... నా అసొంటి ఎడ్డెక్కలదుంటె నమ్మేనుడేనాయె— ఎట్లయిన సత్తెమ్మ ఉల్లిగడ్డంత సౌదరోడుంటె ఊరికి కీడని అంటరు గాదు. కాలానికి కరు వుకు ఆళ్ళ ముందేగాదు.... ఎక్కువ కులపోనికి కూటికి లేకపోనియ్యిగాక—మందిల గలువడు. కులం కులం ఒక్కటని మీదోల్ల టిక్కే తిరుగుతడు...."

"ఔనత్తా ఎట్లయిన ఆళ్ళ తెలివి గలోళ్లే... సంఘాలు గింగాలని ఊళ్ళకు పాటలు గీటలు తెచ్చిందాయినే.... చేసిందు కూకున్నడు—ఘడికట్ల కానె తేసినట్టు ఓరకు దొలిగిండు.... పోలీసోల్లు గరీబోల్ల మీదనే పడతరు ....దేంట్లనైనా ఉన్నోడు బచ్చేచే—కేసులు గీసులు చూసిండు. ఏంది గీపీకులాటని సల్లగ జారుకున్నడు. మనోల్లు మస్జైన చిక్కిండ్లు.... నిన్న మొన్నటిగ కూలీల కాన్నేనా ? మనోల్లు రానల కూకంటె అయినె సారమాపులాలు బిట్టిండు...." సత్తెమ్మ ముఖం మీది ముడ తలు కదిలినయ్.... కోపంవచ్చినట్లు ఆమె మాటతీరే చెప్పుతున్నది.... అసలు రాజిరెడ్డిమీద సత్తెమ్మకు ఎప్పటినుంచో కోపం- ఆ కోపానికి కారణం సంఘ కార్యక్రమాల్లో రాజిరెడ్డి పాల్గొకపోవడం కాదు— సారామాపులా పట్టిండని కాదు. తన పెద్ద కొడుకును ఎరట దిప్పుకొని చెడగొట్టింది రాజిరెడ్డేనని గట్టి నమ్మకం....

భూదేవికి ఇంకా రాజిరెడ్డి విషయంలో నమ్మబుద్ధి కావడంలేదు. "నీ రయ కంత సినికింది లచ్చుమమ్మో, పాసింది, పులిసింది దినిపోతే కక్కుదేర్గుడు బెట్టె లచ్చుమమ్మో" అని తన బతుకు గురించి సర్వం తెలిసినట్టు పాడిన మనిషిగానే రాజి రెడ్డి భూదేవి మనుసులో నిలిచిపోయిండు.

"చీకటయితది పోయొస్తనత్త" సత్తెమ్మ ముందుకు నడిచింది ...

మరికొంతదూరం నడిచేసరికి బుర్ర మీసాల మంగలి ఎంకటి కుంటికాలు ఎగేస్తూ ఎదురొచ్చిండు ... మంగలి ఎంకటి సాధారణంగా చెడు తెలిసిందంటే ఎవలకోవాళ్ళకు చెప్పకుండా ఉండడు.... 'ఓ సారి సైకిలు మోటర్ మీద పోతున్న దొర కొడుకును చూసి "ఇగో చిందొర ఠక్కులై సావకుంటె సూడు దొరా!' అని పెద్దదొర ముంగటనే అన్నడట - దొరకస్టే, పిచ్చికొడితే ఎడంకాలు విరిగిపోయిందని చెప్పుకుంటారు.

"ఓ సత్తెవ్వ! మీ సారయ్యను పట్టుకుంటే రెండువేల రూపాలిత్తదట గవిరిమెంటు-" అన్నడు కండ్లు పులిపొడిసి వెంకటి.

"నీ ఇంట్ల పీనిగెల్ల నీ అక్కరం నోరు పడిపోను. నువ్వెందుకు ఎదురత్తివిరా ?" సత్తెమ్మ ఇంక అక్కడుంటె అలాంటి చెడు మాట లినవలసి రాగలదేమోనని గబగబ నడిచింది ...

దొరగారిల్లొచ్చింది ... ఇదే నాలుగైదేండ్ల కిందయితే ఆ యిల్లు రాంగనే ఆడోల్ల గుండె వేగంగా కొట్టుకునేది. నక్కి నక్కి గబగబ నడిచేటోల్లు. ఇప్పుడు మాత్రం గొడ్ల పెండ, రాళ్ళ రప్పలతోని పాడుబడి పోయింది. ఇంటి పెద్దరువాజ మూసున్నది. రేకు తలపుల మీద అక్కిరి బిక్కిరి రాతలు- చిరిగిన కాయిదాలు- పడిపోయిన పడారి గోడల లోపలి నుండి బంకుల్ల జాజుతో దించిన తుపాకిబొమ్మ ఏవేవో రాతలు కనిపిస్తున్నాయి. ఆ రాతలన్నిటిలో తన కొడుకు రాసినవేవో తనకు తెలువదు. కాని తనకొడుకు రాసిన రాతలు ఉన్నాయని మాత్రం తెలుసు. పడారి గోడ ఎక్కడ తెల్లగుంటే అక్కడల్లా గజిబిజిగా, వొంకర టింకరగా, ఎర్రగా, నల్లగా రాతలు ... ఎప్పుడో అంటించిన కాయిదాలు ... ఆ రాతలు చూస్తున్నప్పుడల్లా తన పెద్దకొడుకు గుండె కనిపిస్తుంది.

మూల మలుపు తిరిగేసరికి స్కూలువేపు నుండి పిల్లల అరుపులు వినిపించాయి. "మల్లపొల్ల గండ్లకేం ముంచు కచ్చిందో ? మత్తెమంత లేని పోరగండ్లకేం ఎరుకో ? రామనేసుని కాదు సల్లారనియ్యరు.... ఏదచ్చినా ఆళ్ళకే కావాలె-" అనుకుంటూనే ఆ అరుపుల్లో తన చిన్న కొడుకు గొంతున్నదేమోనని ఆలకించింది. అన్ని గొంతులు ఒక్కలాగే ఉన్నాయి.... ఏమంటున్నారో స్పష్టంగా తెలియడం లేదు.

కోమన్ల ఇంటి ముంగటి కొచ్చేసరికి పిల్లల గుంపు ఎదురయ్యింది. చీమిడి ముక్కుల వాళ్లు, పిర్రలమీద వెక్కర్లు చిరిగిన వాళ్ళు, కొండిజెడల ఆడపిల్లలు- దుమ్ము రేగుతుండగా పిడికిలెత్తి గోలగోలగా అరుస్తున్నారు. ఎగురుతున్నారు. పిల్లల మధ్యలో చేతిలో నల్లటి తోలు బ్యాగుతో ముఖమంతా దుమ్ము పేరుకపోయి రాజి రెడ్డి ఆదరబాదరాగా చేతులు విసురుతూ బుడ్డరకాం[15] లాగా ఉన్నాడు.

ఆ లొల్లికి ఇండ్లల్ల నుండి ఆడోల్లు బయటకెల్లి చోద్యం చూస్తున్నారు. చింగులు దగ్గర బెట్టుకొని కోమటి సత్తెయ్య గద్దెమీద నిలుసుండి ఏదో అంటు న్నాడు.... కొంచెం దూరంగ నిలుసున్న మాదిగ సుక్కమ్మ వచ్చే నవ్వును ఆపు కుంటోంది. ఎదురుంగ వచ్చే మిర్చిబండి ఆగిపోయింది. ఎడ్లు నెదురుతున్నాయి. బండెనుక మేకల మంద ఆగిపోయింది....

ఆ గుంపునుండి వోరకు తొలిగి కోమట్ల గద్దెమీద ముక్కుమీద వేలేసుకొని సత్తెమ్మ నిలుచున్నది....

"పాపం రాజిరెడ్డి పరేషానయితండు- గిదెక్కడి సోద్యమే- సత్తెమ్మ పిల్ల గండ్లకు అద్దని చెప్పరాదే...." గద్దెమీద నుండి కోమటి రాధమ్మ సలహాయిచ్చింది....

"ఆల్లు నా మాటింటర ?" అన్నది సత్తెమ్మ.

"రాజిరెడ్డి...." తన కొడుకే చిన్నారి పిడికిలెత్తి అరుస్తున్నాడు

"డౌన్....డౌన్...." మిగతా పిల్లలు....

ఆ అరుపులకు మిర్చిబండి ఎద్దు కానె త్తేసింది.... మేకలు వెనక్కి తిరిగి బోయిన్ని ఖాతరు చేయకుంటా పరుగెత్తాయి.... పనుల మీదికి పోయిన వాళ్ళు ఒక్క రొక్కరే పిల్లలు తొవ్వకడ్డంగా ఉండడంతో పోగపుతున్నారు....

"నువు పాటలు గీటలు
పాడ్తివిరో కొత్తోల్ల రాజిరెడ్డి
నువ్వు సారా మూపుల
బడితివిరో సైదరోల్ల రాజిరెడ్డి...."

కొంతమంది పిల్లలు ఎగురుతూ పాడుతున్నారు.

రాజిరెడ్డి ముఖమంతా రెచ్చిపోగా ఎవరిని కొట్టాలో తెలియక పిల్లల వెంట

15. హాస్యగాడు

బడి తరుముతున్నాడు.... రాజిరెడ్డి ఒక పిల్లవాని వెంటబడితె మిగతా పిల్లలు అత నెంట బడుతున్నారు. ఆ పాటలు ఎట్లా ఆపాలో తెలియడంలేదు.... ఏమి చెప్పినా వినేటట్లులేరు. అటురుక ఇటురుక. ఒళ్ళంతా చెమట పట్టింది. పిల్లలు దూరదూరంగా పరుగెత్తుతూ మళ్ళీ మూగుతున్నారు. ఒకడు అంగి గుంజుతున్నాడు. మరొకడు లాగు గుంజుతున్నడు. ఒక పిల్ల బ్యాగు గుంజింది.

సత్తెమ్మ సరిగ్గా ఇంకా ముప్పయేండ్లున్నరాని ఆ యువకుడి స్థితికి జాలి పడ్డది.... బాలవాక్కు బమ్మవాక్కని పిల్లలు అవద్దం చెప్పరు. వెనువెంటనే కోపం వచ్చింది. "పగోడు గట్ల చేసిండంటే అనుకోవచ్చు. నిన్న మొన్నటి దనుక సంగం సంగం అన్నోడే తనదారి తను సూసుకుంటె- అండ్ల దిగినోల్ల గతేం కావాలె- ఇయ్యేల్ల సారల దేలినోడు రేపు ఇగో గీడుగీడు సంగం మనుషులని పట్టియ్యొచ్చు." అనుకున్నది.

పిల్లల గుంపు, రాజిరెడ్డి మూల మలుపు తిరిగారు.... బండి వెళ్ళిపోయింది. మేకల మంద వెళ్లిపోయింది.... మూగిన వాళ్ళు ఎవలకు దోచినట్టు వాళ్ళు చెప్పు కుంటూ వెళ్ళిపోయారు ... ఇంకా నయం పొల్లగండ్లు తన దుకాణంమీద బల్లేదు." షావుకారికి కొత్త ఆలోచనతోచి దుకానం రెక్కనొకదాన్ని మూశాడు...

ఆ మూల మలుపుమీదనే రాజిరెడ్డి ఇల్లు- ఆ రొల్లికి రాజిరెడ్డి భార్య పిల్ల వాన్నెత్తుకొని బయటకొచ్చింది. రాజిరెడ్డి తల్లి చేతులాడుస్తూ నోరంత తెరిచి పిల్లలను తిడుతోంది.

సత్తెమ్మ బజాట్ల కొచ్చి నడుస్తోంది. "నారిగాడు ఓరగంట తనను సూసిండు గని లెక్కన్న చెయ్యలేదు. పోరడు ఆగ్గెల లేకుంటయి పోతండు. 'తల్లికి బొల్లి తన ముంటె పిల్లకు సుక్కతన మత్తదట'-అయ్య దిరుగంగ కొడుకులకేమొచ్చె.... తండ్రికి చెప్పాలే...." అనుకుంటూ నడుస్తోంది సత్తెమ్మ....

ఆఖరిల్లు అయ్యగారిది.... పడావి గోడకూలి, చెట్లు మొలిసున్నది. తను కాపురాని కొచ్చిన దినాలల్లో తన మొగుడు ఆయింట్లనే పాలేరుండెటోడు.... ఆ యిల్లు కలకల లాడుతూ ఉండేది.... ఎందుకో ఆ కూలిపోయిన ఇల్లు దగ్గరికి రాగానే సత్తెమ్మ నిట్టూరుస్తుంది.... ఎప్పటిలాగే బరువుగా నిట్టూర్చి ముందుకు సాగింది.... దూరంగ గౌండ్లోల్ల పానాదిల వడ్లగిర్ని సప్పుడిన పడ్తోంది... కొద్దిగా నడిస్తే వాగు.... ఈత బొచ్చెలచ్చేదాకా వాగుల్నే నడువాలే.... చెలిమల కాడ ఆడోల్లు ముచ్చెట్లు పెడుతున్నారు....

ఈదులు దాటి తాళ్లల్ల కొచ్చింది. పొద్దాడు మీదినుంచి గౌండ్ల చిన్నయ్య "ఓ సత్తెక్క మాపటించి ఎటో బిరబిర పోతన్నవ్." అని అడిగిండు పెద్దగా కేకేసి ...

"తోట కాడికి పోతన్న తమ్మీ ...." అన్నది....

చిలుకలు కిలకిల మంటూ ఆకాశంలో ఎగురుతున్నాయి- ఎక్కడో ఎల్లమ్మ బోరు తాళ్ళల్ల కావచ్చు ఎవడో కొండ పొడుగు రాగం తీసి పాడుతున్నాడు ... పొద్దు గూకింది.... తోటకాడికి చేరుకున్నది సత్తెమ్మ.

పెంటయ్య తోటపక్క పొలం దొయ్యలకు మోటగొట్టి- నూతిల నీళ్ళు ఒడువంగానే మోటిడిసి ఎడ్ల మూతులకు బుట్లు కట్టి మొక్క చుట్ట అంటించుకొని తాగుతున్నాడు.

"ఇగో పైరగాలి దోత్తంది. దండెడ మోట బార్లల్ల ఇడిసిపెడితె సెదలు బడ్తది- మలిసి దోనిల బెట్టాన్నావె—" అన్నాడు ఇంకో రైతు అయిలయ్య.

"నీ కెందుకురా నేను బెట్టుకుంట గదా!" పెంటయ్య

"మరైతే ఈపారికి పిటీషన్ ఏమియ్యమని అకీలుకు చెప్పేటందుకు మనిషిని తోల్దాం." అయిలయ్య ...

"ఎవలకు పుర్సతున్నది- ఎవలదోల్దాం?" పెంటయ్య.

"అగో అదిన త్తంది-" అయిలయ్య సత్తెమ్మను చూసి పోబోయాడు.

"ఓర్నీ నువ్వు మా సత్తెమ్మకే భయపడితే సంగంల బనికిరావు సుమా!" పెంటయ్య చిన్నగా నవ్వుతూ.

సత్తెమ్మ కాలిమట్టెల చప్పుడును బట్టి కోపంగా ఉన్నట్టు గ్రహించాడు.

"నాకు ఆడోల్లు మాత్తె భయం ..." గుసగుసగా అయిలయ్య ...

"మరదలు నిన్ను ఎదురగొట్టిందిరోరే!" పెంటయ్య పెద్దగా.

"ఇంక పొద్దు గూకలేదా! మచ్చటుంటె ఇల్లు పెండ్లాం పిల్లలు యాదొచ్చేరా! పొద్దున రాంగ చెప్పిన ఇంట్ల కారంలేదని- ఇగత్తవ్ అగత్తవని సూసి సూసి సత్తి- మారేనయ్య నానుంచి కాదు." అనుకుంటనే మిరుపతోట్లకు దిగి మిరుపకాయలు బరుకసాగింది.

"గిప్పుడు ఇల్లుకు పిల్లలకేమచ్చింది?" పెంటయ్య చుట్ట కొరుక్కు ఉమ్మి రాస్తూ.

"ఏమ త్తది ఏమిరాదు ... పెద్దోడు దేశాలుబట్టి పోయిండు. సిన్నోడు పోల్ల గండ్ల కుప్పేసి రాజిరెడ్డిని ఆటలు పట్టించుకుంట ఊరేగుతండు. వాడు రేపో మాపో చెంగో చిల్లంటడు. కమినిట్ల ఇల్లని ఉన్నోక్కపోరిని ఎవడు సేసుకోడు ... నీకేంది? ఎవలెక్కడబోయిన సంగముంటెసాలు ..." సత్తెమ్మ కోపంగా అందామనుకున్న మాటలు దుఃఖంలోకి దిగాయి.

"జెర తాలు-తాలవమ్మా ... పిస్సదానా పైరగాలి బెడ్తంది . గాలి బెట్టిన దిక్కు చెట్లంగుతయి ... ఓ ఆకు నేనూగ పొమ్మంటే కలుస్తాదే . మంచయినా చెడ్డయినా అందరితోని మనం . నీ వొక్కదానికేనా కష్టాలు ..." పెంటయ్య.

భార్యభర్తల మాటలు అట్ల నడువడం చూసి అయిలయ్య "గౌడ్ల త్తయి ఇంటికాడెవలు లేరు." జారుకోబోయాడు.

"అయిలయ్య! ఇయ్యల్ల జెరంత కూసుండాం అట్ల వస్తవా?" పెంటయ్య ...

"ఆఁ ... ఆఁ" అనుకుంటనే అయిలయ్య నాలుగడుగులేశాడు.

"ఇగో జెరంత గీ ఎడ్లను గొట్టుకపోయి మట్లకుబెట్టు -" పెంటయ్య.

అయిలయ్య తిరుగొచ్చి దంతెడ దోనిలబెట్టి ఎడ్లను అదిలించుకపోయాడు.

పెంటయ్య సత్తెమ్మ దగ్గరికి పెళ్ళి తను మిరుపకాయలు తెంపసాగాడు. కాసేపు గొణుగుతూ, కాసేపు కోప్పడుతూ మొత్తానికి తను చూసిన సంగతి పెంటయ్యకు చెప్పింది ...

"ఎవలిడిసినా పిల్లగండ్లు వొదిలేటట్టు లేరు ... గోసబుచ్చుకుంటండ్లు ... ఊళ్ళె గన్పి త్తెసాలు ఎంట బడుతండ్లు ..." పెంటయ్య....

ఎవరి ఆలోచనలు వాళ్ళు చేస్తూ చీకటిపడ్డ తర్వాత ఇద్దరు ఊరికేసి నడిచారు....

అయ్యగారిల్లు రాంగానే పెంటయ్య టక్కున ఆగిపోయి "రామేశ్వర్రావు మతికున్నాడే ...?" అని అడిగాడు....

"నాకు దినాం ఈ తొవ్వెంట రాంగ యాదొ స్తడు ..." అన్నది సత్తెమ్మ

"పాత కమినిట్లల్ల పనిచేసిండు ... మాసిన్నతనంల జేల్లకుబోయిండు.... నాకు నాలుగచ్చరం ముక్కలు నేర్పింది గయినే ... కొడుకులు పట్నంలున్నరట - అయినె ఆరేండ్లకింద పోయిండట -" పెంటయ్య ...

"మా చెప్పినవ్ ...." సత్తెమ్మ....

సత్తెమ్మ ముందు పెంటయ్య వెనుక నడుస్తున్నారు ...

* * *

మిరపతోటలు రెండవసారి ఏరడం మొదలుపెట్టారు....పెంటయ్య తోట మొదట ఏరడం పూర్తయ్యింది. ఇండ్లముంగట ఎటుచూసినా ఎర్రగా మిరప పండ్ల రాసులే....ఊరు ఊరంతా లెక్కల్ల మునిగిపోయింది.

చింతికింద నర్సయ్య బీట్లైకుపోయి ధర కనుక్కవచ్చాడు.

ఉదయం ఇంకా పదిగంటలు కానేలేదు. పెంటయ్య, సత్తెమ్మ మిరపపండ్లను వాకిట్లో కట్టలుగా పోస్తున్నారు. సత్తెమ్మ వచ్చే పైకంమీద కలలు కంటోంది. మిరపకాయలు అమ్మి ఏమేమి కొనాలోనని ఆలోచిస్తోంది.

చింతికింది నర్సయ్య గడంచవాల్చుకొని కూర్చుండి - "బావా ధర మాంచి జోరుమీదున్నది. ఒకటో నంబరు కాయకు పల్లకు వెయ్యి పలుకుతుంది....ఇయ్యేడు ఏమెల్లినట్టులేదు కాయ మూడు పొనుక[16]లయ్యిందా ?"

"ఏడిది మూడో పొనుక నిండనే లేదు....ఇంకో రెండు పొనుకలెల్లుతది కావచ్చు - ఇయ్యేడు కర్సులు గిట్టుడే కట్టం....ఏపాటి బండ్లచ్చినయ్ బీట్లైకు ?" పెంటయ్య....

"ఎంతొచ్చిన కొద్దిలనే - పర్కాల, గరిమిండ్ల పెల్లినుంచి పది లారీలచ్చినయ్ - ఎక్కడ ఇంక పురాగ సరుకు చేతికిరాలే."

"నాతోటే ఎనుకకయ్యిందనుకున్న -"

"ఇయ్యేడు అనలులేక అందరియి ఎనుకనే అయినై - పంట సుత్ అంతంత మాత్రమే - ముడుతరోగం, కొరుకుడురోగం ఇసురక పోయినయనుకో - మందులు కొట్టి కొట్టి సత్తిమి."

"ఏమో మనం గొంటబోయేటాల్లకు సవ్వన ధర దింపుతరేమో అడ్తిదార్లు...." పెంటయ్య లేచివచ్చి గడంచలో నర్సయ్యపక్క కూర్చుంటూ.

నర్సయ్య బీడీకట్టతీసి తనోటి ముట్టిచ్చి పెంటయ్యకొకటి యిచ్చిండు.

"ఎంత దిగినా నూరో యిన్నూరో దిగుద్ది - ఆడికి మంచి పడుతలే కదా !"

"ఏట గట్లనే అనుకుంటున్నం - గుర్రం కడుపుల గుడ్డు - ఎరువుల బత్తాలియ్యంగ, మందులమ్మంగ ఈ జిల్లల ఎన్నెకరాలు తోటలు బెట్టిండ్లో అంచన కడుతరు సేట్లు. మనం తోటల ఏరడం మొదలువెట్టి ఒకటి అరబండ్లు రాంగనే సవ్వన ధర దెంచుతరు. ఇగ అట్ల రైతులు ఏగిరపడి ఉన్నది లేంది ఊడ్చుకపోంగనే

16. వెదురు తడుకతో అల్లినవి.

సవ్వన మూస్నార్లు చేస్తరు....మనం ఇన్ని నీల్లు జల్లి అంకాలు గట్టుకపోతమా ? కిరాయలు పెట్టుకొని వత్తిమా ? మల్ల ఎనుకకు కొంటబోమని ధీమా ! గొడ గొడ ఏడ్సుకుంట ఆళ్ళన్నంత ధరకు ఏసత్తం...."

"ఊరూర సంగాలుపెట్టి ఊళ్ళె ఆళ్ళ ఆటలు సాగకుంటజేత్తిమి. మరిఅందర ముక్కపైతే ఏదన్న చెయ్యలేమా ?"

"ఎందుకు చెయ్యలేము...అన్ని సంఘాలు కూడబలుక్కొని గిట్టుబాటు ధరల గురించి కొట్లాడాలె...."

ఇట్లా కాసేపు మాట్లాడుకున్నారు -

"ముండ బొట్టికి దండంపెడితె నాతీరు గుండుమని దీవెన బెట్టిందట - మీబావ కన్ని అనుమానాలే - ఏర్గబోను ఏడుగునాత్తాలు[17] జేత్తడు. గీన్తోనేందన్నా బజా రంనాడు కాయలు కొండబోదాం." అన్నది సత్తెమ్మ - మల్ల కొట్లాట గిట్లాట అంటండు - కాయలీడబెట్టి తిరుగుతడేమొనసుకొని.

"జా బావా ! రాణిరెడ్డి సంగతేమన్న తెల్సిందా ? బాల సంఘపోల్లు ఇజ్జత్ తీత్తండ్లు గదా ! ఏనాడాపె మనకు దూరమయ్యి ఇంకోడైతే ఊకుందురా ! పంచాతు బెట్టి మీకు మాకు రాం రాం అని చెప్పకపోదురా ! ఎంతైనా సదువుకున్నోడు సదువు కున్నోడే ...కిందబడ్డా ఒంబోతే మీదబడ్డా ఒంబోతే." నర్సయ్య గుసగుసగా అన్నాడు.

"మనకు చెరుపు చెచ్చేదసుక చూద్దాం." పెంటయ్య....

"బాగున్నది పని వరుస - సంగపెద్దవు నువ్వే గిట్లంటెట్ల ? దొంగలుబడ్డ ఆర్నెల్లకు మనం కండ్లు తెరిత్తెట్ల....చెరుపు ఎంత తెత్తడో ఎవలెరుక - ఇగో గిట్ల ఇడిసిపెడితె ఒక్కొక్కడు గట్లనే ఎల్లిపోయి సంగంపేరు చెప్పుకొని దందాలు చేత్తరు. పబ్లిక్కెము ఎవడు మనోడో ఎవడు మందోడో తెలియదు. అయింక మనం సికుల్ల బడ్తం. ఇగో రాణిరెడ్డికి పెద్ద పెద్దోల్లతోనే సోపతి - మనదెంత కోన్కిస్కగాళ్ళం." కండ్లు పులపొడిసి నర్సయ్య అన్నాడు.

"అంటె...."

---

17. వివారాలు.

"కోప్పడకు బావా! పార్టోల్లు రాణిరెడ్డికి ముందుగాతెలుక - మనకు ఎనుక - మనకన్న రాణిరెడ్డికే ఎక్కువ...."

"అయితే...." పెంటయ్య నోరుతెరిచి.

"ఏమో లోపటి చిక్కులు నాకే ఎరుక - సంకలేవడితె ఖర్చం కండ్ల బడ్తది - ఏటన్నా తిప్పలే - నలుగురితోని నారాయణ. ఊళ్లోల్లు మాత్రం - రాణి రెడ్డిని ఎందకంటు నిలదీత్తలేరని పిసపిస లాడుతండ్లు...." నర్సయ్య లేచి వెళ్ళిపో బోతూ....

"నా మనుసుల మాట చెప్పిన....నాకన్న నీకు ఎక్కువదెలుసు - విచారం చెయ్య -" అని చెప్పిపోయాడు.

పెంటయ్య ఆలోచనలో పడ్డాడు.... ఎవరో ఒకరు ఇలాంటివి చెప్పుతూనే వున్నారు.... నిజానికి ఈ మాటలన్నీ పార్టీకి పీలైనప్పుడల్లా తెలుపుతూనే ఉన్నాడు. పని తీరకనో మరెందు చేతనో వాళ్ళు తేల్చి చెప్పడం లేదు.... నర్సయ్య అన్న ట్లుగా రాణిరెడ్డి మీద పార్టీ వాళ్ళకు ఏమన్న ప్రత్యేక శ్రద్ధ ఉన్నదా? మారే వాళ్ళకు ఏ ఒక్కడు ముఖ్యంకాదు.... అట్లైందు కైతది ... ఎద్దెగురంగనే గంటెగురుతదా?" పెంటయ్య ఆలోచనలు పరిపరి విధాల బోయినయ్.... "మారే వాళ్ళు అట్లా చేయరు" అనుకొని సమాధాన పడ్డాడు.

× × ×

సారా మామూలా మిత్రులు సాయిరెడ్డి, కమలాకర్, రాణిరెడ్డి బస్సుదిగి బార్ అండ్ రెస్టారెంట్ల సంగతి కులాసాగా మాట్లాడుకుంటూ వస్తున్నారు.... ఆ యిద్దరు కూడా పాతకాలంలో పోరాటంలో తిరిగిన వాళ్ళే.... సాయిరెడ్డిది కరీంనగర్ జిల్లా.. ఒకప్పుడు ఆయన పేరు చెప్పితే దొరలకు గుండె లాగేటియి.... దళంల పొమ్మన్నరని, తను చెప్పింది వినలేదని, బయటకు చెప్పతడు- లోపల మిత్రులతో మాత్రం "నిన్న మొన్నటి బచ్చెగాళ్ళకు జిల్లా కమిటిలో స్థానమిచ్చిండ్లు- తనను మాత్రం ఆర్గనైజర్ స్థాయిలనే ఉండుమన్నరు." అని గుసగుసగా చెప్పతడు.... అసలు కారణం మాత్రము- ఒకటి రెండు ఎన్‌కౌంటర్లు జరిగి ప్రాణంమీద తీపి పెరిగి వచ్చేసిండు.... ఎంత హీరోయిక్‌గా పోరాటంల పాల్గొన్నడో అంతే హీరోయిక్‌గా పాత కాలపు సారా కంట్రాక్టర్లను కాదని మామూలా బట్టిండు. మాజీలనందర్ని కప్పేను

కున్నాడు. తను పార్టీమీద పెట్టిన విమర్శకు మద్దతుండాలి గదా.... ఇంకోటి ఏది చేసినా ఈ మాజీలే చేయగలరని నమ్మిక.

కమలాకర్‌కు సాయుధ పోరాటం మీద నమ్మకం పోయింది- ఆయనకు బోలెడన్ని ఆలోచనలున్నాయి. జరిగే పోరాటం ఇట్లాకాదని గంటల తరబడి చెప్ప గలడు. కాని నువ్వేం చేయగలవో? చెప్పమంటె మాత్రం నక్కిల్లు దగ్గర పడు తాయి. రాజకీయంగానే విభేదాలున్నాయని బాహాటంగానే చెప్పక తిరుగుతున్నాడు.... ఎట్లాగైన ఒక లక్ష పోగేసి- మిగతా పార్టనర్స్‌ను కలుపుకొని తన అభిప్రాయాల కనుగుణంగా మంచి విప్లవ సినిమా తీయాలని, తద్వారా రచయితగా కూడా పరి చయం కావాలని పెద్ద ఆలోచనే ఉన్నది....

మరింక రాజిరెడ్డి ఇంకా అలాంటి పెద్దపెద్ద ఆలోచనలేం లేకున్న- కేసుల నుండి బయటపడి మొత్తానికి భద్ర జీవితం గడపాలని ఉన్నది.... అతను కొత్తగా వ్యాపారంలోకి వచ్చినవాడు.... డబ్బులు చేతిలో కొస్తే ఏమేమి చేయగలడో అత నింకా ఆలోచించలేదు....

ముగ్గురు కులాసాగా కబుర్లు చెప్పకుంటూ నడుస్తున్నారు. పొద్దు గూకడానికి సిద్ధంగా ఉన్నది.... అసలు వాళ్ళిద్దర్ని ఊళ్లెకు తీసుకరావడం రాజిరెడ్డికి ఇష్టం లేదు.... కాళ్ళకింది నుండి నడుస్తూ ఊరు దగ్గెర పడుతున్న కొద్ది రాజిరెడ్డి గుండె వేగంగా కొట్టుకోసాగింది.... స్కూలు దగ్గరికి వచ్చేసరికి బుగులు బుగులుగానే ఉన్నది. మామూలుగానైతే ఈపాటికి పిల్లలు స్కూలు ముందట ఆడుకుంట ఉండే టోల్లు- లేరంటె గండం గడిచినట్లే-

"ఇయ్యేడు ఎంత లేదన్న లక్షరూపాయలుంటయి." సాయిరెడ్డి ముక్కుల నుండి సిగరెట్టు పొగ వొదులుతూ- ఎడంచేతిలో గోల్డుప్లేకు సిగరెట్టు పెట్టె టకటక లాడిస్తూ....

అంతకన్న ఎక్కువే ఉండగలదని కమలాకర్‌కు తెలుసు.... అయినా "ఇంక మామూలా కిరియడ్ పూర్తికాందే లెక్కలు పెట్టడం ఏమంత మంచిది కాదు" అన్నాడు.... వంగి బూట్లమీద దుమ్ము తుడుచుకుంటూ.... "జీబు తెచ్చుకుంటె- బావుండేది-" అన్నాడు....

రాజిరెడ్డి లాభాల గురించి ఆలోచించడం లేదు. పిల్లల గురించే సందులు గొందులు చూస్తున్నాడు-

"సువ్వేమంటవ్...." సాయిరెడ్డి రాజిరెడ్డినడిగాడు.

"ఆఁ వాళ్ళతోనేంది ?...." అన్నాడు పరధ్యానంగా.

"మనోనికి పార్టోల్ల పిరికి పోనట్టున్నది...." ఇద్దరు గట్టిగా నవ్వుతూ అన్నారు....

"మాటల్ల డెమొక్రటిక్ సెంట్రలిజం అంటరు. చేతల్ల మాత్రం మీదికెల్లి రుద్దుడే...." కమలాకర్ పార్టీ విషయం రాగానే విమర్శ మొదలేశాడు ...

"వాళ్ళంటే బాగానే ఉండు.... లెనిన్, మావో అన్నరని చెప్తరు గదా...." సాయిరెడ్డి....

రాజిరెడ్డికి ఈ సంభాషణ నచ్చలేదు.... "ఇగో మనమెందుకు మనకు సాతగాక వచ్చినం ... చేసేటోల్ల మీద దుమ్మెత్తి పొయ్యటం- దేనికి?" అన్నాడు మెల్లగా....

"అంటే పార్టీ అంటె మాకు నమ్మకం లేదనా ? పార్టీ ప్రజలకోసం పని చేస్తున్నప్పుడు మంచి చెడ్డలు విచారం చెయ్యటానికి అందరికి హక్కున్నది." కమలాకర్ ....

ఇంతలోనే ఊరొచ్చింది. మూల మలుపు దగ్గర ఎవడో కాల్లదాకా లొడ లొడ అంగీ వేసుకున్న బోడగుండు పోరడు ఎక్కిరిచ్చి ఉరికిండు ... మిత్రులిద్దరు అది చూశారు.

"బచ్చేగాడు వెక్కిరిస్తండేంది ?" సాయిరెడ్డి-

"తీట పోరగండ్లు-" అన్నాడు రాజిరెడ్డి-

కమలాకర్ గోడలమీది రాతలు చదువుతూ నడుస్తున్నాడు. "సాయుధ పోరాటమే ఏకైక మార్గం", "తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుంది", "దున్నేవానికే భూమి-" "రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదం నశించాలి". అని చదివి.... "అబ్బ మీవొక్క ఊళ్ళె రైతులకు కావాల్సిన స్లోగన్ చూసిన.... అవ్వన్ని రైతులకు తెలుస్తయా ?"

"మనోడికి తుపాకంటేనే గుండెదడ-" అన్నాడు సాయిరెడ్డి నవ్వుతూ....

మరోచోట పెద్దగా వంకర టింకరగా రాసిన బొగ్గురాతలు "రాజిరెడ్డి డౌన్... డౌన్...." కమలాకర్ పెద్దగా చదివి- "అయితే నీమీద కూడ దాడి మొదలయ్యిందన్నమాట-" "రాజిరెడ్డీ ! మన మీద కరపత్రం తీస్తరటగద...." అన్నాడు....

"అవార పోరగండ్లు" సంజాయిషీగా ఏదో చెప్పబోయాడు రాజిరెడ్డి- సాయిరెడ్డి కరపత్రం సంగతి విని మాట్లాడలేదు....

ఇంతలోనే రాజిరెడ్డి ఇల్లొచ్చింది.... రేకు పొటుకులు తెరిచున్నాయి....లోపల గోడల మీద ఎక్కడా సందులేకుండ అల్లిబిల్లి రాతలు. 'రాజిరెడ్డి దొంగ, రాజిరెడ్డి లంగ' ఒరే సంగాన్ని పైసల కమ్ముకోకు ఇట్లు "బాలసంఘం". ఇట్లాంటివే చాలా రాతలున్నాయి. రాజిరెడ్డి ముఖం తెల్లగా పాలిపోయింది....

సప్పు తెచ్చిపెట్టుకుంటూ.... "కూర్చోండ్లి"- రెండు ఆరాము కుర్చీలు తెచ్చే శాడు.... ఆ రాతలు చూచేసరికి కమలాకర్‌కు, శాయిరెడ్డికి మతిపోయింది....

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఏదో జరిగిందని రాజిరెడ్డి ఊహించాడు. "అమ్మా" అనుకుంటూ లోపలికి పోయాడు. లోపల భార్య పిల్లవాన్ని పడుకోబెడుతుంది. ఆమె కండ్లు ఉబ్బి ఉన్నాయి....

"ఇగో మా దోస్తులొచ్చిండ్లు.... అమ్మేది...." అన్నాడు రాజిరెడ్డి సాధ్య మైనంత మృదువుగా....

"ఏందెచ్చిండ్లు మీ దోస్తులు.... నీకేంది మారాజువు? ఊళ్లె వాల్లను తప్పించు కోను ఏడికన్న బోతవు. ఊరిపోరగండ్లంతా ఇంటిమీదికొచ్చి ఎంత లొల్లి చేసిండ్లు?"- సుగుణకు దుఃఖం ముంచుకొచ్చింది....

"పొల్లగండ్ల ఏం చేసేటట్టు లేదు...." రాజిరెడ్డి గొణిగిండు.

"మరింక నీ యిష్టం- నన్ను మా అమ్మ వాల్లింటికాడ వొదిలిపెట్టు- మీ అమ్మ తోటి కాదుంటది- నేను ఇంట్ల ఒక్కదాన్ని బయటికి కాలుపెట్టక నెలరోజు లయ్యింది. ఊళ్లె ఎవలు మాట్లాడ్తలేరు...." ఇంకా ఏదో అంటూనే....

"సరె సరె! కానియ్యి. ఏదో ఒకటి చేద్దాం. బయట మా మామూలా వాళ్లు న్నరు."

"ఉంటేంది.... ఉండనియ్యి. ఊళ్లెకు ఉప్పుకు గొరకాకుంటయ్యింది. బయట పరువు గావాల్నా- అదె ముందుగనే ఈ బుద్ధుంటే బాగుండు గదా! నిన్నెవలు సంగమో సంగమని తిరుగుమన్నరు? తిరిగినోనివి మద్దెల ఎవలు ఎల్లి పొమ్మన్నరు. సాకల్దానికి సుత్ అలుసైపోయింది- "మనుష్యులందర్ని దంగల్ల దించి తను దొంగల్ల కలిసిండు" అని ముఖం మీదనే అనబట్టె సుగుణ గట్టిగానే అన్నది.

"జర మెల్లెగ మాట్లాడవే" రాజిరెడ్డి పండ్లు బిగపట్టి అన్నాడు.

"ఏంది మెల్లెగ మాట్లాడేది- నీ పరువు గోడల మీద కన్పత్త లేదా ?"

రాజిరెడ్డికి అట్ల కోపమొచ్చింది. జాడిచ్చి సుగుణ చెంపమీద కొట్టాడు....

సుగుణ నిశ్చేష్టురాలయ్యింది.... అఖరుకు అన్ని కబుర్లు చెప్పిన తన భర్త ఇంతకు దిగజారగలడని నమ్మలేకపోతోంది.... ఆడోళ్లు, హక్కులు, పోరాటం అని చెప్పిన భర్త తనను కొట్టిండు....

"కమినిస్టులు భార్యను కొట్టిండ్లు గదా! పెండ్లాన్ని గన్క కొట్టో తన్నో అఖరుకు మెడలు పిసికో నోరు మూయించుతరు. అంతలావు రోషమున్నోనివైతే మంది నోరు మూయించు—నీ దోస్తులనే అడుగుత పా— గింత మాటకు కొట్టుడెంట లేమొ ?" సుగుణ ఏడుస్తూ బయటకు రాబోయింది. ఆగడబిడకు పిల్లవాడు లేచి ఏడ్వసాగిండు.

రాజిరెడ్డికి నిజంగానే మతిపోయింది. ఏం చేయాలో తోచలేదు. ఆదర బాదరగా బయటకొచ్చాడు....కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. అప్పటికే మిత్రులిద్దరు పరిస్థితి బాగాలేదని తిరుగు ప్రయాణమయ్యారు.

రాజిరెడ్డికి పాతకాని కోపం హెచ్చింది. మళ్ళ కొళ్ళ బాదుతూ లోపలికురికి సుగుణను జడపట్టి డబడ దిబడ బాదిండు. సుగుణ ఎదురు తిరిగింది. రాజిరెడ్డిని బయటకు గెంటి తలుపు పెట్టుకున్నది.

కోపంతో పండ్లు కొరుకుతూ బయట కొచ్చాడు. అప్పటికే వీధి దీపాలు వెలిగినయ్. పెద్ద పెద్ద అంగలేస్తూ బజార్లో నడుస్తున్నాడు.... చేలదగ్గరి నుండి, తోటల దగ్గరినుండి వచ్చే జనం, పోయే జనం ఓరకంట రాజిరెడ్డిని గమనిస్తూ పోతున్నారు....

"తొండ బ్రిరు ఎనుగులదాకా" ఎవడో మక్కజొన్న కర్రల కిందినుండి తల ఈతల బెట్టి అన్నాడు.

"ఔరా.... తొండ బ్రిరు ఎనుగులదాకనే— మీ అందరికి కండ్లు నెత్తికెక్కినయ్. మన్నుదిన్న పంజేరుగున్నలోలే పడుంటే బాంచెన్ బాంచెనని తన్నినా గుద్దినా పడుంటే మీమ్మలందరిని కుప్పేసి సంఘం బెట్టి-కూలీలు పెంచిపిచ్చింది— తకరారు భూములిప్పిచ్చింది నా తప్పే.... పోలీసులు ఊరిమీదపడి తన్నుతాంటే చెట్లు పుట్టలు బట్టి ఉరికిండ్లు-గప్పుడు నేనన్ననా ? పరంపోగులు దున్నిచ్చింది బోయింది- ఇప్పటికి కేసుల చుట్టు పుచ్చిన కుక్క తీర్గ తిర్గిసత్తన్న— ఇండ్లల్ల కాకుండి పోరగండ్లను నా యింటిమీదికి ఉసిగొల్పి సోద్యం చూస్తండ్లు- ఎంతదాక చేస్తరో నేను చూస్త..." రాజిరెడ్డి మాటకు మాట పొంతన లేకుండా వదురుతూ బస్సు స్టేజీ దగ్గరికి నడిచాడు.

రాజిరెడ్డి స్టేజీ దగ్గరికి చేరుకోవడం, బస్సురావడం ఒక్కపారే జరిగింది.... ఇద్దరు మిత్రులు బస్సెక్కి "బాధపడకు రాజన్నా....మల్లెప్పుడన్న వస్తం".... అన్నాడు సాయిరెడ్డి....

ఇప్పుడు ఇద్దరిని తీసుకచ్చి కూడా చేసేదేమిలేదు. రాజిరెడ్డి చప్పుడు చేయ లేదు. బస్సెక్కి తను వాళ్ళతోపాటు పోదామా అనుకున్నాడు....ఎందుకో పోబుద్ధి కాలేదు....

బస్సు కదిలింది....రాజిరెడ్డి ఒక్కడే మిగిలాడు....మనసింకా కుతకుత ఉడుకుతూనే ఉన్నది. ఎన్నాదినుండి మసిలి మసిలి మరింక మసుగులో గుద్దులాడ లుంటొద్దు—ఎక్కడో ఒక దగ్గర గండి కొట్టాలి.... ఈ సూటిపోటి మాటలేంది? ఈ కోర చూపులు వొద్దు....ఇల్లె ఉండు మంటరో లేదో తేల్చుకోవాలె—జిట్టెడు లేని పొల్లగండ్లు ఎంత బడుదేంది? నేను లేకుంట చూసి ఇంటిమీద దాడి చేసుడేంది? ఈ బాలసంఘం పెట్టింది తను.... తన మీదికే పోరగండ్లు ఉల్టాతిరిగిండ్లు- అటుబోతే అమీనుగాడు వాడెరికేనా వీడెరికేనా అని అడుగుతడు. మూడు కేసులు అట్లాగే ఉన్నాయి. పోనీ పార్టీకేమన్న ద్రోహం చేసి పోతిమా? చాతనైనంత చేసిన.... మరింక చాతకాదంటే వినరే....ఏదో ఒకటి చెయ్యాలెగన్క సారా బిజినెస్‌ల దిగిన ....రాజిరెడ్డి తనలో తానే తర్కించుకుంటూ నడుస్తున్నాడు.

పందిల్లకింద, గుడిసెల చూర్లకింద కూచ్చున్న జనం ఏదో చెప్పుకుంటు న్నారు. ఆ మాట లేమిటో స్పష్టంగా విన్పించడంలేదు. కాని తన గురించే చెప్పు కుంటున్నారని అనుకున్నాడు. "వీళ్ళకేం తెలుసు మార్క్సిజం-ఇయ్యల్ల అందరు మొనగాల్లే అయ్యిండ్లు-రాజిరెడ్డి దొంగయ్యిండు. రాజిరెడ్డి త్యాగాలు బోయినయ్- రాజిరెడ్డి తిన్న తన్నులు దోయినయ్.... జనం స్వార్థపరులు.... వాళ్ళ ఖూషుల కోసం రాత్రనక పగలనక తిరిగింది బోయింది....

జనం సంగతట్లా ఉంచితే నాయకులో....పిల్లలను పిలిచి రాజిరెడ్డి మనోడేనని కొప్పడవద్దా—ఇంతకు వాళ్ల ఏమనుకుంటున్నారు? తను శత్రువు నను కొంటండ్లా? మిత్రుడనా? ఇయ్యల్ల అదో యిదో తేల్చుకోవల్సిందే.... అంతవరదాకా గమ్యం లేకుండ నడుస్తున్న రాజిరెడ్డి ఆ ఆలోచన కలుంగానే పెంటయ్యఇంటికేసి నడిచాడు ...

వాకిట్లో నిలబడి "పెంటయ్యా.... పెంటయ్యా...." అని గట్టిగా పిలిచాడు.

బువ్వ తింటున్న పెంటయ్య ఎంగిలి చేతితోనే లేచి వచ్చిండు. వాకిట్లో నీళ

లైటు వెలుతురులో పరేషాన్లో ఉన్న రాజిరెడ్డి ముఖంచూసి "రా లోపలికిరా...." అన్నాడు పెంటయ్య.

"వచ్చేదేంది....గని ఇగో పెంటయ్య మీకు నాకు రాంరాం మంచో చెడ్డో...." రాజిరెడ్డి ఆదర బాదరగా ఏవో చెప్పబోయాడు.

"ఏందా గావర.... జెరలోపటికచ్చి మాట్లాడుడు-" పెంటయ్య చెయ్యి కడు క్కొచ్చుకొని....

"లక్ష మాటలేంది. మనూరు బాగు పడాలని నా సాతనైనంత చేసిన. నాకిప్పుడు సాతనైతలేదు. నా దారి నేను చూసుకున్న" రాజిరెడ్డి పందిరి కిందకొచ్చి.

సత్తెమ్మ, పిల్లలు వచ్చారు. పిల్లవాడు తల్లి చాటుకు నిలబడి గుడ్లు మిటకరిచ్చి చూస్తున్నాడు.

"ఊరు బాగు పడ్డదా ? ఇయ్యేల్ల మల్ల నోటీసులచ్చినయ్....పరంపోగులు, కారజ్ కిత్తాలు దొర పట్టినట.... అస్లు వరంగల్లులుండి బిస తిప్పుతండ్లు....మీకు తెలువని దేమున్నది?.... పోలీసోల్లు పొద్దందాకా వచ్చి పోసే బట్టిరి...." దీర్ఘంగా నిట్టూర్చి "రోన్లె తలబెట్టి రోకటి పోట్లకు భయపడ్తమా- తమరిని కాదన్నదెవలు?" అన్నాడు పెంటయ్య.

"ఇగో రాజకీయాలు నాకు నేర్పకుండ్లి నేను-గిసొంటి సంగాలు లక్ష తొంబయి చూసిన...."

"గిప్పుడు గంత పెద్ద మాటలెందుకు ?"

"బానయ్యా ! మీకేంది అంత మంచిగానే ఉన్నరు....పొల్లగండ్ల ఉసిగొల్పి సోద్యం చూస్తున్నారు."

"వాళ్ళకు నేర్పింది తమరే కదా ?"

"ఏం నేర్పిన ?" రాజిరెడ్డి రోషంగా అన్నాడు.

"ఏం నేర్పిన్రా ? పురుగు బుద్ధిని పుట్టలుండే పొల్లగండ్ల కుప్పేసి పదాలు నేర్పితిరి- మా పెద్దోడు చేతికంద కుంటబాయె- అందరు ఉసోర్కె అంటే ఉసోర్కె అని మీరు సల్లగ జారుకుంటిరి.... మేం మీయింటిమీద కొచ్చి అడిగినమా?" సత్తెమ్మ.

"సువ్వూకోరాదే.... సందు దొర్కుతెసాలు.... మన పెద్దోడు తనకేది మంచో అదే సూసుకున్నడు" పెంటయ్య.

"అటిగాదు నేను వర్గ శత్రువునా ?" రాజిరెడ్డి సూటిగా అడిగిండు.

పెంటయ్య తల వాల్చుకున్నాడు....

"చెప్పు పెంటయ్య చెప్పు— ఏదో తేల్చి చెప్పు— ఇయ్యాల్ల మా యింటి మీదికొచ్చి గోడలన్ని రాసిపోయిండ్లు."

"నాకు గంత పెద్దమాట లెరికలే— అంతకు ముందు దొరలు సెల్లిచ్చుకున్నరు. భూములు జాగలు గుంజుకున్నరు. ఇష్టా రాజ్యం చేసిండ్లు— కడుపుల సొద ఆగనోడు పర్లబడ్డడు. ఒంటిగాని సేత ఇంటికి రాదని దొరలు అసొంటోన్ని తన్నిండ్లు గుద్దిండ్లు— ఆఖరుకు సంపి బొంద బెట్టిండ్లు. అన్ని ఊళ్ళల్ల కలిసి పోయినట్టుగానే మనూళ్లె తన్నులు గుద్దులు తినోళ్ళల్లు కల్సిపోయిండ్లు.... మీరు మమ్ముల నిరుటి దనుక నడిపిచ్చిండ్లు. దొరలు వరంగల్ పారిపోయి సందువోరికెత్తె మల్ల ఊళ్లెకచ్చి రాజ్జేమేలుదామని కలలు కంటండ్లు.... కేసులు ఊళ్ళోళ్లమీద నడుత్తనే ఉన్నయి. మమ్ముల నడిపించవల్సినోల్లు మీరు పక్కకు జరిగిండ్లు- అది మంచో చెడో? నష్టమేందో కష్టమేందో మాకన్న మీకే ఎక్కువ తెలువాలె- సరే తమరు నట్టం జరుగలేదంటండ్లు-సంగమున్నది. సంగాన్ని బెట్టింది మీరు-సంగాన్ని కుప్పజేసి చెప్పండ్లి —"

"నేను బెట్టిన సంఘమే నన్ను విచారణ చేస్తదన్నమాట"

"ఎవరికైన గంతేనని తమరే చెప్పితిరి గదా! మనండ్ల మనం...."

"గీ నీతి మాటలు నాకు నీకన్న ఎక్కువే తెలుసు. అందరి సంగతి నాకెరికే. నేను సంగమే కాదు పార్టీ అంటే ఏమిటో ఎరుగుదును." రాణిరెడ్డి వెనుకకు తిరిగి సరసరి వెళ్ళిపోయాడు....

పెంటయ్య రాణిరెడ్డి మాటల గురించి ఆలోచిస్తూ నిలుచుండిపోయాడు.... సత్తెమ్మకు కోపం వచ్చింది....

"నేనే మాదండి మొగోన్నని ఎగురుతండు. అట్లబెల్లం గొట్టిన రాయోలె నొన్నుకుంట నిలుసుంటవేంది— ఖాఖండిగ చెప్పద్దా ?" అన్నది....

"ఏగిరపడ్తె అయితాదే....మనం ఏగిరపడి ఏగిరపడే గీడకచ్చినం....విచారం చేయాలే— అయినా రాణిరెడ్డి బయటుండి ఏదన్నా మాట్లాడ్తడు...." అన్నాడు....

రాణిరెడ్డి ఇవ్వాళ్ళ జరిగిన సంగతలన్ని మరిచిపోవాలనుకున్నాడు. ఎక్కడో ఒక దగ్గర కుదురుగా కూర్చుంటే ఆలోచనలు వెంటాడుతాయని ఒంటరిగా చేతు

లూపుతూ ఎవరకేసి చూడకుండా తిరిగాడు....వీధిలైట్ల కింది నుండి నడుస్తున్నప్పుడు పొడువుగా పడ్డ తన నీడను తనే వింతగా చూసుకున్నాడు. గుబురు చింతల కింద నిలబడి చిమ్మెట్లు పలకడం విన్నాడు....పక్క కుదురక అప్పుడోపిట్ట ఇప్పుడోపిట్ట అరవడం విన్నాడు....బడి ముందుకు నడిచి పిల్లలు ఆడుకునే ఇసుక కుప్పమీద కాసేపు వెల్లకిలాపన్నాడు. ఆకాశంలో చుక్కలు....తేటతేటగా ఆకాశం. పసివాడి నవ్వులా లేతలేత వెన్నెల....హఠాత్తుగా తన కొడుకు ముఖం గుర్తొచ్చింది....తను ఎత్తుకోక పదిహేను రోజులైంది....సుగుణ ముఖం యాదొచ్చింది....వద్దు వద్దు.... టక్కున లేచి నిలబడి జేబుల్లో చేతులు పెట్టుకొని గొడ్లకొట్టం కాడికి నడిచాడు.... గొడ్లకొట్టం చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్నది....దోమలను తోలుకోవడానికి అప్పుడప్పుడు చెవులు లొటలొట కొట్టుకుంటున్నాయి గొడ్లు....నెమరేసే చప్పుడు.... గడంచలో మోకాళ్ళ మధ్య తల ఇరికించుకొని కూర్చున్నాడు.... హరిజనవాడలో కోలాటమేస్తున్నట్లున్నది....అస్పష్టంగా పాటలు విన్పిస్తున్నాయి. మూడు పానాదుల కాడ కాపోలు పిల్లలు ఏదో ఆడుతూ పాడుతున్నారు....రేపటికి తిండికి లేకున్నా— భయంకరమైన సమస్యలున్నా ఊరంతా ఈ రాత్రి సంతోషంగానే ఉన్నది.... తానొక్కడే చాపుకన్న భయంకరమైన చిత్రహింస ననుభవిస్తున్నాడు— ఎమర్జెన్సీ రోజుల్లో గోళ్ళల్ల సూదులు గుచ్చడం కన్నా! అర్థరాత్రి మాంచి నిద్రలో లేపి ఎద్దు ముఖపు ఆఫీసర్ల ఇంటరాగేషన్ కన్నా! ఈ స్థితి క్రూరంగా, ఘోరంగా ఉన్నది....ఇంటికి పోదామనుకున్నాడు. ఏడిచే సుగుణ ముఖం, ముడుతలు బడ్డ అమ్మ ముఖం గుర్తొచ్చాయి. ఈ దేశంలో ముప్పయి కోట్ల మంది స్త్రీలు ఎందుకు కొరగాకుండా హరిజనుల కన్నా హీనంగా బతుకుతున్నారని....ఇండ్లో అలంకార వస్తువుగా తప్ప మనుషులుగా చూడబడడం లేదని— మొగవాడి దౌర్జన్యం కింద నలిగిపోతున్నారని సుగణకు తను ఎన్నోసార్లు చెప్పాడు. కళ్ళు మూతలు పడిపోకుంటే సుగణను లేపి కూర్చుండబెట్టి కథలు చదివి విన్పించాడు....కాని ఇవ్వాళ్ళ ఉత్తుత్తగానే కొట్టాడు....నిజానికి ఆ కోపం వాతకానిదే— పిల్లలు ఇంటిమీదికొచ్చి అల్లరి చేశారని వాళ్ళమీద కోపం సుగుణ మీద లేశాడు....పిల్లలకేమొచ్చింది? నిజానికి పిల్లలు అమాయకులు....వాళ్ళ ముఖాలల్లో, చేతల్లో మంచి చెడు స్పష్టంగా ప్రతిఫలిస్తుంటాయి....తనే ఇంకోసారైతే— అది తనమీదనే కాకుంటే— పిల్లల పనికి అభినందించేవాడు....డబ్బు, వ్యాపారం....నిజానికి తను వెనుక బడ్డాడు. అరెస్టులు, సోదాలు,

కేసులు తనను కుంగదీశాయి.... ఇంత దూరం వచ్చిన తరువాత వెనక్కి తగ్గడం తన తప్పే—అంతో యింతో సమాజం గురించి తెలిసినవాడే ఇట్లాయితే ప్రజల మాటో! పోనీ ఇంతయినంక ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకొని పోవడం.... పోయినా ఏకీలుకాకీలు విమర్శ పెడుతరు. మొగమాటలు, నంగి మాటలుండవు. కుండ బద్దలు కొట్టినట్లు మొకం మీదనే అనేస్తరు....పోనీ ఈ బతుకులో తనెంత కాలం సుఖపడగలడు. వనమిడిసిన కోతి లాగయిపోతుంది. ఎన్ని వేషాలేసినా ఊళ్ళల్లో ఏది జరిగినా తనను పట్టుక పోవడం ఖాయం....సంఘం తన కోసం ఏదన్నా చేయకుండా ఊరుకుంటుందా? అసలోడు దొరుకకపోతే తన మీదనే కేసులు పెడుతరు.... ఎవడి మీద కేసులు పెడుతున్నామనే ఆలోచన పోలీసుల కుండదు. కేసు కావాలె అంతే....పోనీ వెంటబడి తరిమే పిల్లలకు ఎట్లా నచ్చచెప్పడం....ఇప్పటికే మించిపోయింది....

గడంచలో నుండి లేచి నిశబ్దంగా అక్కడికక్కడికి తిరుగసాగిండు....తనిప్పుడు ఏం చేయాలో ఎంతాలోచించినా తట్టలేదు—తన ప్రమేయం ఉన్నా లేకున్నా ఊళ్ళో పోరాటం జరిగి తీరుతుంది. ప్రజలకు కీడు జరిగితే ఇందులో రాజిరెడ్డి చెయ్యి ఉందని ప్రజలనుకుంటరు. దొరల ఆస్తులకు నష్టం జరిగితే దొరలు రాజిరెడ్డే ఊప్లానిచ్చిండంటరు. ప్రజలకు దూరమైతే దొరల పక్షం చేరాలి....దొరల పక్షం చేరడమంటె వంగి వంగి తిరుగాలి. లేదా ప్రజల పక్షమన్నా ఉండాలి! కాని మధ్యలో ఊగులాడుతూ ఉండలేం.

అర్ధరాత్రి దాటిపోయింది. గొల్లోల్లవాడకు కాబోలు కుక్కలు అదే పనిగా మొరుగుతున్నాయి. ఎక్కడో గుడ్లగూబ కూస్తోంది. నెల సూకింది....ఊరంతా నిశ్శబ్దం....ఆకాశంలో విమానం పోతున్నప్పుడు....అడుగులో అడుగేస్తూ ఇంటి ముందటికి వచ్చాడు. మూసి ఉన్న తలుపుల మీద చెయ్యేసి చాలా సేపు నిలుచున్నాడు.... సుగుణను పిలువాలా, అమ్మను పిలువాలా తేల్చుకోలేక తలుపుల పక్క సిమెంటు గద్దెమీద కూర్చున్నాడు. అట్లా ఆలోచిస్తూనే గద్దెమీద ముడుచుకపన్నాడు. ఒళ్ళంతా నొప్పులు....నలుగురు తన్ని ముగ్గురీడ్చినట్టుగా ఉన్నది. దానికి తోడు ఆకలి.... ఇలాంటి రాత్రిల్లు కాలుకు బలుపంకట్టకుంటా ఒర్రెలు ఒంకలనక, చెట్లుపుట్టలనక, చలి వానలనక తిరిగేవాడు....ఇప్పుడో సీర్సం....ఏది చేతకావటం లేదు....విప్లవకారుడి జీవితంలో తన కోసం అరనిమిషం ఆలోచించుకోవడానికి తీరదు....ఇప్పుడో

ఎన్నిరోజులు తన గురించే ఆలోచించినా తెమలడంలేదు....భూస్వాములు, వాళ్ళ గుండాలు, పోలీసులు, వాళ్ళ ఆయుధాలు. దేన్ని ఖాతరు చెయ్యని ధైర్యం. ఇప్పుడు తననీడ తననే భయపెడుతోంది. పిల్లలను చూస్తేనే వణుకు పుడుతోంది....

ఈ దేకారు ఆలోచనలు కట్టిపెట్టి—సారా మామూలాలో తన కొచ్చింది తీసుకొని రాంరాం చెప్పి—మళ్ళీ పార్టీని కలిసి పనిచేస్తానని చెప్పడం ఉత్తమం. జానేదో సారాగీరా! మర్ నేదో పోలీస్ గీలీస్....కేసులు గీసులు గంగల పోనియ్యి.... చూద్దాం తర్వాతి సంగతి తర్వాత....పై నుంచి పార్టీ చెప్పితే ఊళ్ళె సంగం కిక్కురుమనది....

మళ్ళీ పనిచేయాలనే నిర్ణయానికి రావడం తోటే రాజిరెడ్డి మనసు తేలిక పడ్డది....నెత్తిమీది నుండి పెద్ద బండ కింద దించినట్లనిపించింది. పైరగాలి లేచింది....

మూడుచుకున్న కాళ్ళు బారజాపి రాజిరెడ్డి సిమెంటు గద్దెమీదనే కళ్ళు మూసు కున్నాడు. మరి కాసేపటికి గుర్రుకొట్టసాగిండు.

వంటింటి గడపమీద కునికిపాట్లు పడుతూ కొడుకు రాకకోసం ఎదురు చూస్తున్న రాజిరెడ్డి తల్లికిగాని, కొడుకు పక్కలో పండుకొని చప్పుడు కాకుండా కన్నీళ్లు కారుస్తున్న సుగుణకుగాని రాజిరెడ్డి ఇంటి ముందు నిద్రపోతున్నట్లు తెలియదు.

o o o

"ఎజెండాలో చివరి అంశం మిగిలిపోయింది." అన్నాడు కార్యదర్శి ఒక మారు నుదురు రుద్దుకొని....

అతని చుట్టు కూర్చొన్న నలుగురిలో ఇద్దరు ఆవులించారు. ఇద్దరు సిగరెట్లు ముట్టించారు....మిగతా ఇద్దరు నిద్రను పారదోలడానికి కళ్ళు రుద్దుకున్నారు....

"టీ ఉంటే బావుండేది...." అన్నాడు బక్క పలుచటి వ్యక్తి....

"బావుండేది కాని ఎట్లా సాధ్యం....? ఈ అంశం కూడా సాధ్యమైనంత త్వరగా ముగిస్తే తెల్లారేలోగా మనం ఎటువాళ్ళం అటు పోవచ్చు....ఒక్కొక్కరు మీమీ ఏరియాలకు సంబంధిన యూనిట్ల వివరాలు చెప్పండి...." కార్యదర్శి....

"సంఘాలల్లో దిగజారిపోవడం—మరి కొంతకాలం తర్వాత ఒడ్డున పడ్డ చేపలాగా అయిపోయి మళ్ళీ పనిచేస్తాననడం మామూలై పోయింది....ముఖ్యంగా మధ్య తరగతి వాళ్ళ నుండి ఎక్కువగా—కింది తరగతి వాళ్ళల్లో కూడా చాలా కాలం నుండి కొద్దిగా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి...."

"కామ్రేడ్స్! మనది ప్రజల పార్టీ....కాలం గడిచేకొద్దీ—మనం రాజకీయంగా సంఘాలను తర్ఫీదు చేయకపోతే—వివిధ సెక్షన్ల ప్రజలను సమన్వయ పరుచలేక పోతే బలమైన పార్టీని నిర్మించలేం....ఒక్క మన ఏరియాలోనే కాదు—రాష్ట్రమంతటా ఇలాంటి సమస్యలు ఎదురౌతున్నట్లు రిపోర్ట్సు తెలుపుతున్నాయి. ఇలాంటి సమస్యలను ప్రజాపంథాలో పరిష్కరించుకోవడం ఎలా? అనేది తెలియ చెప్పడానికే గత నెలలో మన పత్రికలో వచ్చిన వ్యాసం చదివే ఉంటారు. ఆ వ్యాసంలో సంఘాలల్లో నాయకత్వ సమస్యల గురించి వివరంగా చర్చించడం జరిగింది.... ప్రజల నుండి నేర్చుకొని ప్రజలకు మనం నాయకత్వం అందించడం గురించి ప్రస్తావించడం జరిగింది....అదే వ్యాసంలో కామ్రేడ్ మావో "నాయకత్వ పద్ధతులపై కేంద్ర కమిటీ తీర్మానం"లోని ఒక మాట చెప్పడం జరిగింది....

"ప్రజలలో ఉండే అభిప్రాయాలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా చెల్లాచెదురుగా ఉంటాయి. వాటిని మనం మొదట అర్థం చేసుకోవాలి....సమన్వయ పరుచాలి. అప్పుడు నిర్ధారణగా తేలిన విషయాలను తిరిగి ప్రజల్లోకి తీసుకవెళ్ళి అవి తమవే అని భావించేవరకు అలుపు లేకుండా ప్రచారం చేయాలి....కార్యాచరణలో వాటి మంచి చెడ్డలను తేల్చాలి. తిరిగి తిరిగి ఈ పని చేయడం ద్వారా మనం విప్లవంలో ప్రజలకు నాయకత్వం వహించగలం....ఉదాహరణగా చెప్పాలంటే ఒక వ్యక్తి మంచి చెడ్డల గురించి పోరాటంలో అతని పాత్ర గురించి నిర్ణయించాలంటే ఒకరిద్దరి అభిప్రాయాలు సరిపోవు. ఒక్కొక్కప్పుడు మనం స్వీయ మానసిక ధోరణులకు లోనుకావచ్చు....కామ్రేడ్స్ మరింక మీ మీ రిపోర్టు చెప్పండి." కార్యదర్శి....

"మా ఏరియాకు సంబంధించి అలాంటి వివరమైన రిపోర్టు తయారు చేయలేదు....వచ్చే మీటింగు వరకు తయారు చేస్తాం" కోలముఖం వ్యక్తి....

"ఇంతవరకు మాకలాంటి సమస్యరాలేదు." కురుచమనిషి

ఆఖరున చెప్పాలా వద్దా అని కాసేపాలోచించి "మా ఏరియానుండి రాజిరెడ్డి మళ్ళీ పని చేయదలుచుకున్నట్లు వర్తమానం పంపాడు." అన్నాడు సన్నగా రివటలాగా ఉన్నతను.

కార్యదర్శితో పాటు మిగతా ముగ్గురు ఏం మాట్లాడలేదు. ఒకరు మాట్లాడగలరని ఇంకొకరు ఎదురు చూశారు.... "ఆశ్చర్యంగా ఉందే?" కోలముఖపు అతను గొణిగినట్లుగా అన్నాడు.

"రాజిరెడ్డి విషయం చర్చిద్దాం....పూర్తి వివరాలు చెప్పండి కామ్రేడ్.... మిగతా కామ్రేడ్సుకు కొంత కొంత తెలుసున్నా — మీ రిపోర్టు ముఖ్యం." కార్యదర్శి....

"ముందు చేర్చుకోవాలా వద్దా అనేది తేల్చడం మంచిది." కురుచ వ్యక్తి....

"ముందు ఆయన గురించిన సంగతులు ఆ ఏరియా బాధ్యున్ని చెప్పమన్నడు కదా కార్యదర్శి" ఒకరు....

"నాకో చిన్న సందేహం. నా వ్యక్తిగత అభిప్రాయం చెప్పమంటారా? యూనిట్ అభిప్రాయం గాని, రైతుకూలి సంఘం అభిప్రాయం గాని నేను తీసుకో లేదు." బక్కటాయన.

"ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది మనం తెల్లారేటాల్లకు పోవాలె.... ఏదో ఒకటి తొందరగా కానిస్తే" పొట్టాయన....

"అపొంటప్పుడు ఆయిద వేడితె మంచిది గదా!" బోడగుండాయన....

"వాయిదా వేయడానికేమున్నదిగని. మన కోసం సమస్యలు ఆగవు కదా!" కోలముఖపు వ్యక్తి.

"స్పష్టంగా నీ అభిప్రాయం చెప్పు కామ్రేడ్." కార్యదర్శి.

బక్కటాయినె మళ్ళీ సిగరెట్టు ముట్టిచ్చి- కాసంత ముందుకు జరిగి- "నిజానికి చెప్పవలసిన సంగతులు బాగనే ఉన్నయి- 1978 లో ఆ ఊళ్ళె ప్రజా సంఘం ఏర్పడి దొరలకు వ్యతిరేకంగా నిలబడ్డది. మా ఏరియాలోనైతే సంఘాలలో చురుకుగా కదిలింది పెద్ద కులాల మధ్యతరగతి యువకులే- అంతో యింతో చదువు కొని పాటలు పాడి జనాన్ని ఆకర్షించగలిగారు. అప్పట్ల వాళ్ళ వర్గపునాది గురించి ఇంత బాగా ఆలోచన లుండేవికావు.... రాజిరెడ్డి రైతుకూలీ సంఘం ఏర్పాటు చేయ టం దగ్గరి నుండి- దొరలమీద సాంఘిక బహిష్కారం విధించి ఊళ్లెనుంచి వెళ్ళ గొట్టేదాకా చురుకుగా పనిచేశాడు. ఈ క్రమంలో వచ్చిన నిర్బంధంలో కూడా రాజి రెడ్డి ప్రజల పక్షంలోనే ఉన్నాడు. ఆ ఊళ్ళెనుండి ఒకరిద్దరు పూర్తి కాలపు కార్య కర్తలు ఎదిగి పక్క ఊళ్ళల్లో పనిచేయడానికి పంపగలిగారు— రాజిరెడ్డి మధ్య తరగతి రైతుల్లో ఎగువ సెక్షను నుండి వచ్చాడు.... సంఘ కార్యక్రమాల్లో పాల్గొక ముందు తను పనిచేస్తూ- మిగతా కొందరిని కూలికి పనిచేయించుకునేవాడు.... ఆ చుట్టుప్రక్కల గ్రామాలల్లో రాజిరెడ్డికి తెలిసిన ఇద్దరు కామ్రేడ్సు ఒకరు పోలీసు కాల్పుల్లో, మరొకరు బాంబు పేలి మరణించారు.... మొత్తానికి అప్పటినుండి రాజి

రెడ్డిలో ఊగిసలాట మొదలయ్యింది.... వరంగల్ పోయిన దొరలు ఊళ్లకు పోలీసులను దోలించారు.... అరెస్టులు, సోదాలు, కేసులు ఎక్కువయ్యాయి.... మరింక రాజిరెడ్డి బహిరంగ కార్యక్రమాలు చేసే పరిస్థితి పోయింది. రహస్యంగా పనిచేయవలసిందిగా నేనతనికి సలహా యిచ్చాను. ఫర్వాలేదు, అలాంటి వేళ వచ్చినప్పుడు చూద్దామని ఎప్పటికప్పుడు దాటవేశాడు.... అప్పటికే రాజిరెడ్డి పాతమిత్రులు కొందరు ఉద్యమం నుండి తప్పుకొని వ్యాపారంలో సెటిలయ్యారు.... 81 సెప్టెంబరు నెలలో పాత మిత్రులైన ధనిక రైతుల కొడుకులతో తిర్గడం సాగించాడు. స్థానిక రైతు కూలీ సంఘం ఒకటి రెండు సార్లు చెప్పిచూసింది.... "పార్టీవాళ్లే కలుపుమన్నారు. చందాల కోసం కలుస్తున్న లేపోతే వాళ్ళతోని నాకేంపని" అని వాళ్ళకు చెప్పాడు.... నేనడుగుతే "నేనట్లా చెప్పలేదు.... పాత దోస్తానీల ఒకమారు కలిసిన్నంతే" అన్నాడు. "ఏదేమైన ప్రజలు మనలను వెయ్యి కళ్ళతో కనిపెడుతుంటారు.... సాధ్యమైనంత వరకు అలాంటి వాళ్ళను కలువద్దు.... పైగా నువ్వు చందాల పేరు చెప్పుతే రైతులు అదేపని మొదలు పెడితే ఎట్లా?" అని మందలించాను. ఆ తరువాత సారా మామూళ్ళలో భాగం తీసుకున్నట్లుగా తెలిసి నేను ప్రత్యేకంగా కలవాలని వెళ్ళాను. ఇంట్లో ఉండి లేడని చెప్పి పంపాడు. తర్వాత సాయంత్రం కలిసి "రాజకీయాల విషయంలో భేదాభిప్రాయం లేదని- వ్యక్తిగత కారణాల మూలకంగా కొంత కాలం పనిచేయలేన"ని చెప్పాడు. "ఇంత దూరం వచ్చిన తరువాత అటు ప్రజలకో లేక శత్రువుకో ఉపయోగపడకుండా మధ్యస్తంగా ఉండడం సాధ్యం కాదని.... బాగా ఆలోచించవలసిందిగా" నేను చెప్పిన. అప్పటినుండి రైతుకూలీ సంఘం అతనితో తెగతెంపులు చేసుకున్నది. అతని మానాన అతన్ని వొదిలి తమ కార్యక్రమాలేవో తామే చూసుకోవడం సాగించింది. కాని బాల సంఘం మాత్రం రాజిరెడ్డిని వొదిలి పెట్టలేదు. వెంటబడి అల్లరి చేశారు. పాటలుకట్టి పాడారు. మొదట ఏదో పిల్లలనుకున్నాడు. కాని రానురాను పిల్లలే పిడుగులయ్యారు. ఇంకొక పక్క ఏ భద్రత దొరుకగలదనుకొని ఉద్యమం నుండి తప్పుకున్నాడో అది అందే సూచన కన్పించలేదు. ఊళ్ళోవాళ్ళు సూటిపోటి మాటలంటున్నారు.... అటు దొరలు దగ్గరికి తీయలేదు ... పోలీసోల్లు ఏది జరిగినా రాజిరెడ్డినే పట్టుకపోతున్నారు.... ఊరిడిచి కొన్నాళ్లు బయట తిరిగాడు. ఊళ్లకొస్తె పిల్లలు వెంటబడుతున్నారు.... మొత్తానికి రాజిరెడ్డి పరిస్థితి ఒడ్డున పడ్డ చేప తీరుగైపోయింది. మళ్ళీ ఆలోచించుకొని మనకు కబురు పంపాడు." బక్కటాయన ముగించాడు.

"ప్రజలపట్ల అతని ఆలోచన లెట్లున్నాయి" కురుచటాయన.

"రాజకీయాలు అంతంత మాత్రమే- ఇప్పటికీ ప్రజల శక్తిని గుర్తించడం లేదు." బక్కటాయన.

"అయితే కష్టమే." కోలముఖపాయన.

"కామ్రేడ్స్ రాజిరెడ్డి గురించి ఆ ఏరియా కామ్రేడు తన అభిప్రాయం చెప్పాడు... మీమీ అభిప్రాయాలు చెప్పండి." కార్యదర్శి.

"అతని ఆలోచనల్లో నిజంగానే మార్పురానంత వరకు మళ్ల తీసుకుంటే- ఇంక తీవ్ర నిర్బంధం పెరిగితే మళ్ళీ పోతడు." కోలముఖపాయన.

"ఆలోచనలో మార్పంటే కొలబద్దేమిటి ?" కురచటాయన-

"మీమీ అభిప్రాయాలు చెప్పండి- ఎదురు ప్రశ్నించడం కాదు." కార్యదర్శి.

"అర్థం కాకుంటే అడుగద్దా ?"

"సరే. కామ్రేడ్! మీరు ఆ ప్రశ్నకు జవాబు చెప్పండి- కామ్రేడ్స్! చర్చలోకి దిగితే కాలయాపన జరుగుద్దనే నేను అట్ల అన్నాను." కార్యదర్శి.

"కొలబద్దంటే ఆచరణ ద్వారా రుజువు కావడం- అది ప్రజలతో కలిసి పని చేయడం ద్వారానే తెలుస్తుంది."

"అట్లయితే మనకు ఎవరు మిగులుతరు ?"

"మిగులరని అందరిని చేర్చుకుంటూ పోతే కొన్నాళ్ళకు వాళ్ల లోపటచేరి తొలవటం మొదలుపెడ్తరు.... ఆఖరుకు మనది రివిజనిస్టు పార్టీగా తయారవు తుంది."

"జనాన్ని తర్ఫీదు చేయాలి..." కోలముఖపాయన అడ్డుతగులుతూ....

కార్యదర్శి కల్పించుకొని "మీమీ అభిప్రాయాలు చెప్పండి."

"నా అభిప్రాయమైతే తనకై తాను మల్ల ప్రజల్ల కలిసి పనిచేస్తనంటే తీసు కోవడంలో తప్పులేదు." పొట్టాయన.

"మీరు కామ్రేడ్?" కోలముఖపాయన నుద్దేశించి.

"అతనికి రాజకీయ పరిజ్ఞానం కలిగించేటట్లయితే చేర్చుకోవచ్చు." కోల ముఖపాయన చెప్పకముందే బక్కటాయన చెప్పాడు...

"మీరు కామ్రేడ్?" కొద్దిగా ముఖం మాడ్చుకున్న కోలముఖపాయనుద్దేశించి....

“నాకు రెండు బాగానే ఉన్నాయి” అన్నాడు అగ్గిపెట్టె గీకుతూ-

“అట్లంటెట్ల కామ్రేడ్....”

“నాకు అనుభవంలేదు....”

“సరే మీరు చెప్పండి” ఆఖరుగా కూర్చున్న ముతక బట్టల బోడగుండు రైతు నడిగాడు కార్యదర్శి.

“ఏదో వోటి కానియ్యుండ్లి – మీ కందరికి ఎట్ల దోస్తె గట్ల కానియ్యండి” అన్నాడు గీతలు గీస్తూ రైతు....

“అట్లంటెట్ల కామ్రేడ్ ? మనది ప్రజల పార్టీ. అనుభవంరీత్యా వయసు రీత్యా మీరు మాకన్న పెద్దవారు ... మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పండి. ఎవల కడుపుల వాళ్ళం ఉంచుకుంటే మనందరం ఎదిగే దెట్లా ?” కార్యదర్శి ...

రైతు అందరి ముఖాలల్లోకి చూశాడు....

“రాజిరెడ్డి సంగతి మనమంత మాట్లాడ్తున్న తీరు సూత్తె మావూల్లె ఎనకట జరిగేటి పంచాయతులు మతికచ్చినయ్- సంకరోన్ని దోలి దొరలు పనుల మీదోల్లందరిని పేరుకు కుప్పేసెటోల్లు ... తీరిపారంగ కూకుండి పిట్టకతలు సెప్పుకచ్చి ఆఖర్న నలుగురున్నకాడ నారాయుడున్నట్టే అని చెప్పి- వాళ్ల కొత్తులతోని చెప్పేటిది చెప్పిచ్చి-ఇగ మంది ఒకల మొఖాలొకలు సూసుకునేటోల్లు–ఇడుపుమంటె పాంకు కోపం–పట్టుమంటె కప్పకుకోపం– దొరలు దొరలు నింద నిట్టూరాలు పల్లికు మీద ఏసెటోల్లు-కోప్పడకుండ్లి కామ్రేడ్లు–మన మంత అలగలగ్ కాదనుకోండ్లి .... రాజిరెడ్డి సంగలనెత్తే సెరువుల దున్నపోతును దోలి కొమ్ములకు బేరం పెట్టినట్టు న్నది” అన్నడు సరాంచి.

అక్కడ కూర్చున్న వాళ్లంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఎవరికి వారే అంతరార్థం గురించి ఆలోచించారు. ఫలానా సంగతని ఎవరికి ఇతమిద్ధంగా తేలలేదు.

“కొద్దిగా అర్థమయ్యేటట్లుచెప్పు కామ్రేడ్” కార్యదర్శి నెత్తి గోక్కుంటూ—

“ఇండల్లు అయి మూల లేసున్నయిసారు. బానమేసినట్టు సావు సీదగనే ఉన్నది. రాజిరెడ్డి సెత్తంత సెపురులున్నది. కొమ్ములు మాత్రం మీదికి గన్పత్త న్నయి.... సెత్త సంగతి సెరువుకెరుక ....రాజిరెడ్డి మంచి సెడ్డలు ఆ పూరి సంగాని

నెయక- రేపు అయిన తోటి కలిసి పన్జేసెటోళ్ళు ఆళ్ళు- అందుకని రాణిరెడ్డిని కడుపుల బెట్టుకుంటరో కాదు పొమ్మంటరో ఆ ఊళ్లోల్ల నెయక. మా అంటె మనం మద్దెవర్తుల గుండగలం.... నన్నడుగుతె రాణిరెడ్డిగీ ముచ్చట సంగానికెందుకు జెప్పుకోలె? నీ మాట చెప్పు, నీ మాట చెప్పుమని అడిగిసంగని-ఆ కామ్రేడు సంఘాన్ని అడిగింకా ఆళ్ళే మంటండ్లో తెలుసుకోవాలెనలే- సీదా మన దగ్గర కెందు కచ్చిండు. సారు నాకు దోసిందేమిటంటె రాణిరెడ్డి సంగపోల్లను గుడ్డపేగులోల్ల కిందనే చూస్తుండు— గుడ్డ పేగులోల్లకు రాజకీయాలు ఏం దెలుసు? పైనోల్లు చెప్పితే కిందోల్లు కిక్కురు మనరని ధీమా— దీన్నేమంటరో నాకు తెలువది గని రాణిరెడ్డి మనసుల గిమాటున్నదని నాకు తోస్తంది.”

“నేను మొదట్లనే చెప్పిన గదా! నా అభిప్రాయం మాత్రమే చెప్పుతున్న.... నేను సంఘం అభిప్రాయం తెలుసుకోలేదని” బక్కటాయన....

“కోప్పడకుండ్లి సారు... సంగం సంగతి తెలుసుకొన్నంకనే మనం ఏదన్న జేస్తే బాగుంటదని- ఇందాక మన కార్యదర్శి చెప్పిండు గద.... ప్రజల్ల ఉన్న మాటలన్ని ఇనాలె— ఒకడు రాణిరెడ్డి లంగంటడు— మరొకడు జెరంత లిక్కరోగ మున్నదిగని మంచోడే నంటడు— మరొకవ్వ— నెషామంటె నెషామిగనొంటోడు అక్కెరకు రాదంటది. వాళ్ల కంటండ్లో గ మాటల సారాయమంత దీసి— గి సొంటి టయిముల ఎనుకట పెద్ద పెద్ద నాయకులు ఏం జేసిండ్లో? ఏం చెప్పిండ్లో యాదికి దెచ్చుకొని మనం నడువాలె— గప్పుడు పల్లీకు వాలేవా అవ్వల్లిట్ల చేసిండ్లంటరు” రైతు ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు.

“నాకైతే మన కామ్రేడు చెప్పింది సరిగా తోస్తోంది ... ఈ సమయంలో మన పత్రికలో రాసిన మావో మాట మనం గుర్తుంచుకోవాలి. పార్టీలో స్వీయ మానసిక వాదుల పెత్తందారీ ధోరణులను ఖండలిస్తూ మావో ఇట్లా చెప్పిండు— “ఏ పనిలోనైనా పెత్తందారీ విధానం తప్పు. ప్రజల చైతన్య స్థాయిని కాదని ముందుకు పోవడానికి ప్రయత్నించడం, బుద్ధిపూర్వకంగా ప్రజలు కార్యరంగంలోకి దిగాలనే విషయాన్ని దాటవేయడం, దుస్సాహసిక విధానమనే రోగాన్ని కలిగి ఉన్నట్టే లెక్క. మన కామ్రేడ్సు అర్థం చేసుకున్న విషయాన్ని ప్రజలు అర్థంచేసుకున్నట్లుగా లెక్క కట్టడం పొరపాటు. ఏదైన విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారా, కార్యాచరణకు సిద్ధంగా ఉన్నారా-అనే విషయాన్ని తెలుసుకోవడానికి

మనం ప్రజల్లోకి తప్పకుండా వెళ్ళి తెలుసుకోవాలి. పరిస్థితులకు వెనుకబడి ఉండటం కూడాతప్పే. ప్రజల రాజకీయ చైతన్య స్థాయికన్నా వెనుకబడి ఉండడం మూలకంగా ప్రజలకు నాయకత్వాన్ని అందియ్యలేం- ఇది కాలయాపన చేసేరోగమవుతుంది. మన కింకా తెలియని విషయం ప్రజలకు కూడా తెలియరాదని భావించరాదు. అనేక సందర్భాలల్లో ప్రజలు మనకన్నా ఒకడుగు ముందే ఉంటారు.... కనుక వెంటనే చొరవ తీసుకొని రాణిరెడ్డి విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఆ ఏరియా బాధ్యులైన కామ్రేడ్‌ను కోరుతున్నాను." కార్యదర్శి ముగించాడు.

"నేను ఆ ఊళ్ళో బహిరంగంగా తిరిగే వీలులేదు కామ్రేడ్" బక్క పలుచటాయన....

"పోనీ రైతు కూలీ సంఘం బాధ్యులను కలువండి.... వాళ్ళ అభిప్రాయం తెలుసుకొని, వాళ్లతో చర్చించి ఏ విషయం నిర్ణయించండి" పొట్టాయన....

"కష్టం. రాణిరెడ్డి అనేక సమస్యలను లేవనెత్తవచ్చు. పార్టీ వాళ్ల లేకుండా సమస్య పరిష్కరింపబడగలదని నేననుకోను...."

"పోనీ నీలయ్యగారిని వెంట తీసుకవెళ్ళండి...." కార్యదర్శి.

"పోవటానికేంది గని—నాకు మాటెనుక మాట మాట్లాడరాదు" నీలయ్య అనబడే రైతు ...

"ప్రజలనుండి నేర్చుకుందాం...."

నీలయ్య మాట్లాడలేదు· అంగీకరించినట్లుగానే అంతా భావించారు.

"సమావేశం ముగిసింది" కార్యదర్శి....

"ఇంకొక సంగతి సారు! రాణిరెడ్డి నేను పార్టీకి చెప్పిన—సంగం ముందుకు నేను రానంటడో!" నీలయ్య అనుమానం వ్యక్తం చేశాడు.

"మన కామ్రేడ్ ముందుగా రాణిరెడ్డిని కలిసి కమిటీ నిర్ణయాన్ని రాణిరెడ్డికి తెలియజేస్తాడు.... రావటం మానుకోవటం రాణిరెడ్డి యిష్టం ... ప్రజలతో నిజంగానే కలిసి పని చేయాలనుకున్న వాడైతే వస్తాడు. లేకపోతే ఆయన దారి ఆయన చూసుకుంటాడు.... ప్రజలను కుప్పజేసి అదే విషయం ప్రకటిస్తే సరిపోతుంది" కార్యదర్శి ....

సమావేశం ముగిసింది....

× × ×

ఉప్పలి సోమరయ్య మోట బావికాడ పదిమంది కూసున్నారు....మధ్యలో శేఖర్ (ఒక్కటాయనకా ఊళ్ళో పేరు) కూర్చున్నాడు....

"రాజిరెడ్డి గత ఏడాదినుండి మన సంఘ కార్యక్రమాలల్లో పాల్గొనడంలేదు.... మనది ప్రజలపార్టీ ఓ ఒక్కరిచేతనో పోరాటం నడువదని - మీ రైతుకూలీ సంఘం నిరూపించింది....ఈ ఏడాదిలో మన సంఘం ఎన్నో పోరాటాలు చేసింది.... మనతో కలిసి పని చేయడనో - యితర మొగమాటల మూలకంగానో రాజిరెడ్డి విషయంలో సంఘం శత్రువైఖరి అవలంబించలేదు....కాని చాల సంఘం గత మూడు నెలలనుండి అతన్ని అటలు పట్టిస్తోంది....ఇంకోపక్క ఏ బతుకు అరించి బయటికి పోయాడో అవి దొరుకలేదు. మొత్తానికి రాజిరెడ్డి మళ్ళీ పని చేస్తానని నాకు వర్తమానం పంపిండు. నేనొక్కన్నే నిర్ణయం చేసుకోవడం బాగుండదని - రాజిరెడ్డి పనిచేయవలసింది మన సంఘంతో కనుక - రాజిరెడ్డి మంచి చెడ్డలు సంఘమే నిర్ణయించాలని నేనసుకొని మిమ్మల్ని కలువడం జరిగింది ...ఏం చేద్దామంటారు?" శేఖర్ ....

నీలయ్య లేత వెన్నెల వెలుగుల అందరి ముఖాలు పరిశీలిస్తున్నాడు....

వెనుక కూర్చున్న బానయ్య దుబ్బలో గుర్రుకొడుతున్నాడు. అతనిపక్క కూర్చున్న మొగిలి బానయ్య చెంపమీద కోపంగా కొట్టి కూకుండబెట్టి - "వారీ ఎడ్డి బానాలు - మనకోసం సాట్ల గంత దూరంనుంచి వస్తే నువ్వు మారాజు నిదుర బోతన్నవా?" అన్నాడు....

"ద్దుత్తెరి లొట్టల సాట్ల...." బానయ్య కసురుకున్నాడు.

శేఖర్‌కు చిప్పక్కుమనిపించింది. కొద్దిగా కోపంకూడా కలిగింది. "మనం ఏ దారలను పట్టుకున్నమో వాళ్ళ పద్ధతులనూ పట్టుకోవాలె. ఆ కామ్రేడు పొద్దంతా పనిచేసి ఉన్నాడు. కమ్యూనిస్టులం కొట్టుకోవద్దు - ఓపిగ్గా నచ్చచెప్పుకోవాలి - కామ్రేడ్! మనం రాజిరెడ్డి విషయంలో మాట్లాడుకోవాలనుకున్నాం" అంటూ ఇంతకుముందు తను మాట్లాడిన విషయాన్ని మళ్ళీ చెప్పుకొచ్చాడు.

"బానయ్యది కుంభకర్ణుని నిద్ర - సందు దొరికితే సాలు గుర్రుకొడుతడు," బాపు అనే రైతు....

"ఆడికి మీకు అస్సలు నిదరేలేనట్టు...." బానయ్య కండ్లు నులుపుకొని....

"కామ్రేడ్స్ మీ మీ అభిప్రాయాలు చెప్పండి." శేఖర్....

"మాదేవుంది సారు. తమరెట్లంటె అట్ల...." నర్సయ్య....

"ఎద్దు మడి బోడుసుక బతికినం - గీ అయి మూలలు మునుపు సూసినమా ఏమన్ననా ?" అయిలయ్య

"నేం జూడలేదే—గిప్పుడు పరంపోగుల పంపకమును - సెంగలిప్పుకుంట ఉరికత్తరు—ఊళ్ళె తిరుక్కుంట ఆడాడ అనచ్చు - మనసారత్తె ఏం ఎరుగనోల్ల తీర్గ మాదేపుంది సారని తప్పించుకుంటండ్లు—" యువకుడైన రాజీరు....

"అంతే బాప్మర్తి! ఎనుకోమాట ముంగతోమాట ఉండద్దు - కట్టె కొట్టె జెప్పస చెప్పరాదుండ్లి—" బానయ్య ఆపులిస్తూనే——

"బోయినోన్ని బోనియ్యక మల్ల పిలుసుడేంది ? పిలిసి పిల్లని త్తసంచే కులం తక్కువన్నట్టయితది" మొగిలి.

"అగో పడుసో పెడుసోంట సంగపెద్దలు చెప్పుతండ్లు గద సాదు— కాని య్యండ్లి—" అయిలయ్య—

ఇట్లాగ తెగనియ్యకుంట బలువనియ్యకుంట తలోమాట మాట్లాడారు—

శేఖర్‌కు విసుగొచ్చింది— ఏ సంగతైనా ఉత్సాహంగా మాట్లాడేవాళ్ళు ఇవ్వాళ అనాసక్తంగా మాట్లాడుతున్నారు—రాజిరెడ్డి తమనికాదని పార్టీకి చెప్పుకోవడం కొందరికి కోపంగా ఉన్నట్లు గ్రహించాడు—

"కామ్రేడ్స్ మీ మాటల బట్టి నాకర్థమయ్యిందేమంటే" శేఖర్ ఆగి అందరి ముఖాలల్లోకి చూశాడు—

అప్పుడు నీలయ్య ఏదో మాట్లాడబోయాడు—

"కామ్రేడ్స్ ముందుగా మన నీలయ్య కామ్రేడ్‌ను పరిచయం చేయనందుకు మన్నించాలి—మన తాలూకాలోని రైతు కూలీసంఘం మనిషి - మన సంగం పని తీరు చూస్తానని వచ్చాడు—మీరు అనుమతిస్తే నీలయ్యగారు మాట్లాడుతారు—"

"మాట్లాడు కామ్రేడ్—ఏమారైతేంది - సంగపోల్లమంత ఒక్కటే -" బానయ్య—

"అప్పటినుంచి మన సంగపోల్లు మాట్లాడిందానిబట్టి నాకు తెల్సిందేందంటె - రాజిరెడ్డి సంగాన్నిగాదని పెద్దోల్లకు చెప్పుకున్నడని—మన పెద్దోల్లు గరీబోల్ల పచ్చాన్నే పని చేస్తండ్లు కనుకనే అళ్ళు మల్ల మన దగ్గరికి తీసుకచ్చిండ్లు - రాజిరెడ్డసోంటోల్లు మనల లచ్చపెట్టకుంటె తప్పని చెప్పు తండ్లు. గిదిమన సంగతి. మీరంత ముందుకచ్చి తేల్చాలె. అత్తమీది కోపం దుత్తమీద లేసినట్టు మనండ్ల

మనం కడుపుల పెట్టుకున్నా! మరుగున పెట్టినా మనకే చెరుపు—మన సొరుకు ఖుల్లం ఖుల్ల చెప్పుకోవాలె—" ఇట్లా చెప్పుకొచ్చాడు.

"అయితే రాజిరెడ్డిని తప్పన్నరుగద - గుడ్డపేగులోల్లు వీల్లతో నేందయిత దనుకుంటడు - అయినె ఉండంగ తనమాట తనదెగాని మామాట జొరనిచ్చిండా ?" నర్సయ్య.

"మరి గట్ల చేత్తండని ఎప్పుడన్న బయటపెట్టిండ్లా ?" నీలయ్య. "ఏడ— ఏముంటె ఏమత్తదోనని" అయిలయ్య.

"గందుకనే తొండముదిరి ఊసరెల్లయ్యింది." రాజీరు.

అప్పుడు దాదాపు అందరు "రాజిరెడ్డిని సంగంలకు తీసుకోవద్దు -" అని చెప్పుకొచ్చారు. కొందరు ఏమేమి చేసిందో చెప్పుకొచ్చిండ్లు—

నీలయ్య, శేఖర్ ఓపిగ్గా విన్నారు—రాజిరెడ్డి గురించి చాలా విషయాలు తెలిశాయి—

ఆఖరున వెంటయ్య కల్పించుకొని - "మీరంతా చెప్పింది బాగానే ఉన్నది— రాజిరెడ్డిని మల్ల గింతమంది దగ్గరికే పిలిసి అడుగవచ్చు. అయినె చెప్పేటియి అయినె చెప్పుతడు - మనం చెప్పేటియి మనం చెప్పుతం. మనం నీకు మాకు పొత్తు కుదరదని తెగేసి చెప్పుతం - అయినె ఊళ్ళె ఇగో నేను మల్ల పని చేత్తనంటె సంగపోల్లు పడనిత్తలేదని పచారం చేత్తడు. రైతు కూలి సంగముంటే మల్ల కొద్ది మందిమే ఉంటం - ఇది ఊరందరికి కావాల్సిన సంగతి మల్ల అల్లిట్ల నచ్చినోల్లను సంగంల కలుపుకుంటరు - ఇట్టంలేనోల్ల వద్దు పొమ్మంటరు - మమ్ముల అడిగిండ్లా అని ప్రజలంటరు. అదిగాక మనతోటి కలిసి తిర్గిండుగన్క మొకంమీద అనలేం - గిసొంటి సంగతి పజలందరికి తెలుత్తెమంచిది—ఎవల పొట్టల ఏమున్నదో మన కెట్ల తెలుస్తది—" చెప్పుకొచ్చాడు -

"కాప్రేమన్న రేపు పగలు ఊళ్ళోలందరిని కుప్పచేసి అన్ని సంగతులు ప్రజల ముందు పెడుదాం - అందర్ని స్వేచ్ఛగా వాళ్ళ వాళ్ళ అభిప్రాయాలు చెప్పమందాం- అంతిమ నిర్ణయం ప్రజలకే ఒదిలిపెడుదాం—" శేఖర్—

"ఈ ముచ్చట బాగున్నది సారూ!" అయిలయ్య—

"ఆయింక మాదేమున్నది అని సేతు లెల్లెలుకల ఎయ్యరు గదా!" మొగిలి నవ్వుతూ—

"మా దండి మొగోడచ్చిండు మంచ మెల్లెలుక లేయి మన్నదట -" నర్సయ్య మొగిలికి అంటించాడు—

ఎటోలటు లేచిపోయారు—నీలయ్య, కొమురయ్య, శేఖర్, పెంటయ్య మిగిలిపోయారు—

"నువ్వు ఒక్క మాటన్న మాట్లాడకపోతివి -" పెంటయ్య కొమురయ్య నడిగాడు -

"వింటన్న—నాకు చెప్పన మాట్లాడరాదు -" నత్తి నత్తిగా—

"ఈ సంగతి రాజిరెడ్డికి చెప్పాలె -" శేఖర్ అన్నాడు—

"మేం చెప్పితే ముందుగాలచ్చి మమ్మల్నే కలిసిండనుకుంటడు—నువ్వే కలిత్తె మంచిగుంటది సారూ! అంత లావయితె అక్కింట్ల ఎవలున్నరో ముందుగాల సూసొత్తె అయిపాయె—" పెంటయ్య—

"గమనంబె నాకు సాతనైతది -" కొమురయ్య—

* * *

అర్థరాత్రి దాటిపోయింది—శేఖర్ ఇంక రాకపోయెనని కొమురయ్య రెండు సార్లు ఓరగంట చూస్తూ రాజిరెడ్డి ఇంటి ముందునుండి నడిచిపోయాడు—

"మీకు తెలియనిదేమున్నది కామ్రేడ్—" ఏయేయే పరిస్థితుల్లో, ఎలాంటి ఒత్తిళ్ళ మూలకంగా తను చురుకుగా ఉండలేకపోయాడో - మళ్ళీ ఏ కారణంచేత పని చేయాలనుకుంటున్నాడో - వాల సంఘం ప్రసక్తిలేకుండా రాజిరెడ్డి చెప్పుకొచ్చాడు—

శేఖర్ ఏ విధమైన వ్యాఖ్యానం చేయకుండా అంతా ఓపిగ్గా విన్నాడు...

"కామ్రేడ్! పార్టీకి ఈ కారణాలన్ని తెలుసు....మనకు పార్టీకి ఉండే సన్నిహితత్వంతో సానుభూతిగానే అర్థం చేసుకోవచ్చు—కాని పార్టీ ప్రజలకోసం, ప్రజల మధ్య, ప్రజలతో కలిసి పనిచేయాలి...అంటే ప్రజలు మనస్ఫూర్తిగా పార్టీని తమ దానిగా కడుపులో దాచుకోవాలి....అంటే ఏ విషయాన్నైనా మనం ప్రజల ముందుంచి వాళ్ళు ఆమోదించిన తరువాతే కదా ఆచరించడం....ఒకటికి వందసార్లు మనం విషయాన్ని విడమర్చి వాళ్ళకు నచ్చచెప్పాలి. ఓపిగ్గా వాళ్ళకు అర్థం చేయించాలి ...కనుక మీ విషయాన్ని మీ ఊరి ప్రజలకు మీరే నివేదించుకోవడం మంచిదని పార్టీ అభిప్రాయ పడుతోంది....నాకు చెప్పిన విషయాలన్ని ప్రజల ముందు చెప్పండి ..." శేఖర్ ....

"వాళ్ళ...." రాజిరెడ్డి నసుగుతూ....

"కామ్రేడ్ ఆలోచించండి....పార్టీ మిమ్ముల్ని పనిచేయమని చెప్పగలదనుకోండి. మీరైనా ప్రజల్లోనేకదా పనిచేసేది? అప్పుడువాళ్ళ రకసమస్యలన్నిలేవనెత్తరా? సమస్యను దాటవేయడం పరిష్కారంకాదు—అది మరింత పెద్దదై మన ముందుకు వస్తుంది—మన ముందుకు వచ్చిన సమస్యను సరైన సమయంలో పరిష్కరించడమే కమ్యూనిస్టులు చేయవలసింది—మీరు బాగా ఆలోచించండి...." శేఖర్....

"సరే కామ్రేడ్.... ముందుగ మీరు సంగంతో మాట్లాడండి...." రాజిరెడ్డి....

"పిలిస్తే మాట్లాడ్తాను...." శేఖర్ బయలుదేరాడు. మూడవసారి అటుకేసి వచ్చిన కొమురయ్య శేఖర్‌ను తీసుకపోయాడు.

* * *

రాజిరెడ్డి పొద్దున లేచిన దగ్గరినుండి మనసు మనసులో లేదు. పరిపరి విధాల ఆలోచింనాడు....ఇంటిముందు ఎండబోసిన మిరుపకాయల్లో తల నెరిసిన ముసలమ్మ రాజిరెడ్డి తల్లి ఏన్నన్న తెల్లకాయలుంటే ఏరుతుంది...."వద్దురా కొడుకా అంటె వినకపోతివి....నీ మాట నీదేగాని ఇంకొలదినకపోతివి....పురుగు బుట్టదిని పుట్టలుండక మాదిగి మన్నేల, సబ్బండ వర్ణాల కుప్పేత్తివి....కులపోల్ల కు కంటయితివి.... ఎంతకనిరా! మీ బాపు ఉంటె గిట్లుండునా?" కొడుక్కు విన్పించి, విన్పించకుండ గొనుగుతోంది....

సుగుణ కడలు దగ్గరికంటూ మిరుపకాయలు తప్వే కోళ్ళను దూరం కొడుతూ భర్త వాలకాన్ని ఓరకంట కనిపెడుతోంది....

అరుగుమీద స్టీలు గ్లాసు నేలకేసి కొడుతూ పిల్లవాడు ఆడుకుంటున్నాడు.

రాజిరెడ్డి పరధ్యానంగా అద్దం ముందు నిలుచున్నాడు.

ఇంతలోనే వాకిట్లో చప్పుడయ్యింది....

"ఏందిర రాజాలు మళ్ళొం బట్టుకత్తివి...." రాజిరెడ్డి తల్లి....

"ఏవుందవ్వా! ఏవో సంగపోల్లు రాజిరెడ్డి పటేలును పిలుచుకరమ్మన్నారు." సాకలి రాజయ్య నసిగిండు.

"ఏణాది నుంచి ఇల్లు తొంగి సూడనోల్లు—మల్లరాజిరెడ్డి పటేలు మీద పావుర పత్తండ్లు ఏందికత?...."

"ఏమో నవ్వ నాకేమెరుక?"—అనుకుంటనే కొంచెం ముందుకు నడిచి

"రాల చెట్టుకింద అంత జమయ్యిండ్లు. తమన్ని రమ్మంటండ్లు—"అన్నాడు అరు
క్కింది నుంచే—

అదే సంగతి గురించి ఆలోచిస్తున్న రాజిరెడ్డి-నెత్తి దువ్వుకుంటున్న రాజిరెడ్డి
"వత్తన్నపా." అన్నాడు.

సాకలి రాజయ్య వెళ్ళిపోయాడు.

సుగుణ కొడుకు నెత్తుకొని అరుగుకింద నిలుచున్నది....

"కారపు చేతులతోని పిలగాన్నెత్తుకున్నవ్ సీదర చేసుకుంటదే పిల్ల—"
ముసలమ్మ....

సుగుణ మాట్లాడకుండా నిలుసున్నది. నిజానికి ఇదేదో దుమారం లేచేటట్లు
గున్నదని ఆమెకు అన్పిస్తోంది. భర్త వాలకం తనకు తెలియనిదికాదు. తను అన్ని
సంఘ కార్యక్రమాల నుండి తప్పించుకుంటున్నట్లు భర్త చెప్పగానే మొదట సంతోష
పడింది తనే—రాను రాను ఊళ్ళో జరిగే సంగతులు—ఎందుచేతనో భర్త ప్రవర్త
నలో వచ్చిన మార్పు మూలకంగా ఆ సంతోషం ఎగిరి పోసాగింది. ఊళ్ళో వాళ్ళ
సూటి పోటి మాటలకు మొదట్లో రోషపడ్డది. కాని రాను రాను ఊళ్ళె వాళ్ళ మాటల్లో
నిజమున్నదేమోనని అన్పించసాగింది. ఇప్పుడు భర్త ప్రవర్తనలో లోపాల గురించి
తర్కించడమే తన పనై పోయింది. ఫలితంగా ఇద్దరి మధ్య దూరం పెరుగుతోంది.
ఈ విషయాన్ని తనకు తెలియకుండా ఉంటే ఎంత బాగుండుననుకొన్నది చాలాసార్లు.

"నేను బయటకు పోతన్న—" రాజిరెడ్డి చెప్పులు వేసుకొని బయటకు
కదిలాడు—

"కయిలాటాక్కనికి పోకు—" తల్లి—

"ఇగో జెరంత శాంతంగా మాట్లాడండి." సుగుణ చెప్పాలనుకున్న మాట
గొంతులోనే ఉండిపోయింది. తను అక్కడికి పోవాలనుకున్నది—కాని తమ
కులంలో ఆడోల్లు పంచాయతులకాడికి పోవడమా? పోనీ అత్త నన్న పొమ్మందామను
కున్నది—అత్తెట్ల పోగలదు? రాజిరెడ్డి వీధిలో కనుమరుగయ్యేదాకా అట్లాగే చూస్తూ
నిలుచున్నది సుగుణ—ఆ నడకతీరు చూస్తుంటే నిజంగానే చాలా మథనపడుతున్న
ట్లుగా తోచింది.

రాజిరెడ్డి రాలచెట్టు కిందికి చేరుకునేసరికి దాదాపు రెండు వందల మంది

నిలబడో కూర్చుండో ఉన్నారు—చిన్నపిల్లలు దుబ్బలో ఆడుకుంటున్నారు. కొందరు పళ్ళపుల్లలు ఇంకా నములుతూనే ఉన్నారు. మోటలు విడిచి వచ్చిన వాళ్ళ చేతుల్లో పారలు పగ్గాలు అట్లాగే ఉన్నాయి. మట్టికాళ్ళతో, పాసి ముఖాలతో మరి కొంత మంది వచ్చారు— స్త్రీలు కూడా చాలమందే వచ్చారు. మొత్తానికి చాలా మంది పనులమీది నుండే వచ్చినట్లుగా తోచింది.

రాలచెట్టు మొదట్లో పెంటయ్య మరికొంత మంది కూర్చున్నారు. పార్టీవాళ్ల ఆ మందిలో ఎక్కడన్న ఉన్నారేమొనని పరకాయించి చూశాడు. అన్నీ తనకు తెలిసిన ముఖాలే—పెంటయ్యకు కొద్ది దూరంలో బోడగుండు రైతు మాత్రమే కొత్తగా కన్పిస్తున్నాడు—అతని బట్టలు వగైరా చూసి ఎవరి చుట్టమో అనుకున్నాడు.

అంతదాకా ధరవరల గురించో, మిరుపచెట్ల కొరుకుడు రోగం గురించో, ముడుత రోగం గురించో, దిగుబడి గురించో మాట్లాడుతున్న రైతులు—పక్క ఊళ్లల్లో కూలీరేట్ల గురించి జరిగిన పోరాటాల గురించి, పోలీసుల గురించి మాట్లాడుతున్న రైతు కూలీలు, కొత్త పాటల గురించి మాట్లాడే యువకులు—రాజిరెడ్డి గురించి మాట్లాడే స్త్రీలు మాటాలాపారు.

రాజిరెడ్డి పిడికిలెత్తి అందరికి లాల్ సలామ్ చెప్పి రాలచెట్టు మొదలు కొరిగి నిలుచున్నాడు.

ప్రతిగా యువకులు పిడికిల్లెత్తారు—

ఇంతలో "తుస్ తుస్" మని తుమ్ముతూ "చిటచిట" కాళ్ళ చప్పుడు చెయ్యంగ మేకల మంద వచ్చింది—అంతమందిని ఒక్కదగ్గర చూసి బెదిరి వెనుకకు పరుగెత్తాయి. వాటి వెనుక జొట్టిరబోసుకొని కర్రలేపట్టి "ఉస్సో—టర్ర గ్యాగ" అంటూ మేకల మర్రేయడానికి గొల్ల గంగులు తంటాలు పడ్డాడు—

"తొవ్వలబెట్టి తొక్కకు మన్నట్టు జెరంత లేపుండ్రెహె"— ఎవడో ముసలివాడు—

మంది లేచారు – మేకలు వెల్లిపోయాయి –

అంతమందిని చూసి వెనుకకు పోయి గట్టుపకింద కట్టెబెట్టుకొని గొల్ల గంగులు నిలుచున్నాడు....

"వారీ గంగులు నువ్విక్కడ మందిల నిలుసుంటె మేకలు బొయ్య సత్తె నాశనం జేత్తయ." మందిల నుంచి ఎవరో

"ఓ నీయక్క.... సంగపోల్లు మీటింగువెడితె పట్టపగటించి పెడితెట్ల- మేం ఇనాల్నా అద్దా! నాత్రి పెట్టాలెగని...." కాళ్ళెగరేస్తూ చేతులూపుతూ పరుగెత్తాడు....

గొల్లగంగులు అన్నమాట గురించి ఆలోచిస్తూ "అందరచ్చినట్టేనా ?" పెంటయ్య లేచి నిలబడి అందర్ని చూస్తూ అన్నాడు.

"అచ్చినోల్లచ్చిరి-రానోల్లు రాకపెయిరి. బొట్టు పెట్టి పిలిసేటందుకు గిదే మన్న పెండ్లా పేరంటమా ! లేటున్నోడు తోట పెట్టుకుంటడు కానియ్యుండ్లి" అమ్మోరు మచ్చల మొఖపాయన లొడ లొడ చెప్పిండు.

"గట్లంటెట్ల తాత- గిది మన పంచాతు. అందరు రావాలె-" ఒక యువకుడు.

"ఏడ్గచ్చినోడు సుత రావాల్నంటవోయి బామ్మర్ది" బింగి చెవుల కైతికాల పుల్లయ్య.

అందరు నవ్వారు...."పోయ్యేరా పో పుల్లన్న....మల్ల సంచాతు" దూరంగ కూర్చున్న నారయ్య.... మళ్ళీ నవ్వులు....

పెంటయ్య లేచి నిలబడ్డడు.... అతనికి మద్దతుగా కర్రెగాతునికి మొద్దులా గున్న సుంకరి లింగయ్య "సైసుండ్లి-సైసు" అంటూ చెతూలూపాడు.

"కామ్రేడ్లు...." పెంటయ్య కోడి బొక్క గొంతిరెల అడ్డం పడ్డట్టుపట్టి అన్నాడు....

"ఓర్నీయవ్వ గిదేందిర్ర రెడ్ల తీర్గ- కామ్రేడ్లు అనవయ్యా" ఓ రైతు సలహా యిచ్చాడు—

"పదిమందిల పాము సావదన్నట్టు—సెప్పేదేదో వినకుంట మజ్జెల ఏందుల్ల—" గౌరక్క చేతులు చాపి చెప్పింది—

"ఓనీ బాంచెనాతె గౌరక్కతల్లే—" మరొకడు—

"నవ్వేలాట గాదు. జెరంత అంత మనుసు పెట్టి ఇనండ్లి-మీకు సెప్పెదా మని ఏదన్న తోస్తే చెప్పండ్లి- మల్ల చెప్పేటప్పుడు ఒక్కొక్కలే చెప్పండ్లి- అయింక సంగపోల్లు మమ్ముల మాట్లాడనిచ్చిండ్లా అంటె కలువది" పెంటయ్య మాట పూర్తి కాకముందే—

"ఓ.... సంగపోల్లు పిలుత్తండ్లంటె ఉరికచ్చిన- రాపోతే మల్లెండ్ల కలిసిండో అనుకుంటరనచ్చిన—నాకైతె ఏ మెరుకలే" ఒక హరిజన ముసలయ్య చేతులెల్లకేసి అన్నాడు.

పెంటయ్య ఆ మాట వింటూనే ఎవరెవరు రాలేదోనని ఓపారి కలియ

చూశాడు—అందరొచ్చారుగాని, మధ్యతరగతి రైతు ఒక్కలన్నా కనిపించలేదు—
"కాపోల్ల వాడకట్టు నుంచి కందులోల్ల కనకయ్య, గొల్లోల్ల మల్లన్న, పల్లెమీని నాంచారి, గౌండ్లీరయ్య. బుచ్చిరెడ్డి, ఈరసామి-ఎవలు రాలే— ఏందికత ?" అన్నాడు.

"ఆల్లంత మద్దె తరగతి రైతులు గద-" అన్నాడు రాలచెట్టు పక్కనుండి ఒకడు.

"గిది అందరికి కావాల్సిన సంగతి- మద్దెతరగతోల్లు కూలోల్లని ఏంలేదు. తలో దిక్కు పొయ్యి పిలువుండ్లి నేను పెర్కోల్ల ఈరసామన్నను పిలుసుకత్త"- పెంటయ్య వీరసామిని పిలువబోయాడు—మరికొంతమంది తలోదిక్కు పిలువక రాను పోయారు.

"రాజిరెడ్డిని పంచాతుల బెట్టినంగదా !" అన్నాడెవడో—

"మనమెందుకు బెట్టిం- అతగాడే మనల పిలిసిండు" ఇంకొకడు.

"గ సమ్మిరెడ్డి నిన్న బుచ్చిరెడ్డిని పిలిసి- ఇగో రైతు కూలి సంగమంటే జబ్బలెగిరేత్తిరి- మాదిగిమన్నేలను కుప్పేసి మన మీనికి ఉసిగొల్పుతరంటె ఇన్నరా ? నా మాటెక్కడింటరు ? రాజిరెడ్డిని పంచాతుల బెట్టిండ్లా లేదా ? ఇగో రేపు—" గుసగుసగా బరుపటి రాజయ్య పక్కనున్న వానితోని చెప్పాడు—

"సాపు కబురు సల్లంగ చెప్పుతున్నవ- గిసొంటి ముచ్చట కడుపులుంచు గాదు—" పక్కనున్న ఏల్పుల గట్టయ్య.

రాజిరెడ్డి ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారోనని చూస్తున్నాడు—నిలబడితే అందరు తనదిక్కే చూస్తున్నట్లుగా గమనించి రాలచెట్టుకింది బండమీద కూర్చున్నాడు-

"మరి నాకెర్క లేకడుగుత-పెద్దోల్లు-దొర్రగలిగినోల్లను రాకపోతే మనుషులు బోయిండ్లు గని మరి తెనుగోల్ల శంకరి, ఏల్పుల పెదెల్లు మామ రాలే— ఆళ్ల కూలోల్లని పిలువబోలేదా ?" అన్నాడు పనిదొంగ నత్తోడు.

"నత్తోడు మందిల పిత్తుతడు— తీరిపారికూకుండి అంటున్నవ్ సువు పోయి పిలుసుక రాపోతివి" పక్కనున్న ముసలయ్య.

ఒకామె కిసుక్కున నవ్వింది- నత్తివాడు నోరుమూసుకున్నాడు. ఆడవాళ్ళు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. వాడకొకడు కొంచె మాటంటిండు—పదినిమిషాలట్లా గడిచినయ్.

"గౌండ్లీరన్న కాలు జెనికిందట-రాలేనుకు జెరసెమించన్నడు" అన్నాడు అతని దగ్గరికి పోయొచ్చిన వాడు.

"లంజెనకురాలు— మదుగాలు ఎవలెవలచ్చింట్లని అడిగింరాలేదా ?"

"బుచ్చిరెడ్డికి తోట కాదెవలు లేరట—" ఒకరు.

"మనందరికి ఉన్నరా ?" మరొకరు.

కందులకనకయ్య, గొల్లమల్లయ్య, నాంచారి, వీరసామి వచ్చిండ్లు.

"నా కొడుకుతోడు. ఇగో గిప్పుడు మనిషచ్చి చెప్పేదన్క గిట్లసంగతని నాకెర్క లేదు" నాంచారి అనుకుంటచ్చిండు.

"ఏదో రాజిరెడ్డిమీద పంచాతంటె నేనుంచేంది శేకుంచేంది పెద్దలంత ఉంటరు గదా అనుకున్న" కనకయ్య.

"గట్లంటవేమె— నువ్వు గాక మాకు పెద్దెవలున్నరె-" మన్నెవోల్ల సుక్క పోసు—

"నాదేమున్నది బిడ్డా!" కనకయ్య ఓ రాయి చూసుకొని కూకున్నాడు— ఎందుకైన మంచిదని భుజాలు చిరిగిన బనీను వేసుకొచ్చాడు.

పెంటయ్య మందిలో నిలబడి "కామ్రేల్లారా" కొద్దిగా తడబడి సరాంచి మనం సంగం బెట్టిన కాన్నుంచి సానా పంచాతులు సేసినం. దొరలను నిలదీసి అడిగినం— దండుగలు వాపసు దీసుకున్నం. గీ పంచాతు సేసుడు దొరల సేతుల్లుండె—అళ్ళ సేతుల్ల నుంచి గుంజుకొని దొరల పంచాతుల బెట్టుడే గాక మనండ్ల మనం తగాదాలత్తె దీర్సుకున్నం—" కొంచెం సేపాగి— "బాంచెననుకుంట తిరిగినోల్లం బరిగీసి నిలిచిన మంచె— గీ పంచాతుల్ల మనందరి తోటట్టు రాజిరెడ్డి ఉండి నడిపించాడు—కనిగీ పంచాతుల రాజిరెడ్డి మీ ముంగట కూసున్నడు—గీ పంచాతికి ఊళ్ళోల్లను పిలిపించిన సంగతేందో రాజిరెడ్డే చెప్పుతడు" పెంటయ్య కూర్చున్నాడు—

"నేను బిలువలే—" రాజిరెడ్డి ముఖమంతా జేపురించగ అన్నాడు.

"మరియితే మా కందరికి పనిపాట లేకచ్చినమా ?" ఆడోల్లల్లో నుంచి ఎవరో గునిసారు.

"ఏందయ్యో యేల్ల గానినేల్ల గోపాల్లం బాడినట్టు ఊకినె మమ్మల్నెందుకు

విప్పి త్తివి పెంటయ్య" రామకిట్టు ముడ్డికింద పంచె దులిపి లేచి పోవశానికి సిద్ధమయ్యాడు—అతనితోపాటు మరికొంత మంది లేచారు—

పెంటయ్య నీలయ్య ముఖం చూశాడు. నీలయ్య కళ్ళతోనే చెప్పమన్నట్లు సైగ చేశాడు.

"కూకోండ్లి-కూకోండ్లి- సరే ఎవలు పిలిసినా పిలువకున్నా మనం కుప్ప కూడినం- సంగతి మాత్రం రాణిరెడ్డి మల్ల మనతోటి కలుసుతా లేదా అన్నదే? ఆ ముచ్చటేదో అయినె చెప్పితె మనం ఉండుడో పోవుడో తెలుత్తది-" పెంటయ్య చెప్పి కూకున్నడు.

రాణిరెడ్డి లేవలేదు.

మందిలో నుంచి ఒకలు లేచి "అంత గనం అయినెకే పట్టింపయితె- ఒలిమిటీకి లింగం గడితె బత్తుడైతడా! లేండ్లి లేండ్లెహే" అన్నాడు.

సగం మంది లేచారు.... తలోమాట అన్నారు.

అప్పుడు రాణిరెడ్డి లేచి నిలబడి "కామ్రేడ్స్- కూర్చోండి- నేను ఆలోచించేది ఇదీ సరైన పద్ధతేనా అని- ఇలాంటి విషయాలు ఇంతమందిలో పరిష్కరించవలసిన వేనా అని నేను ఆలోచిస్తున్నాను- ఆ విషయం తెలిసిన వాళ్లు దీని గురించి చెప్పితే- నా సంగతి నేను చెప్పగలను-" ఇలాంటి విషయాలు ఎవరు చెప్పలేరనే ధీమాతో కూర్చున్నాడు.

నీలయ్య పక్కనున్న అయిలయ్య లేచి- "రాణిరెడ్డి ఇంతవరదన్క పని జేసింది మనూల్లె- మనతోటి- మనండ్ల మనకేదన్న అత్తె పజల ముంగల్నే తేలి పోవాలె ... వుండో కాదాయితె మందో కాడ బెట్టుడుగాదు ... గిది పద్ధతేనని నాకన్పిత్తంది." అన్నాడు.

మందిలో నుండి ఒకడు లేచి- "నాకెరుక లేకడుగుత- గీ ముసుగుల గుద్దులాటలేంది- గిది గుర్రం గిది మైదానమని చెప్పరాదుండ్లి-" అడిగిండు.

పెంటయ్య లేచి చెప్పుదామనుకునే సరికి రాణిరెడ్డి లేచి "కామ్రేడ్స్- పద్ధతేనని మన అయిలయ్య చెప్పిండు.... సరె! పద్ధతైనా కాకున్న నేను నాకు సంబంధించిన కొన్ని విషయాలు మీ ముందుంచుతాను. మన అయిలయ్య చెప్పినట్టుగానే మంచికో చెడ్డకో మనూల్లె రైతుకూలీ సంఘం బెట్టినం- మనం ఎన్ని పోరాటాలు చేశామో? ఏమేమి సాధించామో? ఎన్నిసార్లు దెబ్బలు దిన్నామో? జేల్లబడ్డమో! అవ్వన్ని మీకెరికే.... ఈ పోరాటాలన్నింటిలో నేను ఊళ్లోల్లందరితో పాటు

ఉన్నాను…." కాసేపాగిండు…. ఆలోచిస్తున్నట్లుగా అతని ముఖం చెప్పతోంది. గొంతు కొద్దిగా మార్చి "నా వ్యక్తిగత కారణాల మూలకంగా గత ఏడాది నుండి నేను సంఘ కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొనలేకపోయాను. నామీది కేసులు అట్లాగే నడుస్తున్నాయి…. మళ్ళీ ఆలోచించుకున్న తర్వాత సంఘం తప్ప వేరే మార్గం లేదని మళ్లీ ఎప్పటిలాగే మీతో కలిసి పనిచేయాలనుకుంటున్నాను. మీరు సరేనంటె నా ఆఖరి శ్వాసదాకా కష్టంలో సుఖంలో మీతోపాటే ఉండాలని అనుకుంటున్నాను… ఇంతకు మించి నేను చెప్పవలసిందేమి లేదు." రాజిరెడ్డి కూర్చున్నాడు.

జనంలో కలకలం లేచింది.

"నిండ ముంచి సలిపెత్తుండా అన్నట్టున్నది."

"ఎప్పుడిట్టమైతే గప్పుడు పోపుడు- మల్ల కట్టమచ్చినంక కలిసేటందుకు గిదేమన్న దొరల పార్టా !"

"ఎంతైనా కులం కులం ఒక్కటి."

"ఏమో ఈ వరకే మన సంగతులు దొరలకు మోయలేదని గారంటేంది ?"

"ససుససుర్ర లొట్టమీది కాకులోలె- అంతమంచిగనే చెప్పిండ్లు గని-వ్యక్తిగత సంగతు లేందో చెప్పలేదు."

ఇట్లాతలోమాట ఎవరికి తోచినట్టు వాళ్ళే- గుసగుసగా, లొడలొడగా, బొంగురుగ అనసాగిండ్లు–ప్రతిమనిషి ప్రశ్నించాడు…. అట్లా కాసేపు జనాన్ని తర్జన భర్జన పడనిచ్చి ఏదో మాట్లాడుదామని పెంటయ్య లేచాడు—జనం మాటలాపారు.

మందిని తొలిగిచ్చుకొని గుడిసె చూరుకింద నుంచి ఒక ముక్కుపుల్లగల సన్నటి కురుచస్త్రీ ముందుకొచ్చింది.

"నలుగుర్ల మాట్లాడిందాన్నిగాను… అందరు మాట్లాడంగ నాకోమాట అడుగాలని పిచ్చింది. అయ్యా రాజిరెడ్డి పటేలా! మీరున్నరని ఓడెక్కినం–ఓడ నడిగంగలకు పోంగనె తెప్ప (అల) చ్చింది నిండ ముంచింది–ఆఖరుకు తమరు ఒడ్డుమీద నిలుసుండి మీకే బయంలేదు వాళేసి దేవుతనంటండ్లు-" అన్నది కంఠం వొనుకుతుండగా….

"ఏమంటందిర్ర బెస్తోల్లరామక్క—" ఒక యువకుడు.

"ఓడ దాటినంక బోడ మల్లప్ప అంటన్నవ్ అంటంది" పక్కనున్నవాడు…

"మంచిగడిగినవ్ కోడలా!" మందిలోనుంచి మెయికంగి లేని ఒక్క ముస లోడు మెచ్చుకున్నాడు.

"రాజిరెడ్డి మల్ల మనతోని కలిసి పనిజేత్తనంటండు. తీసుకుందామా వద్దా ఒక్కలొక్కలే నిలుసుండి చెప్పండ్లి" వెంటయ్య.

ఎవలు లేచి చెప్పాలని అనుకుంటుండగానే రాఘవులు అనే రైతులేచి నిల బడి– "మంచిమాట జెప్పినవయ్యా సంఘంపెట్టె–ఎందుకు మానుకున్నడో అడు గద్దు–మల్లెట్ల మనమీద పాపురం గాలి పోయిందో అడుగద్దు— ఏకొదమ్మున తీసు కుందామా వద్దా అంటె ఎట్లానయ్యా" అన్నాడు.

నాంచారి లేసి.... "ఊకే కొలువా కుమ్మరియ్య–కొలుపు బెట్టి చెప్పతంటె తలుపు బెట్టి అడుగువ ట్టిరి.... తప్పొకున్న కొద్ది పెంకలు దప్ప బాగ్గెంరాదు– రాజి రెడ్డి సంగానికేమి చెడుపు చెయ్యలేదు గదా! సాతనైనంత సేపు ఉన్నడు– సాత గానప్పుడు తన సందాల తనున్నడు–గిందట్ల కోపతాపాలకేడ తావున్నది.... ఇగో నాకు దోసిన ముచ్చెట చెప్పిన–" కనుబొమలు ముడుచుకొని కూర్చున్నాడు.

మల్ల రాఘవులు లేచి "నువ్వు సల్లంగ జారుకొని ఎన్నెల్లయ్యిందయ్యా–" రాజిరెడ్డికేసి చూయిస్తూ....

రాజిరెడ్డికి సర్రున కోపమొచ్చింది. తమాయించుకొని "ఈడ కూసున్నోల్లు సంగంల ఏమేమి చేసిండ్లో నాకెరికే–గ చరిత్రంతా చెప్పేటందుకు గిది జాగగాదు- ఏడాదయ్యిందని ముందుగాల్నే చెప్పితి గదా...."

"అగో గిప్పుడే మాటిండన్నరు–మల్ల ఎవలెవలు ఏమి చేసిండ్లో చెప్పుత నంటండు–చెప్పవయ్యా ఎవరి గురించి తప్పు జరిగినా విచారింవాలే-" ఒక యువ కుడు గట్టిగా అంటూ వాదనకు దిగాడు.

అప్పటిదాకా మాట్లాడకుండా కూర్చున్న మెంట ముసలివాడొకడు లేచి— "ఇగో మాటలు చేసుకుంట కూకుంటె తెగది బలువది–ఏడాదయ్యింది గద—గీ ఏడాదిల అతగాన్నుంచి మన సంగానికి గాని ఊల్లోల్లకు గాని ఏదన్న చెడుపు జరి గిందా లేదా అన్నది ఇసారం చెయ్యండ్లి–ఉనుక దంచుతెట్ల?" అన్నాడు.

బెస్తవాళ్ళ రామక్క చెప్పవలసిన మాట పూర్తికాక అప్పటి నుండి అందరి ముఖాలు పులుకు పులుకున చూస్తూ అట్లాగే నిలుచున్నది.... ఆ ముసలివాడు అట్లా అనగానే అందరు గత ఏడాది నుండి ఊళ్ళె జరిగిన సంగతులు గుర్తుకు తెచ్చుకుంటు న్నారు. అప్పుడు రామక్కకు సందు దొరికింది.

రామక్క కొద్దిగా గొంతుపెంచి "మల్లె మన్నోలె— సెరువుల సాపలోలె బతికిన మనూల్లెకు పదాలు దెచ్చింది రాణిరెడ్డి పటేలే. కని మద్దెల ఏమయ్యిందో ? మానుకున్నదో లేదో నాకు ఎరికలే అరునెల్లే అయ్యిందో ఎక్కువే అయ్యిందో నాకు మతికిలేదు కని—పొద్దుగూకి గప్పుడే సీకటి సీకటి బడంగ మా వాడకట్టకు జీబచ్చి ఆగింది.... మల్లేం పీడచ్చిందిరో—పోలీసోల్లు దిగిండ్లని నా పానంల పానం లేదు—తొంగి సూత్తినా జీబుల తెల్లబట్టలోల్లు దిగిండ్లు.... పోలీసోల్లు గాదని ఈతలి కచ్చిన ఆ ఎనిమిది మంది మా వాడమీద దొంగల తీర్గబడి బంపోత్ బట్టీలు బెట్టిండ్లని గుడిసెల్ల జొరబడి కుండలు గురుగులు తొక్కిండ్లు—దొరికినోల్లను గొడ్లను గొట్టినట్టు గొట్టిండ్లు—అంగామంగామ్ జేసిండ్లు—మా వాడకట్టుకు ఆళ్ళ పంచెలే ఆళ్ళ దండలకు గట్టి పదిమందిని తీసుకపోయిండ్లు—కేసులు బెట్టిండ్లు...."

"సనరాదే తొందురుదాన—" మందిలో నుంచి రామక్క ఖర్త గంగులు అడ్డం పోబోయారు....

"సనువయ్య సను—నా కడుపుల సొద ఎల్లబోసుకోనియ్య—మా అయినెను తాన లేసిండ్లు—నేను లబ్బ లబ్బ మొత్తుకుంట అకీలు దగ్గరికురికిన—ఆని తాడు దెంప ఆడు నన్ను బెదిరిచ్చి అయిదు నూర్లు తెమ్మన్నడు....ఓరి దేవుడో! గిప్పుడు ఏడబోదు—పానమాగక ఉరికత్తిగని—గపెంటన్నన్న ఎంట బెట్టుకరాపోతి—గరాణి రెడ్డి పటేలు నన్నఎంట బెట్టుకరాపోతిననినా అండ్ల నేనే ఏడ్సిన ఎటు సాతగాక మనూరి సంగతి అకీలుకు జెప్పుతే ఏమన్న గురుత్తం జాత్తదేమోనని రాణిరెడ్డి పటేల్ పేరు జెప్పిన....అయినె కిసుక్కున నవ్వి "మీపూరి రాణిరెడ్డి మాపులల ఇస్సేదారన్నడు—" ఇగ నేను నోరు మూసుకొని కాళ్ళ కడాలు, చేతుల కడాల అమ్మి అయిదునూర్లు అనికొమ్మున బెట్టిన ..." రామక్క ముక్కు చీదింది ...

రామక్క మాట పూర్తి కాకముందే మాదిగి కొండయ్యలేచి— "గంత దూర మెందుకయ్య పధిహేనొద్దుల కింద మిరుపకాయలే రేటెందుకు కూలి బెంచాల్నని మనం సమ్మెజేత్తె వీళ్ళవ్వ మాదకుల బట్టుకపోయి తోపేరిపిచ్చుకున్నది....గిది సంగానికి దెబ్బ కాదా!" చెప్పి వెనుకకు తిరిగిపోయి తన స్థానంలో కూర్చున్నాడు. కూర్చున్న తరువాత గాని తను చెప్పవల్సింది మరిచిపోయానని తెలియలేదు. మళ్ళీ అక్కడి నుండే లేచి "మారేనయ్య—మేం సానామందిని నూసినం—తాపకు నదువు

కున్న మారాజులు కుంటిగులాపులందర్ని కుప్పేయ్యటం. అది చెయ్యిండ్లి—ఇది చెయ్యిండ్లనుడు—మేం బజార్లకు రాంగానే ఆళ్ళదారి ఆళ్ళ సూసుకునుడు—మారే నయ్య మీ ఎక్కువోల్లంత మన్ముల ముంచుతండ్లు—పేరొకలది—ఊరొకలది.... లేపోతే రాజిరెడ్డి పటేల్‌కు సారా మాపులల ఇస్స ఢొరుకునా!"

"కోరే కొండ—నోటికెంత మాటొస్తె అంత మాటేనురా?" అంకరి మల్లయ్య అడ్డొచ్చాడు....

"సువ్వట్లాగుర మామ ...సువ్వెప్పుడు గిట్లనే మా నోరుకు కుట్లేత్తన్నవ్.... రాజిరెడ్డి మనల ముంగటేసుకొని తాత్ దీట్టని తిరుగపటికెనే గదా! ఆయన్నో పెద్ద నాయకునుకుడన్నరు ...తనకు బతుకు దెరువున్న దనేగదా! మనలందర్నిడిచి సెంగో బిల్లన్నడు...." కొండయ్య పూర్తి చేసి కూర్చున్నాడు—

అంకరి మల్లయ్య పెదువులు నాక్కొని లేచి నిలబడదామనుకున్నాడు. కాని ముడ్డిపేగంత చిరిగిందని బిడియపడి మందిల కూర్చుండే— "ఏర్గ బొయి బోర్లబడి ఊరు నాకై రాదనకుండ్లిరా— సంగం మనకు మొసనోసిందిరా. అయ్యల్లాలా అనితో నేంది గులాపోన్ని బాంచెన్.... కోపం చెయ్యకుండ్లి నేను పాతకాలపు కమినిట్లు చూసిన—అళ్ళ తుపాకు లేసుకొని ఇజ్జం చేసిండ్లు బాంచెన్ ...మనూల్లె సుత భూములు పంచిండ్లు బాంచెన్....ఇయ్యల్ల అళ్లెక్కడున్నరు బాంచెన్ ....పాతదొరలు పోయి కొత్త దొరలయిపోయిండ్లు ...కాలాల బట్టి దొరలు ఏషాలు మారుత్తరు బాంచెన్ ....గది ఇసారం చెయ్యిండ్లి. మాదిగోడు, గీడు కాపోడు అని మనండ్ల మనం కొట్లుకస్నావద్దు....బేపారంల దిగినంక ఎంత కమినిట్టయినా లేనోల్ల కడుపుల మీదనే కొడుతడు బాంచెన్—గబుద్ధి పుట్టిందంటే గంతేనయ్యా!" అంకరి మల్లయ్యకు ఇక ముందు ఏం చెప్పాలో తెలియలేదు.

ఎక్కువోల్లు, తక్కువోల్లు అన్నందుకు పెద్ద రగడ జరుగవలసిందే కాని అంకరి మల్లయ్య సదిరి చెప్పడంతోటి ఆగిపోయింది.

"ఇగో మా తాత సచ్చేలోకాసున్నడోగాని, చెప్పులునోన్నెంట—అప్పులునోన్నెంట—సదువుకునోన్నెంట పోవద్దని చెప్పిండు" అన్నాడో గూనివాడు.

"అదో వంపయితె మరదలు మిట్టయితె పదినెగాదు." ఒకామె. చర్చ పక్కదారి పట్టడం చూసి నీలయ్య లేచి నిలబడ్డాడు.

"కామ్రేడ్స్! మాది కర్నాగురం (కరీంనగర్) జిల్లా—మీ వూరికి సుట్టాల మార్గంబచ్చిన—మా వూళ్ళల్ల సుత సంగాలు బెట్టుకున్నం....బుద్దాగక మీ సంగపోల్ల

సంగం జూద్దామని ఈడికచ్చిన. మీరింత దనుక మాట్లాడిన సంగతులిన్నంక నాకు సుత కొద్దిగ మాట్లాడన్ననిపిచ్చింది.” తలగోక్కొని “మనండ్ల మనకు ఎన్నో కిందా మీదులున్నయి. కులాలు, ఎక్కువ తక్కువలు సానున్నయి. గది దినాముండే భాగోతమే. గియ్యన్ని బోవాల్నంటె ఇప్పుడికిప్పుడే దూరమైపోవు....గియ్యన్నిటికి కారణం దొరలు—వాళ్ళ సుట్టూ పరుసుకున్న భూమి—దొరలను ఊళ్ళల్ల నుంచి ఎల్లగొట్టినం—కని ఆళ్ళ జాయిజాదులు అట్లనే ఉన్నయి. దొరలకు మద్దతుగ పోలీసులు ఊళ్ళమీన బత్తనే ఉన్నరు....దొరతనం బోవాలంటె ఆళ్ళకు మద్దతిచ్చే పోలీసోల్లు బోవాలె-సట్టాలు బోవాలె-గియ్యన్ని బోవాన్నంటె మద్దెతరగతి రైతుల కాన్నుంచి పల్లెలున్న బీద బిక్కి సంగంల ఒక్కటి గావాలె—పట్నాలల్ల పన్జేసి బతికే కార్మికులు మనతోకలిసి పోరాడాలె—అట్ల పొలాలల్ల పనిజేసెటోడు—మిల్లుల్ల, బాయిల్ల పని చేసేటోడు అన్ని సీజ్లు తయారు చేసేటోల్లంత కలిసి దున్నెటోనికి భూమి, నడిపెటోనికి మిల్లు అచ్చేదనుక లడాయి చెయ్యాలె ...ఉత్త సేతులతోని గాదు—తుపాకులతోనే కొట్లాడాలె—ఇగో గట్ల చేసే లడాయిల ఎన్నో సంగతు లుంటయి, అయ్యన్ని తీర్మానం చేసుకొని ముందట బడితేనే మనం గెలుత్తం.... ఇగో మీ పల్లె రాజిరెడ్డి అసొంటి సంగతే అత్తది. అయినేదో బేపారం చేసుకుంటని చెప్పిండ్లు—గీ ఏడాది బట్టి మీ పల్లె సంగం సానా పోరాటాలు చేసింది—గండ్ల రాజిరెడ్డి కలిసి రాలే గదో సంగతి—పోగా రాజిరెడ్డి ఆసర సూసుకొని మీ యిండ్ల ల్లకు జీప్కారోల్లు వచ్చిండ్లని ఓ అక్క చెప్పుకచ్చింది. ఇంకో పెద్దయ్య ఎనుకటి నుంచి గిసొంటోల్లు పజలను పోరాటంలకు దించి ఆళ్ళ బేపారాలు జూసుకొని—మరి కొన్ని ఊళ్ళల్ల ఓట్లల్ల దిగి కొత్త దొరలయ్యిండ్లని చెప్పుకచ్చిండ్లు ఇయ్యల్ల రేపు కమినిస్టుల్ల నుంచే కొత్త దొరలు బయలెల్లుతరని పెద్దయ్య సెప్పబోయిండు అంతే కాదు పెద్దయ్య ?” ఓమారు అంకరి మల్లయ్య కేసిచూసి—

“ఇయ్యన్ని ఒకెత్తు రాజిరెడ్డి ఏ సంగతులల్ల తనకు సాతగాలేదో—గీ ఏడాదిల మల్ల మనుసెట్లా మారిందో సెప్పనేలేదు—నాకో సిన్న అనుమానం—రాజి రెడ్డి నిచ్చెంగానే మారిండా? అయితే రాజిరెడ్డే చెప్పుడు బాగుంటది.” నీలయ్య కూర్చున్నాడు.

“లాపోడేనేమే” అన్నారు ఆడోల్లు-

రాజిరెడ్డి లేవలేదు-

“చెప్పాలె- చెప్పాలె-” అన్నారు యువకులు.

రాజిరెడ్డి బలిమిటికి లేచి నిలుచున్నాడు. అతనికి కాళ్ళకింద భూమి కదిలి పోతున్నట్లుగా ఉన్నది....పార్టీవాళ్ళు నిజంగానే తనను మోసంచేశారు....గిట్ల ముగియ గలదనుకుంటే అసలు తను ఈ పంచాయితీకే రాకపోవును....పార్టీ అంత రాలు పాటించాలి. ఎవరినెక్కడ విచారించాలో ఆలోచించాలి....కాని తానుగాని, పార్టీగాని, ప్రజలకోసం, ప్రజల్లో పనిచేయాలని, నిజమైన విప్లవ బోధకులు ప్రజలే అన్న సత్యాన్ని రాజిరెడ్డి గుర్తించడంలేదు -జీరబోయిన గొంతుతో...."నిజానికి నా వ్యక్తిగత కారణాలను చెప్పమని బలవంతం చేయడం దాదాపు అంతా పదే పదే కోరుతున్నారు. ఈ వూళ్లో మొదట అరెస్టయ్యింది నేను.... నేను ఇప్పటికి పుచ్చిన కుక్కలాగా కేసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. కేసులకు డబ్బు కావాలి....సంగంలో పనిచేయనప్పుడు నాకు ఉచితంగా పని చేయమని ఏ వకీలును కోరాలని పించలేదు.... మిత్రుల బలవంతం మీద సారా మామూలలోకి వెళ్ళాను.... గత ఏడాది చింతకింది రామలచ్చులు భూమి దున్నించినపుడు మాధవరెడ్డి గుండాలు కొట్టి కోలాట మేసిండ్లు.... ఇప్పుడు నన్ను ఇంత నిలదీస్తున్న సంఘం అప్పుడు కనీసం ఒక ప్రదర్శన చేసిందా? ఒక కరపత్రమన్నా వేసిందా ? సరే ఎవరిని నిందించి లాభంలేదు—ఇలాంటి సంగతులు జరిగిపోయినయ్.... వాటన్నిటి గురించి ఇప్పుడు ఆలోచించి లాభంలేదు.... మరింక నేను చెప్పవలసిందేమి లేదు...." గబుక్కున కూర్చున్నాడు.

సాకలోల్ల రాజమ్మలేచి "మొన్న సుగుణవ్వను ఎటువడితే అటు గొట్టిండు" అన్నది.

"ఇగో మొన్న గిదంత నేనే సేసిన మీదేపున్నది అన్నడు" మందిలో నుండి ఒకడు—

"అటు దగ్గరికి దీ త్తరని దొరల సోపతి బడితే వాళ్ళు ఎంతటోన్ని అంతట్ల నే ఉంచిండ్లు— రఊసూడవోతే బాలసంగపోల్లు ఇజ్జత్ దీ త్తండ్లు— మారే మరింక వేరుంటే పడుతలు లేదని పెద్ద పెద్దోల్లతోని రాయబారాలు నడిపిండు" కొండయ్యే పక్కనున్న అయిలయ్య.

"ఓర్నియవ్వ కాలాంతకుడే—అయితే పోల్లగండ్ల బాధకు రాయబారం బెట్టిండు గని నిజెంగ మారలేదన్నమాట."

ఇట్లా చాలామంది రాజిరెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడారు. రాజిరెడ్డి ముఖం నేలకేసి కూర్చున్నాడు.

పెంటయ్య లేచి— "ఆఖరి మాటల్లో రాజిరెడ్డి సంగంమీద సిన్న నిందే

సిండు....అప్పటికే రైతుకూలీ సంగపోల్లంత జేల్లున్నరు. అయినా రాజిరెడ్డి గన్క తెలుసుకొని ఊళ్లోలందర్ని జమజేసి మొత్తం భూమి దున్నియమందె— అదిచెయ్య లేదు. గీలడాయిల ఎవల మెంత కష్టబడ్డమన్నది లెక్కలేసుకుంట బోదామా? లెక్కలేసుకొను గిది ఒక్కల కోసం జరిగే లఢాయిగాదు....గీడ కూకున్న అక్కలు సెల్లెండ్లు, తల్లులు, తండ్రులు సంగం బలపడేటందుకు ఎంతెంత సేసిండ్లో కరీదు కట్టేదెట్లాగా? లెక్కలు తీసేదెట్లగా- గీలడాయిన కొడుకులిచ్చి నోల్లున్నరు.... బిడ్డ సాగనంపినోల్లున్నరు.... లాభాలు, నట్టాలు లెక్కలు గట్టేటందుకు గిది కోమటి బేరంగాదు—ఏదో వత్తదని ఆశపడ్డ రాజిరెడ్డి తన సంగతి బయట పెట్టిండు—ఇగో గది గుర్రం గిది మైదానం-మరింక రాజిరెడ్డి ఏం చేద్దాం" పెంటయ్య అందరికేసి చూస్తూ అడిగాడు....

అప్పటికి నెత్తిమీదికి పొద్దచ్చింది. చింత చెట్టమీద పిట్టలు చేరిపోయాయి. ఆడుతున్న పిల్లలు ఎప్పుడో వెళ్ళిపోయి తల్లుల దగ్గర నిద్రపోయారు....

"ఒక్కసారి సంగాన్నిడిసి బోయినోల్లను తీసుకోవద్దు—అందట్ల రాజిరెడ్డి ససలే వద్దు" అందరు మొత్తుకున్నారు. కొంతమంది కోపమాపుకోలేక పేరు పెట్ట కుండ తిట్టారు.

అంకరి మల్లయ్య లేచి నిలుసున్నడు. ఇప్పుడతనికి చిరిగిన ఒంటి పేగు గుర్తుకు రాలేదు "ఊళ్లోల్లందరు సెషామంటె పెషామంటండ్లు— గిప్పటికి అందరి మాట గదే— కాని సంగం గట్ల అందరిని దూరం కొట్టుకోదు— అయ్య సంఘం మనకేమి సేసిందని అడిగే ముందు—మనం దానికేం జేసినమని గుండె మీన సెయ్యేసుకోవాలె— అది మన కన్నతల్లసొంటిది—కడుపుల బెట్టుకున్నంతసేపు పెట్టు కుంటది— తిట్టేటప్పుడు తిడ్తది.... దగ్గెరకు దీసేటప్పుడు దీత్తది.... అయ్యా రాజిరెడ్డి పటేలా! మామీన కోతుకం బెట్టుకోవద్దు. తమరు నిచ్చంగనే గరీబోల్ల పచ్చ మైతే దొరలతోని కాలి గోరంత అంటుసుత ఉంచుకోవద్దు— మునుపటి తీర్గ మల్ల పజ్జేస్తే— మల్లదే ఊళ్లోలందరు సెబాసంటే గీ సంగం మీదే— లేదంటరో ఎవుల దారి వాల్ల ...." ఇట్లా చాలాసేపు మాట్లాడాడు....

"గీమాట బాగున్నది" పెంటయ్య అన్నాడు. అందరు లేచి నిలబడ్డారు....

అప్పటికే రాజిరెడ్డి లేచి నిలబడి తలవంచుకొని కాళ్ళీడుస్తూ ఇంటికేసి నడిచాడు....

* * *

సీరియల్ నవల :

రాగో

సాధన

(గత సంచిక తరువాయి)

5

మర్కనార్‌లో ఫారెస్టువారి నర్సరీ పనులు జోరుగా సాగుతున్నాయి. సమ్మె చేసి కూలిరేట్లు పెంచుకున్న కూపు కూలీలు ఆ రోజే పనుల్లోకి దిగారు. వీడింగ్ పని చకచకా సాగిపోతుంది.

సాయంకాలం ఆరున్నర అవుతుంది. ఊరి బయటే తెలుగు ప్రాంతీయ వార్తలు విని దళం ఊళ్ళోకొచ్చింది. మసక మసకగా ఉన్న వెలుతురు కాస్తా మనుషుల్ని గుర్తుపట్టరాని చీకటిగా చిక్కబడింది. అడవిని ఆనుకునే ఉన్న చివరి ఇంటిముందు దళం ఆగింది. దళ కమాండర్ ఆ ఇంటి దాదను తొందరగా ఊళ్ళోకి తోలాడు. బాగా చీకటిపడితే అందరూ గాటో తినేస్తారు. తిన్నాక అడిగితే అన్నం (గాటో) దొరకదు. వంట వండిపెట్టడం అంటే ఆలస్యం అవుతుందని కమాండర్ ఆ దాదను అన్నం జమచేయడానికి తొందర చేశాడు.

ఆ ఇంటిచుట్టు వెదుగు దడి అల్లి ఉంది. బలమైన కొయ్యలతో ఎత్తుగా ఉన్న ఆ దడిని దూకడం కష్టం. చుట్టూ దడి ఉన్న ఆ ఇంటికి ఎక్కడ సందువిడిచి దారి చేశారో కమాండర్ చూడసాగాడు. ఏ క్షణాన ఏం జరిగినా తప్పుకోవడానికి అవసర మవుతుంది.

ఇల్లిల్లు తిరిగి అన్నం, కూర జమ చేస్తున్నాడు దాద. ప్రతి ఇంట్లోనూ తొందర చేస్తున్నాడు. దాద చెప్పినట్టే ఎవరి దొప్పలు వారు చక చకా సర్దుకున్నారు. ఇంటికో దొప్ప తెస్తే దళానికి సరిపోతుంది. ఒక దొప్పలో కూర మరో దొప్పలో అన్నంతో ఊరి వాళ్ళంతా ఆ చివరింటికి చేరుతున్నారు. దొప్ప పెద్దగుంటే విస్తరాకు అవసరముండదని రూపి పాపురాకులతో పెద్ద దొప్పకుట్టి రాగో దగ్గరి కొచ్చింది.

"రాగో! అన్నలొచ్చింఁడ్రు. పోదామా"—రూపి

"ఇంగో" (అలాగే) —రాగో

"బువ్వ డొప్ప తెస్తున్నావా" —రూపి

"హిల్లే. లి త్తన్. మా ర్త. (లేదు, తిన్నా, ఒడ్సింది) ఏం చేయాలి" అంటూ రాగో చేతులు తిప్పుతూ రూపివైపు చూసింది.

"బారామో! దట్" అంటూ (ఏంగాదు! పోదాం) రూపి రాగోను నడవ మంటూ ముందుకు దారి తీసింది.

"డొప్పలన్నీ వచ్చినయ్ అన్నా. అందరూ చేతులు కడుక్కోవాలి" అంటూ కమాండర్‌తో చెప్పి ఆ ఇంటి దాద రూపివైపు చూశాడు. రూపి, ఆ ఇంటి దాద కలసి దళానికి తిండ్లు సర్దుతున్నారు. అన్ని డొప్పల్లోని అన్నమంతా ఒక గుల్లలోకి కూరంత ఒక గంజులోకి వంపారు. ఖాళీ డొప్పలు తలా ఒకటి ఇచ్చి దళం వాళ్ళు కూచోగానే వడ్డన ప్రారంభించారు.

ఊరి వాళ్ళందరూ వాకిట్లో నెగడుచుట్టు చేరి కబుర్లు మొదలెట్టారు. దళపు అన్నలను, అక్కలనూ వింతగా చూస్తూ! రాగో రూపిని అంటిపెట్టుకొనే మెదలు తుంది.

"నీళ్ళకాక"— తింటున్న దళ సభ్యుల్లోనుండి ఎవరో గాభరా చేశారు.

"రాగో నీళ్ళివ్వు" అంటూ సరం తప్పిన అన్నను చూయిస్తూ రూపి కదిలించింది.

రాగో సిగ్గుపడుతూ నీళ్ళిచ్చి వడ్డిచ్చే వారిలో కలసిపోయింది.

భోజనాలు ముగిశాయి. వాకిట్లో నెగడు మండుతుంది. నెగడు చుట్టూ ఉన్న జనాలు అన్నలను చూసి సందు ఇచ్చింఁడ్రు. ఒకరి పక్కగా ఒకరు దళం వరుసగా నిలబడింది. కబుర్లలోపడ్డ జనాలను దృష్టిని ఇటు మరల్చడానికి దళం పాటలందు కొంది. ముందుగా కమాండర్ గొంతు సవరించి పాట ఎత్తుకున్నాడు.

గేడే యూయల్‌కో రాం రాం	అడవి తల్లికి దండాలు
మావ యూయల్ గేడె తుకు రాం రాం	మా తల్లి అడవికి దండాలు
గేడే చిత్తురు మ త్తే	అడవి చల్లాగుంటే
గాటోతునే కరువు హిల్లే	అన్నానికి కరువే లేదు
పంటాలోనూ వ త్తే	పంటాలాంటి కొస్తే
పండుము కీకము	పండుగ చేద్దాం

మెట్టాపొయిసీ, గుట్టా పొయిసి
గోదావరిన విత్ముడ్ హూడా,
వక్సరె వక్సరె తిర్సరె తిర్సరె

దేరస్కునా పొంగుముడు హూడా
దొడ్డతే కన్ హూడా
కై సువ్వతేరు హూడా
దేరస సర్నే మత్త జిల్లా
గోండు దాదలార గడ్చురోలి -
రేల రేల రేల రేల రేల రేలరే

....
....

కొండలనుండి, కోనలనుండి
గోదావరమ్మ పరుగులు చూడు
వంకలు తిరుగుతూ తిరుగుతు
తిరుగుతూ

నదులేమో పారుతున్నాయి
వాగుల్లో ఊటలు చూడు
చెలిమెలో నీరు చూడు
జిల్లాచుట్టు నదులున్నా
గోండు దాదల గడ్చురోలి
రేల రేల రేల రేల రేల రేలరే

....
....

ఆ తర్వాత ఈ మధ్యనే రాసిన అక్కల పాట పాడమని కమాండర్ గిరిజను పిలిచాడు. పాట పాడేముందు ఆ పాటలోని సంగతులు పరిచయం చేస్తూ గిరిజ యిలా ప్రారంభించింది.

"అక్కలా! దాదలా.

నేను పాడే పాట అక్కలపాట. మన మాడియా కులంలో అక్కలెట్లున్నరో ఈ పాటలుంది. ఎగిరేకాడ అక్కలనెట్ల చూస్తరో ఇందులో ఉంది. పెండ్లి అయినొంక బలవంతంగా రవిక తీసేసి అక్కకు మూరెడు తువ్వాల చుట్టబెట్టడం మంచిది గాదని ఉంది. ఇంకా అన్ని తీర్ల రివాజుల పేరుమీద ఆడోళ్ళను పెట్టే ఇబ్బందులన్నీ యిందులో వున్నాయి. ఇష్టం లేకున్నా సరే, అయ్య కల్లు తాగినందుకని బలవంతంగా పెళ్ళిచ్చ చేస్తే మనసులేని వానికి ఉండనని ఆ పిల్ల ఇంకోనికి పోతే మళ్ళీ గుంజుకొచ్చి తన్ని గుద్ది పంచాయితీలు చేసే పెద్ద మనుషుల రీతి రివాజులు ఇందులో వున్నాయి. పెండ్లి నచ్చక తన బతుకు తాను బతుకుతానని కష్టం చేసుకునే అక్కల్ని 'కేర్దే' అని ముద్రేసి అల్లరి చేసుడు, ఆడదాన్ని మనిషిలాగ ఖాతరు చేయకపోవుడు మంచిది గాదనీ, ఈ రివాజులు మారాలనీ నేను పాడే పాటలో ఉంది. పెద్దమనుషులు కోపానికి రాకుండి. మేము చెప్పేది నిజమో, కాదో విచారం చేయండి" అంటూ మొదలెట్టింది పాట.

మీవా పొల్లు పెహల వాత్తోం	మీ పొల్లు చెప్పుతాం
మీవా కట్ల పెహల వాత్తోం	మీ బాధ చెప్పుతాం
పింజర్‌తె మత్త రాగో లెక్క	పంజరంలో చిలుక లెక్క
నీవా పిస్వల్ కీత్తోరక్కా	నీ బతుకు చేసిరక్కా
నీవా సర్నే రివాజు కీసి	నీ సుట్టు రివాజులల్లి
నీవా కాల్కు ఉరుహత్తురక్కే	నీ కాళ్ళు విరిచిరక్కా
నీవా హక్కు, నీవా పిస్వల్	నీ హక్కు, నీ బతుకు
లిమ్మ రుతుల గుమ్మడి	లిమ్మ రుతుల గుమ్మడి
కేంజాలాసి వట్రి బాయి	వింటానికి రావే అక్క
లిమ్మ రుతుల గుమ్మడి	లిమ్మ రుతుల గుమ్మడి
....	....
....	....

అందరూ చెవులు రిక్కించుకొని వింటున్నరు. అక్కలందరూ ఒక తీక్కే కూచున్నరు. రూపి పక్కనే రాగో కూచుంది. వాళ్ళకెదురుగా పడుచోళ్ళు, పెద్దోళ్ళు, మగాళ్ళందరూ వున్నారు. గిరిజ పాడే పాట అందరూ వింటున్నారు.

వింటున్న రాగోకు ఆ పాటలో తన జీవితమే కనపడసాగింది. "ఔను! ఆడదాని బతుకు పంజరంలో రాగో (చిలుక) జీవితమే అయ్యింది. దాని చుట్టు అన్నీ రివాజులే" అనుకుంటూ రాగో పెదవి విరిచింది— ఎదురుగా కూచున్న మగ వాళ్ళను పట్టి పట్టి చూస్తుంది. వాళ్ళెవరిలోనూ చలనం లేదు. గిరిజ ఏ మాత్రం జంకు లేకుండా కుండబద్దలు కొట్టినట్టు వాళ్ళ మొగాలపైనే ఆ పాట పాడుతున్నందుకు రాగోకు ఎంతో వూరటగా ఉన్నట్టనిపించింది. ఆ పాట తానే పాడుతున్నట్టు, అందరి మీద కసి తీర్చుకున్నట్టు రాగో మనసు వెచ్చగా ఉంది. మగాళ్ళు పల్లెత్తు మాట అనకుండా కూచున్నందుకు పరేషాన్ అయింది.

"రాగో, పాట మంచిగుందీ" అంటూ రూపి జబ్బపట్టుకొని కదిలించడంతో, రాగో యీ లోకంలోకి వచ్చి 'ఇంగో' అంది.

"మూడు నెల్లాయె అన్నలు రాక. పోయినసారి అన్నలు వచ్చిపోయిన

తెల్లారే సుప్పు దిగినవ్. ఇవ్వాళ నీ కోరిక తీరిందే" అంటూ అన్నలను చూడాలని రాగో అడిగిన మాటను గుర్తు చేసుకుంది రూపి.

"ఇంగో. నువ్ చెప్పినవ్ గాని అన్నలు మంచి మంచి మాటలు చెప్తరే" అంటూ రాగో మాట కలిపింది. అంతలో కమాండర్ ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"సబ్బెటోరుకు హూలంగా (అందరికి) లాల్ సలాం !" అంటూ కమాండర్ ప్రజలందరికి లాల్ సలాం చెప్పి మాటల్లోకి దిగాడు.

"మనం పదిహేను రోజులు సంపు (సమ్మె) చేసినం. ఆఖరుకు గెల్సినం. సమ్మె పాడుచేయాలని జంగ్లాతు వాళ్ళు అన్ని తీర్ల చేసింద్రు. మనం లేని కాడికెల్లి లేబర్ను తెచ్చి పనులు నడిపియ్యాలనుకున్నారు. కూపులకాడ ఉండి మనం లేబర్లను వెనకకు పంపినం. పోలీసులొచ్చింద్రు. వాళ్ళని చూసి బెదిరి పనులకు పోయి నోళ్ళెవరు లేరు. ఆఖరుకు జంగ్లాతు సాహెబులు కింది నౌకరు గాండ్లతోటి లీడింగ్ చేయించాలనీ చూసింద్రు. వాళ్ళెంత చేస్తరు ? గంట చేస్తే గంట కూచోవాలె. ఇగ కాదనుకొని మనమడిగిన రేటు ఇస్తామన్నారు. దీనంతటికి మీరందరూ ఒకటిగుండుడే కారణం. మనం ఒకటిగుంటే ఏ సర్కారోడు ఏం చేయలేడు; ఏ పోలీసోడు ఏం చేయలేడు" అంటూ చెబుతున్న కమాండర్ను వింటున్న వారిలో నుండి ఎవరో అడ్డుతగిలారు.

"ఆకులపుడు సంపు చేస్తేనే రేటు పెరిగింది దాద". ఆ మాట ముగిసిందో లేదో మరో గొంతు వినపడింది.

"అపుడు ఇంతకన్నా ఎక్కువ పోలీసోల్లచ్చి ఏం పీకింద్రు" అని మరో దాద గొంతు కలిపాడు.

"రూపి! నేను ఆ పాటపాడిన అక్కతోని మాట్లాడుతనే. వింటదానే?" అంటూ రాగో అనుమానంగా అడిగింది.

"ఊరందరి ఆపతి విన్నపుడు నీ ఆపతెందుకు వినరే– చెప్పు"మంది రూపి.

"ఈడకాదు– చాటుకు"— రాగో.

"అయితే జెరాగు. వీళ్ళ మాటలైనాంక మాట్లాడుదాం" అంది రూపి.

వీరిద్దరూ మాట్లాడుకుంటుండగానే గిరిజ వారివైపు రావడం రాగో చూసింది. రూపి చెప్పాలనుకునేసరికి గిరిజ వారిని దాటి దడి అవుతల అడుగుపెట్టింది. మూత్రం చేసి వస్తున్న గిరిజకు రూపి, ఆమెతో పాటు మరో అక్క ఎదురయ్యారు.

"ఏం రూపక్కా ! ఏం సంగతి? "— గిరిజ పలకరించింది.

"ఇది మాట్లాడుతదటక్కా. మా గోతే ఇదీ. పేరు రాగో" అంటూ స్నేహితు రాలైన రాగోను పరిచయం చేసింది.

"ఏ వూరక్కా?"— గిరిజ

మౌనం

"ఏం పేరూ ?"— గిరిజ

మౌనం

రాగో కళ్ళలోకి నీళ్ళు వచ్చేసినయ్. మరో ప్రశ్నతో అవి పైకురకడానికి సిద్ధంగా ఉన్నాయి. నీరు నిండిన కళ్ళు నెగడు కాంతిలో మెరిస్తే రాగో తల వాల్చే సింది. ఇన్నాళ్ళకు 'అక్కా' అని నోటినిండా పిలిచిన పిలుపు విని రాగో కదలి పోయింది. మాట్లాడలేని రాగో విషయం కనుక్కోవాలని గిరిజ ఆప్యాయంగా ఆమె భుజంపై చేయివేసింది. అంతే, రాగో వెక్కిళ్ళు పట్టింది. మాట పెకలడం లేదు.

"ఏడ్వకక్కా. చెప్పు ఎవరేమన్నరు ?"— గిరిజ

జవాబుగా వెక్కిళ్ళు పెరిగాయి.

"దాదా ! మేము ఆఖరి పాట పాడుతాం. వినండి" అన్న కమాండర్ గొంతు విన్న గిరిజ రాగోను చేయిపట్టి తీసుకపోయి తన పక్కన నిలబెట్టుకుంది.

అందరి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అందరూ అటెన్షన్‌లో నిలబడి పిడికి లెత్తి గొంతుకలిపి అంతర్జాతీయ గీతం పాడుతున్నారు. ఆ పాట, ఆ తీరు తెలవని రాగో వారిలోనే నిలబడి ఉంది. తనకు తెలియకుండానే చేయి మాత్రం పైకెత్తింది.

అన్నలతో నిలబడ్డ రాగోని కొత్త మనిషిని చూసినట్లు రూపి అదేపనిగా చూస్తుంది.

పాట ముగిసింది. దళం వారు కిట్లు వేసుకుంటున్నారు. ఒకరొక్కరే అక్క డున్న జనాలకు "పోతాం దాదా" అంటూ చేతిలో చేయి కలిపి లాల్‌సలాం అంటు న్నారు.

రాగో, రూపీలను తీసుకొని గిరిజ పక్కకెళ్ళింది. రాగో సమస్య తెలుసు కోవాలన్న కుతూహలంతో రాగో, రూపీలను వివరాలు అడిగింది. కిందటిసారి జిల్లా బంద్ రోజున అడవిలో తారసపడిన దగ్గర్నుండి రాగో గురించి తనకు తెలిసిందంతా రూపి గడగడ వర్ణించింది. సంఘం పనంటే వెనుకా ముందు కాకుండా ఎంత కష్ట

పైనా సరే చేస్తుందనీ సిర్కాదాద రాగో గురించి మీకు చెప్పే ఉంటాడనీ ఓ మాట కూడ కలిపింది. సమ్మె జరిగినన్ని రోజులు రాగో సమ్మెలో తనతో ఎంతో సహకరించిందనీ చెప్పింది. "రాగో మంచి పిల్ల తీసుకోండక్కా" అంటూ రూపి కూడ చెప్పడంతో కమాండర్‌తో మాట్లాడి గిరిజ రాగోను వెంటపెట్టుకొని తన వాళ్ళలో కలిసింది.

రాగో, రూపీలు ఒకరినొకరు చూసుకున్నారు. ఇద్దరి చూపుల్లో ఏదో తృప్తి కనపడసాగింది. 'నీ బాధలు తప్పినయ్' అన్న భావనతో రూపి వీడ్కోలు చూపులుంటే 'కొత్త ప్రపంచం నేనెలా ఉండాలో' అన్న భావన ప్రతి చూపులో ఉంది.

"పద రాగో, అన్నలు నడుస్తున్నరు" అన్న గిరిజ మాటతో రాగో ఆమె వెనుక నడిచింది.

దళం ఊరు దాటింది.

6

దళం గూర్చి ఏమీ తెలియని రాగో దళం వెంట నడుస్తుంది. దళం ఎటు పోతుందో తెలియని రాగో దళంతోనే నడుస్తుంది. గిరిజ వెనకే రాగో నడుస్తుంది. అంత రాత్రి ఎంత దూరం నడుస్తారో, ఏ ఇంట్లో పడుకుంటారో ఏమీ తెలియదు. తన వద్ద చెద్దరు, దుప్పటి లేవు. కప్పుకోను చీరపేగు కూడ తెచ్చుకోలేదే అని బాధ పడుతున్న రాగోకు ఎవరో ఏదో అనడం వినపడింది. కానీ ఏమన్నాడో అర్థం కాలేదు.

దళం దారి విడిచి అడవిలోకి పోయి ఓ పెద్ద చెట్టుకింద ఆగింది. అందరూ కిట్లు దించుకున్నారు. ఈ అడవి మధ్యలో ఎందుకాగారో రాగోకి అంతుబట్టలేదు. అడక్కుండా ఉండలేకపోయింది.

"అక్కా! ఏమయ్యింది?" అంటూ గిరిజను అడుగుతున్న రాగో గొంతులో ఆతృత ధ్వనించింది.

"ఏంకాలేదు. పడుకోని తెల్లారిపోదాం. ఈ పూటకు ఈ చెట్టుకిందే మన గుడారం రాగో" అంటూ గిరిజ తన కిట్టునుండి మేన్‌కవ్‌లా (వరకు) తీసి పరచింది.

'నేనెక్కడ పడుకోవాలె? గిరిజ తప్ప ఎవరూ తనకు తెలియదే. కప్పుకోవ

దానికి బట్టలెట్లా ? ఏమో ఎలా అవుతుందో' అనుకుంటూ పడకలు సర్దుకోవడంలో మునిగిపోయిన దళ సభ్యులను చూస్తూ రాగో అమాయకంగా నిల్చుండిపోయింది.

"సీదో ! కొత్తక్క నీ మేన్‌కన్‌డా (వరకు)లో పడుకుంటుంది." అని అన్నల్లో నుండి ఎవరో అనడంతో అటుచూసిన రాగోకి అతడు కమాండర్ అని అర్థమై 'దారి చూపాడురా దేవుడా' అనుకుంది. సీదో తన కులం అమ్మాయే అని గుర్తించిన రాగోకి ఆమెతో జంట కలిపినందుకు మరింత మంచిగనిపించింది. తెలియనివి అడగడం, కావాల్సింది చెప్పడం తేలికవుతుంది కదాని మరింత సంతోషంగుంది.

సీదో పక్కకు జరిగి మేన్‌కన్‌డా (వరకు/పాలిథీన్‌షీటు)లో జాగ ఇచ్చి దుప్పటి మీదకు జరిపింది. అవతల పక్క గిరిజ, మరో అక్క పడుకున్నరు. అన్నలందరూ మరోవైపు పడుకున్నరు. అక్కలు, అన్నలు ఇలా ఒకేచోట పడుకోవడం ఎరగని రాగోలో ఎన్నెన్నో ఆలోచనలు మెదలసాగాయి. కునుకు రావడం లేదు. తడవకొకరు సెంట్రీ డ్యూటీకి పోతున్నట్టు మాత్రం తెలుస్తుంది. పక్కనున్న సీదో కూడ డ్యూటీకి పోయేసరికి వరకులో రాగో ఒంటరిదై బితుకు బితుకుమంటూ ముడుచుకుపడుకొంది. చీకట్లో ఏ హెడ్డో (గుడ్డేలుగు), ఏ మెకమో వస్తే ఏం చేస్తారో వీళ్ళ? హోరాండే (కామిని)లు, దయ్యాలు మీదపడితే ఏం చేస్తారో అనుకుంటూ 'నేను కూడ పోయి సీదో దగ్గరే నిలబడతానని' లేవబోయింది. కానీ అంతలోనే సీదో వచ్చి 'మిన్కో ! మిన్కో' అంటూ లేపడంతో 'ఈ అక్క డ్యూటి అయిపోయిందిలే' అని వూపిరి పీల్చుకొని పక్కకు దొర్లి పడుకుంది.

"ఏం అక్కా ! నిద్రరావడంలేదా ? అంటూ సీదో నడుం వాల్చింది.

"ఇంగో" — రాగో.

"మొదటిరోజు నాకూ ఇట్టే అయ్యింది. పడుకో. గంటపుతే తెల్లారుతుంది. లేపుతారు" అంటూనే సీదో నిద్రలోకి జారుకుంది.

ఆ పక్కనున్న అన్న ఎవరో మాంచి గురకపెట్టి నిద్రపోతున్నాడు. మరెవరో అతన్తో పోటీపడుతూవుంటే ఆ గురకలు 'పిల్లులు దెబ్బలాడుకున్నట్లే' ఉందని నవ్వు వచ్చి రాగోకి వచ్చే కునుకుకాస్తా తేలిపోయింది. మిన్కొ అందరిని లేపుతూంటే జాగరణ ముగించి రాగో కూడ లేచి కూచుంది.

"రాగో వస్తవా" - అంటూ రాత్రి ఊళ్ళోనుండి తెచ్చుకున్న బుర్రకాయల్లో మిగిలిన నీళ్ళు పట్టుకొని గిరిజ పిలిచింది. సీదో, మిన్కొలప్పటికే బయల్దేరారు.

"ఇంగో" అంటూ రాగోకూడ నడిచింది.

ఎవరూ ఆకులు తెంపుకోకపోవడంతో రాగోకు ఏం చేయాలో తోచలేదు. గిరిజ కాకపోయినా సీదో, మిన్కోలుకూడ ఆకులు తెంపకపోయేసరికి ఇరకాటంలో పడ్డ రాగో అలాగే నిల్చుండిపోయింది.

"హన్వినా అక్కా" (పోవా అక్కా) అంటూ మిన్కో రాగోను హెచ్చరించింది.

"ఏరు మంత బారామో" (నీళ్ళున్నవి. ఏం గాదు) అంటూ మౌనంగా నిల్చున్న రాగోని సీదో కదిలించింది.

నీళ్ళ వాడకం తెలియని రాగో తర్వాత విడిగా పోవచ్చులే అనుకుంటూ 'రావడం లేదు' అంటూ దాటవేసింది.

తిరిగి వచ్చేసరికి అన్నలు కిట్లు వేసుకుంటున్నారు. అక్కలుకూడ కిట్లెత్తుకున్నారు. మూర అదనంగా వేసుకున్న జబ్బసంచిని రాగోకు అందిస్తూ "పట్టుకో అక్కా" అంటూ నడవసాగాడు.

దళం తన ప్రోగ్రాం ప్రకారం 'బర్రెంకతోగు' చేరుకుంది. కిట్లు దించడమే ఆలస్యంగా అందరూ నిక్కర్లు వేసుకున్నారు. రాగో వింతగా చూస్తూ కూచుంది. సీదో - మిన్కోలుకూడ నిక్కర్లు, బనీనులతో మగాళ్ళతోపాటు లైన్లో నిలబడేసరికి రాగో ముసి ముసిగా నవ్వుకుంది.

ఎక్సర్‌సైజు చేస్తున్న వారిని తదేకంగా చూస్తున్న రాగోను ఉద్దేశించి గిరిజ "రేపటినుండి నువుకూడ చేయాలక్కా" అంటూ ప్రోత్సహిస్తుండగా "కిస్సు మాస బాయి" (నిప్పు రాజేయక్కా) అన్నాడు గాండో.

ఎక్సర్‌సైజు ముగిసిందంటేనే చెమటలు కక్కుతున్నా సరే వేడివేడి 'మండే కడుపుకు కాలే ఛాయ్' కావాలంటాడు గాండో.

"అగ్గిపెట్టె నా కిట్లో ఉందక్కా" అంటూ సీదో రాగోను యిక కదలమంది.

దళ సభ్యులందరూ పొయ్యిచుట్టు చేరేసరికి రాగో పక్కకి తప్పుకుంది. గాండో ఛాయ్ పనిలోకి దిగాడు. అందరూ కూని రాగాలు తీస్తున్నారు. కమాండర్ రుషి దూరంగా వరకులో కూచుండి రేడియో వింటున్నాడు.

....

తనకంటూ తువ్వాల, ఓ చద్దర్, ఓ జబ్బసంచికూడ ఏర్పడ్డాయి. ముగ్గు

రక్కలు ఉండి అంతా కలుపుగోలుగా ఉండడంతో మారు చీరకి, బొట్టు, అద్దం, దువ్వెనకి కూడ వెతుక్కోవలసిన పని లేకుండాపోయింది. దళంలో కొందరి పేర్ల యినా ఇపుడు గుర్తుంటున్నాయి. నాలుగైదు రోజులుగా మనుషులు పరిచయమై, అందరూ చనువుగా అక్కా, అక్కా అంటూ ఆప్యాయంగా మాట్లాడుతూ వుంటే మొదటినాటి బెరుకు కొంత తీరింది.

ఆరోజు ఎప్పటిలాగే అందరితోపాటు పొయ్యిచుట్టు కూచున్నపుడు తనకి టీ గ్లాసు అందిస్తూ ఒక కామ్రేడ్ "యీ కొత్తక్కకు ఏం పేరు పెడదాం" అంటూ దూరంగా ఉన్న కమాండర్‌ను కేకేసి అడిగిండు.

"అపుడే ఏం తొందర కామ్రేడ్ ? రేపు డ్రెస్సు, తుపాకి ఇచ్చినపుడు అక్కనే అడుగుదాం" అంటూ రుషికూడ పొయ్యివద్దకు చేరుకున్నాడు.

మర్నాడు రాగోకి డ్రెస్సు, తుపాకి, చెప్పులు, టోపి వచ్చాయి. కమాండర్ గిరిజ చేతికి డ్రెస్సు, బెల్ట్ యిస్తూ "రాగోకు ఎక్కించడక్కా" అనడంతో ముగ్గు రక్కలు రాగోను లాక్కుపోయారు.

ఆ హడావిడిలో చీర కొయ్యకి తట్టుకోని రాగో కిందపడింది. సీదో కిసు క్కున నవ్వుతుంటే గిరిజ - మినో్కలు రాగోని లేపారు. కొయ్య తట్టి చీరా, లంగ చిరిగాయి తప్ప దెబ్బేమి తగల్లేదు.

"హాయిగా డ్రెస్సు ఎక్కిస్తే ఈ పాట్లుండవు." అంటూ సీదో హుషారు చేసింది; నవ్వినందుకు తనే నొచ్చుకుంటున్నట్టు.

చిరిగిన చీర విడిచేస్తున్న రాగోకు పెళ్ళయ్యాక పెద్దలు చేసే "టీకా" గుర్తు కొచ్చింది. బలవంతంగా బట్టలు తీసేసి, అంద విహీనంగా, అర్ధనగ్నంగా తయారు చేసి జానెడు టవల్ కిందికీ, బెత్తెడు టవల్ మీదికీ కట్టబెట్టే ఊరి శేదోలు కళ్ళల్లో మెదిలారు. 'మన్నీ, మన్నీ' (వద్దు, వద్దు) అంటూ మొత్తుకున్నా, ఏడ్చినా, కిందపడి దొర్లినా వినిపించుకోని "పెద్దమనుషుల" మొండి వాలకాలు, వాళ్ళ తిట్లు, దెబ్బలు చెవుల్లో గింగురుమన్నాయి. గాజులు పగులగొట్టి, పుస్తెలాడదీసి, బొట్టు చెరిపేసి మానంతీసే రీతి రివాజులు గుర్తుకొచ్చి ఒళ్ళు గగుర్పొడిచింది.

"చెడ్డీ వేసుకో అక్కా" అంటూ చెడ్డీ అందిస్తున్న గిరిజ పిలుపుతో రాగో ఈ లోకంలోకి వచ్చింది.

"నన్న బోరో" (ఆఁ ! ఏమో పో) అంటూ గునుస్తున్నట్లు ఋంగమూతి పెట్టింది రాగో.

"బారామో" (ఏం గాదు) అంటూ ప్రోత్సహిస్తూ కొత్త బనియన్ మడత విప్పి చేతిలో పట్టుకోని సీదో ముందుకొచ్చింది.

క్షణంలో రాగో వేషం మారిపోయింది. డ్రెస్సు ఎక్కించి, టోపి పెట్టుకోని చెప్పులేసుకుంది. ఆ ముగ్గురక్కల్లాగే రాగో తంచన్‌గా తయారైంది.

గిరిజ ఒక్కసారిగా కావలించుకుంది. సీదో, మిన్కోలు మాడియక్కల ఆచారం ప్రకారం ముద్దులు పెట్టుకున్నరు.

రాగోకు ఇంతటి ఆప్యాయత ఎన్నడూ దొరకలేదు. తోబుట్టువులు లేక రాగో దేనికీ నోచుకోలేదు. అయినా ఏ మాడియా స్త్రీకూడ యింత ఆదరం పొందగా తానెన్నడూ చూడలేదు. ఊహాలోకాల్లో తేలిపోతోంది రాగో.

పెళ్ళైన మాడియక్కల రూపాలు మనసులో మెదలుతున్నాయి. మైని గుర్తొచ్చింది. మొలకు చుట్టుకొని, మోకాళ్ళ దిగని మూరెడు తువ్వాలతో అత్త మామలు, మొగనిమధ్య పడి ఉండే మైని కళ్ళల్లో మెదిలింది. తండ్రి తిట్టినా, కొట్టినా. మెచ్చుకున్నా, ప్రేమించినా అలా చాలీచాలని గుడ్డలతోనే రీతి రివాజుల చాటున జీవితమంతా యీడుస్తూ కాపురం చేసే తల్లి గుర్తుకొచ్చి మనసంతా కలకబారింది. ఊళ్లోని శేడోల ఆకారాలు గుర్తుకు రాసాగాయి. 'చచ్చినా యిక ఆ నరకంలోకి పోను' అనుకుంటూ షర్టు కాలర్ జేబులు, నడుంకున్న బెల్టు పుణికి చూసుకుంటూ పరవశించిపోతున్న రాగో కమాండర్ పిలుపుతో ఉలిక్కిపడింది.

"తుపాకీ అక్కా"— రుషి

"కిట్టు రెడీ దాదా" అంటూ టుగ్గె బెల్టులు సవరించిన కిట్టుతెచ్చి కమాండర్‌కు అందించాడు.

"ఇదిగో పౌచ్, 25 తూటాలున్నాయి" అంటూ ముక్తసరిగా చెప్పి ఉగ్గె ఇచ్చాడు.

"తుపాకీ గుడ్డలక్కా. రోజూ తుడుచుకోని తుపాకి శుభ్రంగా ఉంచుకోవాలి" అంటూ సీదో చేతిలో పెట్టిన గుడ్డలు చూస్తూ రాగో విస్తుపోయింది. అవి తను అప్పుడే విడిచిన చింకి చీరలోవే. అటు చూసేసరికి గిరిజ ఆ చీర నుండే కాస్తా పెద్ద పేగులు రెండు చింపి తన కిట్టులో పెట్టుకొంది. మరో రెండు తెచ్చి తనకిచ్చి

"రాగో! ఇవి ఉండనీ! అక్కరొస్తయి" అంటూ పోచ తీసి నడుంకు చుట్టింది.

"అక్కా! ఇటురా. తుపాకి ఎలా కొట్టాలో చెప్పుతాను" అంటూ రుషి మఘాంకు కాస్త దూరంగా దారి తీశాడు.

"పద రాగో" అంటూ గిరిజ తోడొచ్చింది.

కమాండర్ స్టాండింగ్, సిటింగ్, లైయింగ్ పొజిషన్స్ మూడు చెప్పి తుపాకి ఎలా ఫైర్ చేయాలో చెప్పాడు. రాగో కమాండర్ చెప్పినట్టే ఫైర్ చేసింది. కానీ, ట్రిగ్గర్ గుంజుతునే, కళ్ళు మూసేయడంతోగురి తప్పింది. అయితే తూటా పేలింది.

"మొదటిసారి ఎవరికైనా ఇలాగే ఉంటుందక్కా" అంటూ రుషి ధైర్యం చెప్పాడు.

"అక్కా ఏం పేరు పెట్టుకుంటావ్" అంటూ మూర ఆత్రుతగా అడిగాడు.

"నువ్వు పేరు మార్చుకోలేదుగా మరి" అంటూ రుషి ఎదురుప్రశ్న వేశాడు.

"మీరే మార్చలేదు దాదా–" మూర

"నీకు ఆ పేరు బాగనే ఉంది కామ్రేడ్. అయినా నిన్ను ఇక్కడ ఎవరూ గుర్తుపట్టడం లేదుగా. అదే అసలు పేరు అన్నా ఎవరూ నమ్మరు"–రుషి పేరేందుకు మార్చుకుంటారో వివరించాడు.

"ఏం పేరు పెట్టుకుంటవు అక్కా?" అంటూ మిన్కో మళ్ళీ చర్చను ఇటు తిప్పింది.

"ఇదే బేష్మంత" (ఇదే బాగుంది)—రాగో

పేరు మార్చుకోవడమే మంచిదంటూ కారణాలతో సహా గిరిజ మరోసారి వివరించింది. అయితే మీరే చెప్పండని రాగో అనడమే తడవుగా "జైని" అని అరిచింది సీదో. అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

తుపాకి, కిట్టు, డ్రెస్సు, టోపీతో ఠీవిగా నడుస్తున్న జైనికి దళం ఫార్మేషన్‌లో పదో స్థానం యిచ్చారు. అంకెలు తెలియని జైనికి తికమక లేకుండా "టుగ్గె వెనుక నడవాలక్కా" అని కమాండర్ అతన్ని చూపగా పేరు గుర్తుందో లేదోనని 'బక్క దాదా' అని ముద్రవేసి గుర్తుపెట్టుకుంది. ఆ దళంలో టుగ్గెయె అందరికన్నా బక్కగున్నందున జైని ఆ పేరుతోనే గుర్తుపెట్టుకుంది.

ఊళ్ళో అడుగుపెట్టిన దళానికి లాల్‌సలాంలు మొదలైనయి. రాం, రాం అనేవాళ్ళు రాం రాం అంటుండే లాల్‌సలాంను ఎలా పలకగలిగే వాళ్ళు అలా పలుకుతున్నారు. ఆడ మగ భేదం లేకుండా ఆ ఊరి అన్నలు అక్కలొచ్చి దళం వారితో చేయి కలుపుతున్నారు. జైని మాత్రం స్పష్టంగా 'లాల్‌సలాం' అనడం నేర్చుకుంది. ప్రేమగా చేయి కలుపుతుంది.

"బాయి పూనా నిమ్మె" (అక్క నువ్వు కొత్తనా) అంటూ ఓ ముసలమ్మ జైనిని నిలబెట్టి పరామర్శించింది.

"ఇంగో. కొత్తనే"—జైని కదలబోయింది

"నీ పేరు ఏందక్కా?" అంటూ మరో ప్రశ్న వేసేసరికి రాగో తత్తర పడింది. వెనుకనున్న మిన్కో వెంటనే "జైని" అంటూ అందించింది.

"ఆఁ! అచ్చం జువ్వి రాగో తీరుగుండే అడిగినక్కా కళ్ళల మసకలు. మనిషిని పోల్చలేను" అంటూ ముసలమ్మ కదిలింది.

"అబ్బా! కొత్తపేరు పెట్టుకోవడమే మంచిదయింది" అనుకుంటూ రాగో ముందుకు సాగింది.

చివరింటి ముందు దళం ఆగింది. కిట్లు దించారు. వాకిట్లో వాల్చిన మంచాలపై దళ సభ్యులు కూచున్నారు.

కల్రె ఆపు పొద్దుగు తీరుగా ఆకాశంలో మబ్బు కమ్మింది. గుడ గుడాంటు ఉరుముతుంది. ఇంకా పూర్తిగా చీకటి పడకపోయినా తళుక్కున మెరుపు మెరిసే సరికి కళ్ళు జిగేలుమంటున్నాయి. ఇంటికొచ్చిన పశువులను కొట్టాల్లోకి తోలడానికి పిల్లలు తంటాలు పడుతున్నారు. పందిర్లమీద ఆరబోసిన ఇప్పపూలు కుప్పలేకట్టి ఇంట్లో సర్దుతున్నరు మగాళ్ళు. మొర్రి పళ్ళు, తునికి పళ్ళు నానితే పురుగులు పడతాయని ఆడవాళ్ళు బుట్టలో సర్ది ఉట్ల పైకి ఎక్కిస్తున్నారు. పెద్ద వర్షమే గుమ్మరించబోతున్నట్టు మబ్బులు తరుముకొస్తున్నాయి. పిల్లలు మాత్రం బజార్లో గంతు లేస్తున్నారు.

క్రమంగా గాలి మొదలయింది. ఎక్కడో వాన కురిసి వెలిసినట్టు గాలి తడిగా వీస్తుంది. దాని జోరు కూడ పెరుగుతుంది. కొమ్మలు బుయ్.......బుయ్....అంటూ ఊయాల లూగుతున్నాయి. బయట దుమ్ము రేగుతుంది. పాతబడ్డ గుడిసె కప్పులు ఈ గాలికి ఆగేట్టులేవు. నెగళ్ళంచే కొంపలంటుకుంటయని యిళ్ళముందు ఎక్కడి కక్కడే నెగళ్ళు చల్లారుస్తున్నరు.

"అబ్బా! అదృష్టం ఇంట్లో పడ్డం" అంటున్నడు సంతోషంతో కర్ష.

"జంగల్ నడుమూండగ కొట్టాలె వాన, ఝుగ చూడు" అంటూ గొంతు కలిపాడు డుంగ.

ఆ అనుభవం గుర్తుకొచ్చి ఒక్కసారి ఒళ్లు జడత ఇచ్చింది గిరిజ. అడవి మధ్యలో నడుస్తుండగా అకస్మాత్తుగా మొదలైంది వర్షం. వానకి గాలి కూడ తోడై కప్పుకున్న మేన్‌కపడా ఎంత ఆపినా ఆగక అందరూ తడిసి ముద్దయ్యారు. అంతలో ఆగినా మేలే. గచ్చకాయలంతీసి వడగళ్లు పడడంతో చెట్టుకింద ఆగినా కూడ ఆ రాళ్ల దెబ్బలకు ఒళ్లు వాచిపోయింది. మేన్‌కపడా ఎంత దగ్గరగా చుట్టుకున్నా బండలు విసిరినట్టు ఆ రాళ్ళ దెబ్బలు ఎవరిని నిలవనివ్వలేదు. ఆ అవస్థ గుర్తుకు వస్తేనే గిరిజకు రోమాలు లేచి నిల్చున్నయి. 'అబ్బా!' అనుకుంటూ 'ఆ అవస్థ పగవాడి కూడ వద్దు' అనుకుంటున్నంతలోనే కమాండర్ పిలుపు వినపడింది.

"జైనితో మాట్లాడుదాం అక్కా" అంటూ రుషి ఇంటి చూరుకింద విడిగా వున్న చాప వైపు దారి తీశాడు.

గాలి హోరును మించి గొంతు పెంచి జోరుగా పాటలు ప్రాక్టీసు చేస్తున్న దళ సభ్యుల్లో కూచున్న జైని కూడ గిరిజ పిలుపుతో లేచి వచ్చింది.

ఇలా పిలిచి విడిగా కూచోబెట్టేసరికి ఏం మాట్లాడుతారోనని జైని మనసులో ఆందోళన మొదలయ్యింది.

"బాతా అక్కా! బహామంత" (ఏం అక్కా! ఎట్లుంది?) అంటూ రుషి గొంతు సవరించుకున్నాడు.

"బేషే దాదా" (మంచిదే దాదా) - జైని ఠక్కున చెప్పేసింది.

"ఆఁ! నీతో మాట్లాడేది ఉందక్కా. నువ్వు దళంతో తిరగబట్టి వారం రోజులు దాటింది గదా. ఇప్పుడేమనుకుంటున్నవు. ఇక్కడ నీకెట్లుంది?" అంటూ రుషి నెమ్మదిగా మొదలుపెట్టాడు.

"నాకు బేషే దాదా! నేను చాలా రోజుల్నుంచే అన్నల్లో కలువాలనే వెతుక్కుంటూ మీలో కలిసిన" అంటూ జైని యింకా దీని గురించి ముచ్చట ఎందుకన్నట్టు మధ్యలో ఉన్న గిరిజవైపు చూసి తలదించుకుంది.

"అది సరే అక్కా. నువు ఏం కావాలనుకొని దళంలో చేరావు? వారం రోజులు తిరిగావు కదా. ఇక్కడంతా మంచిగనే ఉందా. మాతోపాటు యీ కష్టాలు

పడగలవా? నువ్వేమనుకుంటున్నావ్! అంతా బేషని ఒక్కమాటంటే సరిపోదుకదా" అంటూ గిరిజ మాటలు పొడిగించింది.

జైని ఒక్కసారి కళ్ళెత్తి గిరిజను, రుషిని చూసి చూపులు నేలకు దించేసింది. ఓ క్షణం ఎవరూ మాట్లాడలేదు. మళ్ళా రుషే అందుకున్నాడు.

"అదీ కాదక్కా - ఇక్కడి పద్ధతులను చూస్తున్నవు కదా ! అడిగిందానికి తెలిసిన కాడికి మాట్లాడ్డానికి సిగ్గుపడకూడదు. జంకులేకుండా చెప్పాలి. తెలియనిది అడిగి నేర్చుకోవాలి" అంటూ "నువ్వు ఏం కావాలనుకొని దళంలోనికి వచ్చావు ? మనం ఊరి దాదలతో యీ వారం రోజులుగా మాట్లాడుతున్న ముచ్చట్లు వింటున్నవు కదా ! నీ కెంతవరకు సమజయింది" అని జైనిని నీకు తెలిసిందే చెప్పమని ప్రోత్సహించాడు.

కాసేపు తటపటాయించి "అదీ నాకు వాహో (రాదు) దాద" అంటూ మొదలెట్టింది జైని.

" మా మాడియాల్లో ఇష్టంలేని పెళ్ళి కట్టబెట్టి, మేం వెళ్ళం అంటే తన్నులు గుద్దులు చేసి బాధలు పెడుతున్నరు. దూరంగా పారిపోయి కూలి జేసుక బతుకు తుంటే 'కేర్దే కేర్దే' అంటూ ప్రతి వూర్లో వెంటబడతరు. అలా మొండిగ బ్రతికే కంటే అన్నల్లో చేరి మంచిగా పని చేస్తే బాగుంటుందని వచ్చిన. మీరయినా మా ఆది వాసీలకోసమే గదా ఇన్ని తిప్పలు పడుతున్నరు" అని గొంతు పూడక పోయి నట్టు ఆగిపోయింది.

"బాగా చెప్పావ్. నీ తిప్పల పోవాలని నువ్వు దళంలోనికి వచ్చినవ్. కేర్దే లెక్క తిరుగుడు వద్దనీ ఆ కష్టం పోవాలనీ వచ్చినవ్. మంచిదే. కానీ దళంలో కూడ కష్టాలు ఎక్కువే వుంటాయి. అన్నానికి, నిద్రకు, సెంట్రీకి, నడకకు అల వాటు పడాలి. తుపాకి ఫైరింగ్, డ్రీల్లు మంచిగ నేర్చుకోవాలి. పోలీసులెదురైతే కొట్లాడాలి. నీ కోసం అయ్యను, అవ్వను పోలీసులు బాధపెడితే ఓర్చుకోవాలె."

"నీ లెక్క బాధలు పడేది ఒక్క అక్కలేనా ఆలోచించు. పేపరు మిల్లు బాబులు, టేకేదార్లుఅన్ని తీర్ల మనల్ని దోచుకుంటున్నరు. హాటుం (సంత) లో షాహుంకార్లు మన ఆదివాసీలను దోచుకొని మరింత బలిసిపోతూన్నారు. పూటకు గతి లేక, మందు మాకు లేక చదువు లేక, గిట్టుబాటు కూలి లేక మన అయ్య. అవ్వలు దాదలు,అక్కలు ఎన్ని తీర్ల బాధలు పడుతున్నరో నీకు తెలుసు.

దున్నుకోను భూమి లేదు. ఉన్న భూమి మీద మనకు హక్కు లేదు. అడవిలో చెట్టు కొట్టినా, గడ్డి కోసినా, పండు తెంపినా, తిండికోసం వేట చేసినా జంగలోల్లు మీద పడి హరి ఘోస పెడుతరు.

ఈ తిప్పల్లన్ని పోవాలనీ, ఎవల రొష్టూ లేకుండా మన బతుకులు మనం బతుకాలనీ, బాగుపడాలనీ మనం కొట్లాడుతున్నం. గీ లఢాయి చేసుకుంటునే మన అన్నలు ఎంతోమంది ప్రాణమిచ్చింద్రు. ఈ కొట్లాట గెల్వకుండ, మనల్ని చంపాలని పోలీసులు మన జాడకోసం తిరుగుతరు. వాళ్ళకు దొరక్కుండా తిరుగుతూ మనం లోకులందరిని జమ చేయాలి. మనందరం కలసి కొట్లాడి ఈ రాజ్యం గెలిస్తేగానీ బాదలు పోవు. ఇది నాల్గురోజుల్ల అయ్యేపనిగాదు. ఇవన్నీ విచారం చెయ్యాలి. బుద్ధి నేర్వాలి. ఇవన్నీ మన జనాలకు చెప్పాలి. అంతేగాని నాలుగురోజులు తిరిగి దళం విడిచి ఎవరిదో ఇల్లు చూస్తానంటే కలువదు. మంచిగ అర్థం చేసుకొని ఉండాలి. ఇదే నేను చెప్పేది" రుషి ముగించాడు.

"మేము కూడ ఇవన్నీ విచారం చేసి వచ్చిన అక్కా. మనం కొట్లాడుకుంటే మన కోసం ఇంకెవరో కొట్లాడరు. దళంలో చదువు నేర్చుకొని, బుద్ధి మాటలు నేర్చుకొని అందరితోని కలసి మెలసి ఉండాలక్కా. ఎవరేమన్నా, నీకు ఏం లేకున్నా, ఏం కావాలన్నా కమాండర్‌కు చెప్పాలక్కా" అంటూ జైని వంతుకు చెబుతున్నట్లే గిరిజ మళ్ళీ నొక్కి చెప్పింది.

చెప్పుతున్నదంతా జైని శ్రద్ధగా వింది. వింటున్నంతసేపు ఆమెలో ఎన్నో ఆలోచనలు. తాను ఎన్నటికీ మళ్ళీ తేర్దగా తిరగలేదు. వీరితోనే ఉండాలి. కానీ చెప్పినవన్నీ రాలేదని వీళ్ళు పొమ్మంటే ? ఎవని పంచనో చేరి సంసారం చేయాలా? మళ్ళీ ఆ పాత బతుకుతో రోతలో కుళ్ళి చావడమేనా ? ఏమైనాసరే. వీళ్ళను విడిచి పెట్టవద్దనే గట్టిగా అనుకుంది.

ఏదో చెప్పాలని చెప్పలేక జంకుతున్నట్టు కొంత ఇబ్బందిగా కదలి సర్దుకొని కూచుంది జైని.

అప్రయత్నంగా గిరిజ చెయ్యి తన చేతులోకి తీసుకొంది.

"ఇంగో" అంటూ గొంతు సవరించుకొని, "యిల్లు జేర్రాలనే ఆశ లేదక్కా. యిక్కడే వుండి అన్ని నేర్చుకుంటా, కొట్లాడి యిక్కడే చస్తా" అంటూ యిక మాట పెగలనట్టు ఆగిపోయింది.

కవిత్వం-గతితార్కికత :

నైరాశ్యభావాల స్వగతాలు

జె. సి.

నీలిమాగోపీచంద్ సంకలనం ఇక ఈ క్షణం (కవిత్వం ప్రచురణలు-6)లోని కవితల్లో కూడ ఆధునిక కవితా లక్షణం పుష్కలంగా ఉంది. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య భావజాలంలో అంతర్లీనంగా ఉన్న పితృస్వామిక భావధోరణి ఈ కవి కవిత్వంలో కన్పించే 'ప్రేమ' అనే నైసర్గిక సామాజిక చైతన్య లక్షణం వల్ల అభావం చెందినట్లనిపిస్తుంది. కాని ప్రధానంగా అధిభౌతిక ధోరణినే ప్రదర్శిస్తున్నది. ఉదాహరణకు "శబ్దించు ప్రియా శబ్దించు" అన్న కవితలో జీవితమనే పోరాటంలో ఒత్తిళ్ళకు తట్టుకోలేక మౌనంలోకి క్రమించిన ప్రియుణ్ణి లేక ప్రేయసిని సంబోధిస్తూ ఈ కవి ఈ విధంగా అంటాడు :

ఏమిటలా మౌనంగా నీవు............
మౌన మహావృక్షం కింద సోలిన అనుభూతి క్షణంలా
శిశిర యుద్ధంలో కూలిన ఎండుటాకు దైన్యంలా
నిశ్చబ్ద నేలమాళిగల్లో జీవితగతిని
పదిలపరచి చూపునెందుకు మేఘావృతం చేస్తావ్
ప్రియా! మనం యుద్ధకాలంలో బతుకుతున్నాం
కత్తిమొనలపై పెదవులనానించక తప్పదు
ఊహలను అగ్నిపర్వతాల్లో ముంచక తప్పదు

రాలిన కన్నీటి చుక్క గిరిజ ముంజేతి మీద పడ్డం రుషి గమనించకపోలేదు.

"సరే అక్కా ! రేపట్నించి గిరిజక్క దగ్గర చదువు నేర్చుకో. పట్టుదలగా నేర్చుకుంటే అన్నీ వస్తాయి" అంటూ "మన దగ్గర పలక, బలపం ఉన్నాయికదా" అని యిక ముగిద్దాం అన్నట్టు గిరిజవైపు చూశాడు.

గాలి వీచి మేఘాలు చెదిరిపోయాయి. నక్షత్రాలు మెరుస్తున్నాయి.

"గాటోరడీ ! మేం తింటున్నాం" అంటూ గాండో సీదోలు ముక్తకంఠంతో నినదించడంతో ముగ్గురూ లేచారు.

(ఇంకా ఉంది)

ఏ రోడ్డు మరణం ఎప్పుడో తెలియదు
బాటసారుల మనస్తత్వాలు ఎప్పటికీ
కనీసం ఈ జీవితం వరకూ అర్థంకావు
ఇక్కడి జీవితాలు ఓ జన్మక్రితమే
ఖననం చేయబడ్డ శవప్రాయాలు
ఇక్కడి రక్తమాంసాలు నిర్వికారంగా
భూమిపై నిలబడ్డ ఒంటి స్తంభాలు
వంతెనలు విరిగిపడుతున్న శబ్దం వినిపిస్తోంది!
ఇకింతేనా అనిపిస్తుంది గానీ
ఏదీ భ్రాంతి కాదు

"ఇక్కడి జీవితాలు"— అంటే ఈ ప్రపంచంలో నివసించే జనం— "ఓ జన్మ క్రితమే/ఖననం చేయబడ్డ శవప్రాయాలు" అన్న పాదాల్లో కన్పించే రూపచిత్రాలు అర్ధ వలస, అర్థ భూస్వామ్య విలువల్ని ప్రతిఫలించే ప్రతీకలే. ఇక్కడి-అక్కడి జీవితాలు అన్న అధిభౌతిక వైరుధ్యం ఈ కవితలో వాస్తవికతావాద లక్షణాన్ని ప్రతిపాదిస్తున్నది. ఈ లక్షణం ప్రధానంగా బూర్జువా చైతన్యానికి సంబంధించింది. అలాగే ఒక "జన్మ క్రితమే" పాతివేయబడ్డ జీవితాలన్న భావం పూర్వజన్మ, పునర్జన్మలన్న భూస్వామ్య భావజాలాన్ని ప్రకటిస్తున్నది. ఈ రెండు ప్రతీకల్లో యిమిడి ఉన్న అధిభౌతిక తర్కం నుండే ఇంకో ముఖ్యమైన ప్రతీక కూడా జన్మించింది. అది ఈ బతుకు ఒక శ్మశానం, లేక సమాధి వంటిదని. ఈ ప్రపంచంలో బతికే వ్యక్తులందరు ఈ జీవితం అనే శ్మశానం లేక సమాధుల్లో "ఖననం" చేయబడ్డ శవాల వంటివారని అర్థం. జీవితం ఒక శ్మశానం వలె ఉన్నదన్న భావం మొదటి ప్రపంచ యుద్ధం తరువాత పాశ్చాత్య నాగరికతను శ్మశానంతో పోల్చిన టి. ఎస్. ఇలియట్ వేస్ట్‌లాండ్‌లోని సామ్రాజ్యవాద చైతన్యానికి చాలా దగ్గరగా ఉంది. జీవితాన్ని ఈ విధంగా చూడటం ఒక ప్రస్ఫుటమైన వేదాంత ధోరణి. ఈ ధోరణి సరుకుల మాయ, వాటి చలనంలోని నైరూప్యత, యాదృచ్ఛికతలకు అనుగుణంగా వ్యక్తి జీవితాన్ని "రోడ్డు"గా ప్రతీకరిస్తుంది ఈ కవితలో. వ్యక్తుల మనస్తత్వాల్ని బాటసారుల మనస్తత్వాల్నిగా, అంటే వాళ్ళు చేరవలసిన చోటే ప్రయాణం కాని మధ్యలో తారసిల్లే తోటి మానవులతో స్నేహం ముఖ్యం కాదన్న అధిభౌతిక భావాన్ని ప్రకటిస్తుంది.

ఈ తర్కాన్ని అనుసరించే ఎప్పుడో తెలియని మరణమంటే భయపడకుండా ఈ జీవితంలో "బాటసారు"లైన మనకు మన అస్తిత్వాలే ("మన సత్వాలు") అగమ్యగోచరంగా ఉంటాయి అన్న వేదాంత ధోరణితో మాట్లాడినప్పటికీ, మన చుట్టూ ఉన్న సమాజంలో నిస్సహాయంగా బతుకుతున్న వ్యక్తుల జీవితాలు "ఓ జన్మక్రితమే/ఖననం చేయబడ్డ శవప్రాయాలు/....ఒంటి స్తంభాలు" అన్న సత్యాన్ని, తోటి మానవుల యెడల సామాజిక బాధ్యతను వాస్తవికతావాద ధోరణిలో కవి గ్రహిస్తాడు. పరస్పర విరుద్ధమైన అధిభౌతిక ప్రత్యయాల్ని సమానార్థకమైన ప్రత్యామ్నాయాలుగా గుర్తించే ఈ ధోరణి సామ్రాజ్యవాదం కొమ్ముకాసే ధోరణి. దీని వల్లనే వేదాంతాన్ని, విప్లవ పరిభాషనూ జోడించి కుహనా పై చిత్రిని, ఊహానిబద్ధతను సాధించాడు కవి శైలిలో, లయలో కూడ.

జీవితం నుంచి మహాప్రస్థానం చేసి "మౌన మహావృక్షం కింద సోలిన అనుభూతి క్షణంలా/శిశిర యుద్ధంలో కూలిన ఎండుటాకు దైన్యంలా/నిశ్శబ్ద నేలమాళిగల్లో జీవితగతిని/పదిల పరచి చూపు"ను మేఘావృతం చేసిన వియోగాక్రాంత్యముని లేక సీతామహాలక్ష్మి ఈ కవితలో సంబోధింపబడ్డ ప్రియుడు లేక ప్రేయసి. అతడి లేక ఆమె చైతన్యం ఆత్మగతమైన "అనుభూతి క్షణం"తో, ప్రకృతిలో నైమిత్తికంగా రాలిపోయే "ఎండుటాకు దైన్యం"తో, వెలుతురు, వేగం, రవం, రాగం వంటి పదార్థ చైతన్య రూపాలన్నిటి నుండి దూరమయిన "నిశ్శబ్ద నేలమాళిగల్లో"ని జీవితం వంటి స్తబ్ధతతో ప్రతీకరింపబడింది. ఈ వాస్తవికత భౌతికమైనా ఆత్మాశ్రయమైంది, యాంత్రికమైంది, అధిభౌతికమైంది. అంతేకాక పాక్షికమైంది కూడ. ఈ పాక్షిక వాస్తవికతలో నైరూప్యం చేయబడిన ప్రియుడు/ప్రేయసి చైతన్యానికి, సామాజిక బాధ్యతకు మధ్య సంబంధం కల్పించడం కవి ఊహాపై చిత్రికి పరాకాష్ఠ అని చెప్పవచ్చును :

ప్రియా! మనం యుద్ధకాలంలో బతుకుతున్నాం
కత్తిమొనలపై పెదవుల నానించక తప్పదు
ఊహలను అగ్నిపర్వతాల్లో ముంచక తప్పదు

ఈ లైన్లలో కవి దర్శించే "యుద్ధకాలం" గతితార్కిక సత్యమైన విప్లవ పోరాటం కాదు. అది సమాజ జీవితంతో సంబంధంలేని నైరూప్య వ్యక్తి చైతన్యంలో అంచే

ఆత్మాశ్రయ ఊహల్లో కల్పించుకున్న భ్రాంతి మాత్రమే. ఈ భ్రాంతి ఆధారంగా నిర్మింపబడ్డ అధివాస్తవిక ప్రతీకలే "కత్తిమొనలపై పెదవుల నానించడం", "ఊహలను అగ్నిపర్వతాల్లో ముంచడం" వంటి రూప చిత్రాలు. విభ్రమం గొలిపే ఈ ప్రతీకల అర్థం ఇది అని చెప్పబూనడం వృథాప్రయాస.

ఈ కవితలోని భ్రమపూరిత వాతావరణాన్ని నిజమని తనకు తాను నమ్మించుకోజూసే కవి ప్రయత్నం సెల్ఫ్ హిప్నాటిజం వంటిది. అతడు మాట్లాడే భాష (కవిత్వం) లో "ఏ భావనా అవ్యక్తం" కాకున్నా "ఏకాంత భాషే". తనకు తాను శోధించుకోడానికి ఉపకరించే కవితను సృష్టించే క్షణంకూడ "చీకటి తెరల మధ్య శోకితలానే ఉంటుంది." శాక్యముని, శోకితల కలగాపులగం అయిన తన కవితా హృదయాన్ని జ్ఞాపకాల్ని తవ్వుకునే పురాతత్వ ప్రాధాన్యత కల స్థలంగానే తలుస్తాడు కవి. "ప్రవాహ సాన్నిహిత్యం వేరు....స్వప్న సాంగత్యం వేరు" అంటూనే చలనరహితమైన వైయక్తిక చేతనలో ("వ్యక్తి స్వప్న తటాకాల్లో") ఒక పువ్వు విచ్చుకుని "యుద్ధకాల వాతావరణాన్ని స్పృహించాలి" అంటాడు కవి. జీవిత సమరంలోని విప్లవాభాసను కూడ స్వాప్నిక సత్యంగానే పరిగణిస్తాడు. ఈ పాక్షిక వైయక్తిక సత్యాన్ని "రక్తమాంసంగా చేసి/సజీవంగా ప్రవహింపజేయ"డానికే నిశ్శబ్దాన్ని, మౌనాన్ని ఛేదిస్తూ "అరుపును సాయుధం చేయ్!" అని పిలుస్తాడు కవి.

ఇక్కడ మౌనం స్వయంకృతాపరాధం
ఒక ప్రపంచం మూగవోయేట్టు
ఒక ఏకాంతం బద్దలయేట్టు
అరుపును సాయుధం చేయ్!

జీవితమనే సమాధుల్లో ఖననం చేయబడ్డ మనుష్యుల్లో ఒకరైన తన ప్రేయసి లేక ప్రియుడు నిశ్శబ్దంలో, మౌనంలో మునిగిపోకుండా స్వప్న తటాకంలో విచ్చుకున్న పువ్వువంటి వైయక్తిక చైతన్యంతో నిశ్శబ్దం, మౌనం, ఏకాంతం వంటి "ప్రపంచాల్ని" (శ్మశానాల్ని) బద్దలు చేస్తూ గట్టిగా అరవమని ప్రేరేపిస్తున్నాడు.

స్వప్నాన్ని "రక్తమాంసంగా" చేయడం, అరుపును "సాయుధం" చేయడం వంటి భౌతిక వాస్తవికత, విప్లవ పోరాటాలనుండి గ్రహించిన మాటలు ఈ కవితకు

కవిత్వ భ్రాంతిని కల్గించినా వాటి వెనుక ఉన్న పైయక్తిక చైతన్యం వాటిని ప్రాణం లేని పారిభాషిక పదాలుగానే మిగిలిపోయేట్టు చేసింది.

ఈ సంకలనంలోని అన్ని కవితల్లోనూ ఈ రకమైన అధిభౌతిక వాస్తవికతా లక్షణం ప్రకృతిని, పేవ్‌మెంటు జీవుల్ని, అణచివేతను, ఆకలిని, అదంటేమిటో, క్షుణ్ణంగా తెలిసిన వెంకట్రావు బాల్యాన్ని, ఈ అంటే ప్రస్తుత క్షణాన్ని రాశి మాత్రంగా గతితార్కిక చారిత్రక భౌతిక సంబంధాన్నుండి విడదీసి తన కవిత్వానికి మదుపుగా వాడుకున్నాడు నీలిమాగోపిచంద్. ఈ విషయం "అతడు అనివార్యం" అన్న కవితను పరిశీలిస్తే ఇంకా ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. హీరో వర్షిప్ అనే అధి భౌతిక ధోరణి "అతడి" చైతన్యాన్ని అధి వాస్తవికంగా మార్మీకరించి నైరూప్యం చేసి కవి మనస్సులోని ఒక ఆశ్రమ ప్రత్యయంగానే ప్రదర్శిస్తుంది. ఇదే భావం చాలామంది ప్రేక్షకుల మనస్సుల్లో కల్గినా అది అతడితో ఒక నైరూప్య, అసమాన సామాజిక సంబంధాన్ని ఊహించుకుని, దాన్లో తమ స్వేచ్ఛను పోగొట్టుకునే మనస్తత్వాన్నే సూచిస్తుంది. ఈ రకమయిన ఆత్మాశ్రయ నైరూప్య పొగడ్త ఎలిజీ అనే శోకగతంలో మాత్రమే కొంతవరకు శోభిస్తుంది.

అయితే పోరాటం, జీవితం, ప్రశ్నించడంవంటి భౌతిక విలువల్ని అధి భౌతిక ధోరణిలోనైనా అనివార్యంగా గుర్తించడంవల్ల నీలిమా గోపిచంద్ రాసిన వచన కవితల్లో వస్తువులో, లయలో మంచి పట్టుఉన్న భ్రాంతి కల్గుతుంది. ఈ వాస్తవాన్ని ధృవీకరించడానికి "ప్రశ్న విశ్రమించదు" అన్న శీర్షికగల కవితను ఉదాహరణగా తీసుకుందాం :

ప్రశ్న విశ్రమించదు
సహస్ర టూపాలకో నిరంతరం
సమూహాలమధ్యే కదులుతూ వుంటుంది
మౌనం మహా బడిలో ఒరిగిన పెదవుల
రహస్య స్వగతాల్లో రాజుకుంటూనే వుంటుంది

....

"సమూహాలు," అంటే మానవ సమాజాల్లో, మౌనంలోకి నిష్క్రమించిన వ్యక్తుల రహస్య స్వగతాల్లో రాజుకునే ప్రశ్న నిషేధింపబడిన గొంతుకల అంటే కవుల

చీకటి ఏకాంతాల్లో వారి రచనలపై నిఘా వేసి ఉన్న పాలకవర్గాల అణచివేత భావాలతో పెనుగులాడుతూనే ఉంటుంది. ఈ ప్రశ్నకు— "శిరస్సునెత్తిన చూపుడుపేలుకి శత్రువు చిరునామా స్పష్టమే." దేవుడి పేరుమీద, అధికారం పేరుమీద పైనుండి మానవుల శిరస్సుల్ని అదిమి పెట్టిచూసే పాలకవర్గాల అడ్రసు ఆ ప్రశ్నకు తెలుసు. అది అధికార నియంతృత్వాన్ని ప్రశ్నించి నిలేస్తుంది. దానికి సమాధానంగా పాలకవర్గాలు "అగ్ని జలపాతాల్ని" (కాల్చివేతలు, బాంబులు వగైరాలు) కురిపిస్తాయి. ఒక మహోన్నత వ్యక్తమయిన పోరాట చైతన్యంగా ఆ ప్రశ్న తలెత్తితే దానికి పాలకవర్గ సమాధానాలు "రాజ ముద్రిత హంతకుల" రూపంలో అంటే పోలీసు, మిలిటరీ, కోర్టుల రూపంలో వస్తాయి. ఆ ప్రశ్నే "ఒక నిలువెత్తు సజీవం" అయిన విప్లవ వీరుని రూపాన్నిపొంది ప్రపంచాన్ని "రక్తసిక్త దృశ్యం" చేస్తుంది. ఆ రక్తసిక్తమైన సామాజిక వాస్తవికతపై అదే ప్రశ్నకు చైతన్యరూపాలయిన "నాల్గు సూటి ప్రశ్నల్ని" చాలెంజ్‌గా విసిరేస్తె వాటి ధాటికి తట్టుకోలేక "నియంతలు కత్తులు కక్కుకు చస్తారు." అంటే వ్యవస్థను నిలదేసే ప్రశ్నలై తిరుగుబాటు చేసిన మనుష్యులను అణచివేయాలని జూసే వ్యర్థ ప్రయత్నంలో నియంతలు చచ్చేవాపు చస్తారు. ఆ నాల్గు ప్రశ్నలేవంటే :

ప్రశ్న ఒక చారిత్రక అవసరం
ప్రశ్న ఒక ఘర్షణా జ్వలనం
ప్రశ్న ఒక అధ్యయన సారాంశం
శతాబ్దాల సంఘర్షణకు అదీ అలిఖిత మేనిఫెస్టో

అని ప్రశ్నించే కవి చైతన్యంగా ఈ కవిత జవాబిస్తుంది.

మార్క్సిజమంటే "ఏమిటి ? ఎట్లా ?"అన్న శాస్త్రీయమైన ప్రశ్నలే తప్ప వేరుకాదని మార్క్సిస్టు తత్త్వవేత్తల అభిప్రాయం. వాస్తవాన్ని గురించి ఏమిటిది అని ప్రశ్నించి తెలుసుకుని దాన్ని ఆచరణలో అత్యున్నత సామాజిక చైతన్యంగా మార్చుకునే మార్గమే, అంటే గతితార్కిక చారిత్రక భౌతికవాద చైతన్యం, ఆచరణతే మార్క్సిజంకు పునాది అని అర్థం. కాని ఈ కవిత విషయంలో "ఏమిటి ? ఎట్లా !" అన్న ప్రశ్నలు వేసుకుంటే "ఏమిట"ని కొంతవరకు జవాబు దొరుకుతుంది కాని "ఎట్లా ?" అన్నదానికి కాదు. ఈ సమాజంలో తప్పేమిటి? అన్న ప్రశ్నకు ఈ కవితలో దొరికే జవాబు వ్యక్తి చైతన్యాన్ని దేవుడు, అధికారం పేరుమీద

అణచివేసే నియంతృత్వం అన్నది. కాని శ్రమదోపిడి రాజ్యహింస అన్న శాస్త్రీయ సమాధానం కాదు. అయితే దాన్నెట్లా తీసెయ్యాలన్న ప్రశ్నకు జవాబు వర్గ పోరాటంద్వారా, విప్లవంద్వారా అని కానిదాని ఊసే ఈ కవితలో కన్పించదు.

శ్రమజీవన సౌందర్యానికి ప్రాతిపదికగా ఏర్పడే సమసమాజ స్థాపనకు వర్గ పోరాటం, దానికి తోడైన శ్రామిక వర్గ చైతన్యం చాలా అవసరం అన్న అవగాహన ఈ కవితలో లోపించింది. ఈ అవగాహన లేనంతవరకు విప్లవం, విప్లవ సిద్ధాంతం అంటే ఏ కవికైనా బుద్ధిగతంగా అనుసరించాల్సిన అధి భౌతిక భావాలే అవుతాయి. కవిత్వంలో వాస్తవికతా వాద (Materialistic) సత్యాలే అయి ఇంకొంచెం ముందుకుపోయి అధి వాస్తవికత (Surrealism) లోకి దిగజారిపోయే నైరూప్య అనుభవాలే అవుతాయి. ఈ దృష్టితో చూస్తే గతితార్కికతకూ, అధి భౌతికతకూ మధ్య, కవిత్వానికీ, అధునీకతకూ మధ్య నిర్ణాయక పాత్ర నిర్వహించేది శ్రామిక వర్గ చైతన్యం ఉండటమో, లేకపోవడమో అని తెలుస్తున్నది. శ్రామిక వర్గ చైతన్యం రాశిలో, గుణంలో ఎంత మోతాదులో ఉంటే ఆ కవిత్వం అంత ఉన్నతంగా రూపు దిద్దుకుంటుంది.

కాని నీలిమా గోపిచంద్ కవిత "ప్రశ్న విశ్రమించదు" లో "ప్రశ్న" గతి తార్కిక చారిత్రక భౌతిక రూపంగా మార్క్సిస్టు సూత్రంగాకాక భావవాద ధోరణిలో అర్థంచేసుకున్న అధి భౌతిక ప్రత్యయంగానే కన్పిస్తుంది. ఇది ప్రధానంగా పెటీ బూర్జువా ధోరణి అని వేరే చెప్పనవసరం లేదు.

* * *

అలాగే ఆధునిక తెలుగు వచన కవులందరి కవిత్వంలో ఫోర్త్‌పర్సన్ సింగ్యులర్ చరిత్ర కాదు, స్వగతమే.

ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్యగల వైరుధ్యం పెట్టుబడిదారీ సమాజంలో సరుకుల మాయగా అత్యంత విపరీత స్థాయికెదిగి కవిత్వంలో అధి వాస్తవిక ధోరణిగా ప్రస్ఫుటించింది అని తెలుసుకొన్నాం. అన్ని ప్రామాణికాల్నీ నాశనం చేయబూనే ఈ ధోరణి కవిత్వాభావంగా రూపొందినా శ్రామికవర్గ చైతన్యం కల కవిలో తిరిగి అభావం చేయబడుతుంది. కవిత్వానికీ, అధి వాస్తవిక ధోరణికి మధ్యగల గుణరాశుల వైరుధ్యంలో స్థూలంగా రాశిగా మారిన కవితా గుణాన్ని తిరిగి నిజమయిన కవిత్వంగా వెలిగింపజేసేది శ్రామిక వర్గ చైతన్యమే.

గుణాన్ని అభావం చేసే పరిమాణాత్మక క్రియ క్రమానుగతంగా రాశిని వృద్ధి చేసే క్రియ. ఈ క్రియలోని కార్యకారణ సంబంధం ప్రస్ఫుటించే క్రమంలో నెమ్మదిగా సాగే లయ ఉంటుంది. ఈ లయే వచన కవిత్వంలో మనకు కన్పిస్తుంది. ఈ లయ స్వభావరీత్యానే పరిమాణాత్మకమయి, నిస్తేజమయిన లయ.

అయితే రాశిని అభావం చేసే పరిణామాత్మక క్రమం శ్రమశక్తిలోని సృజనాత్మకత, శ్రామిక వర్గ చైతన్యంలో ఉంటుంది. గతితార్కిక భౌతిక చైతన్యం వీటిలో అంతర్గతంగా ఉంటుంది. ఈ చైతన్యం ఆచరణలో భాగమైనపుడు, ముఖ్యంగా కవిత్వంలో భాగమయినపుడు జరిగే మార్పు చలనం, గెంతు (leap) మాదిరిగా జరుగుతుంది. ఈ రకమైన గెంతు వల్లనే శ్రీశ్రీ మహాప్రస్థానంలో కవితలు అధివాస్తవిక ధోరణిలో రాసినా గతితార్కిక చారిత్రక భౌతికవాద చైతన్యాన్ని సంతరించుకుని లయలో ఇతర సమకాలీన కవులెవ్వరి కవిత్వంలో సాధ్యంకాని వేగాన్ని పొందాయి.

అయితే భారతదేశంలో మన రాష్ట్రంలో జరిగిన ఆర్థిక, సామాజిక ప్రక్రియలన్నీ అర్ధవలస, అర్ధ భూస్వామ్య సంబంధాల్నే పెంపొందించాయి. అందువల్ల సామ్రాజ్యవాద దేశాల్లో పెంపొందిన సరుకుల మాయ ప్రభావం, సాంప్రదాయికతా బలం కలగలసిన సామాజిక చైతన్య రూపంగానే మన ఆధునిక కవుల కవిత్వం రూపుదిద్దుకుంది. అలా కాబట్టే వీరి కవిత్వంలో కవి ఆత్మ (self) పాశ్చాత్య కవుల కవిత్వంలో మాదిరిగా సరుకుల మాయ సృష్టి చేసిన చైతన్యంతో పూర్తిగా తాదాత్మ్యం చెందటంకాని లేక దాన్నధిగమించి గతితార్కిక లక్ష్యంతో చరిత్రకు పర్యాయ పదం కావటంకాని జరుగదు. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య భావజాలం ప్రతిబింబించే చైతన్య రూపమయిన స్వగతంగానే మిగిలిపోతుంది. అంటే సంపూర్ణమైన ఆత్మాశ్రయ ధోరణే వీరి కవిత్వంలో కన్పిస్తుంది.

ఈ దృష్టితోనే బాధలూ సందర్భాలూ (కవిత్వం ప్రచురణలు–8, 1990) లోని త్రిపుర కవితల్ని పరిశీలించాల్సి ఉంటుంది. 'బాధలన్నీ అమ్మవి/ సందర్భాలన్నీ నాన్నవి/ అందుకని వాళ్ళకే అంకితం ఇవి' అని తన అమ్మానాన్నలకు అంకితం చేసిన కవితలు ఏడు. అవి వాళ్ళతో కవికున్న సామాజిక సంబంధాన్ని సూచిస్తాయి అని అనుకోవాలి. అలాగే ఈ సంకలనంలో మిగిలిన తొమ్మిది కవితలు తన స్వగతంతో తనకున్న అధి భౌతిక సంబంధాన్ని సూచించే కవితలు.

సంకలనంలోని మొదటి కవిత "బాధా సందర్భం" కవి "గుండెల గుప్త గుహల చీకటిలో" అలలు అలలుగా కాక పుటలు పుటలుగా ప్రవహించే రక్తాన్ని, ఆ రక్తాన్ని తన అవచేతనలో అలా ప్రవహింప చేసే భయాన్ని, ఆ భయాన్ని సృష్టించే అధికారం (సీజర్)లో చారిత్రకంగా ఇమిడి ఉన్న నేర ప్రవృత్తినీ, దాని వల్ల కలిగే గిల్టీ కాన్షస్‌నెస్‌నూ అధి వాస్తవికంగా చిత్రిస్తుంది.

హఠాత్తుగా ఈ భయం.
సీజర్ చరిత్ర రక్తాన్ని పుటలు పుటలుగా నువ్వేనా
నువ్వే నా అంటూ పాలిస్తుంది నా గుండెల గుప్త గుహల చీకటిలో.

కవిత అతని స్వగతానికి పారాసైకాలజీ ధోరణిలో ఉన్న అధి భౌతిక సంబంధానికి ప్రాతిపదిక నేరం చేశానన్న భావం. పక్షపాతంతో పడి ఉన్న తల్లి డెబ్బయి సంవత్సరాల మృత్యువును నెత్తిమీద పెట్టుకుని ("డెబ్బయి ఎండిన నిండిన ఆకులు తలమీద ముడుచుకున్న/పేరలైజ్డ్ తల్లి....") కళ్ళనీళ్ళు కారుస్తుంటే తుడుస్తూ ఆమె నుదుటిమీద ముద్దు పెట్టుకుని అతని అవచేతనలో భాగమైన గిల్టీ కాన్షస్‌నెస్ వల్ల ఆమెను జీసస్ క్రైస్ట్‌గా తనకు తాను విద్రోహియైన జూడాస్‌గా ఊహించుకుంటాడు కవి. అలా ఊహించుకోవడానికి కారణం సంప్రదాయం అతనిలో సృష్టించిన మాతృత్వపు పవిత్రత అనే అధి భౌతిక భావానికి, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ నాగరికత సృష్టించిన సరుకుల మాయలో భాగమయిన ఈడిపస్ కాంప్లెక్స్‌కు మధ్య గల వైరుధ్యం పరిమాణాత్మకంగా అతని కవితా మూర్తిమత్వంలో ఒక్కటి గావడమే.

ఈ కవిత మొదటి భాగంలో కవి అధి భౌతిక వాతావరణాన్ని నిర్మించాడు. జీవితంలో సాధారణార్థంలో విజయం సాధించి, విశ్రాంతి విరామాల్ని జ్ఞాపకాల కలల ఊహల సంతృప్తితో నింపుకుంటూ "తలమీది ఊదా ఊలు కిరీటాన్ని/ పైకెత్తి వ్యాపిస్తున్న బట్టతలని/ చెక్కరలాంటి విషాదపు వేళ్ళ చివర్లతో/ నిమురుకుంటూ, వుంటూన్న/ వేళ" గెలుపు అధికారాలతో పాటే నైరాశ్యనేర భావనగా పరాయీకరణ చెందిన మానవాంశ అతనిలో విజృంభిస్తుంది. అది తీపిని కాక విషాదాన్ని, ప్రేమను గాక ద్రోహాన్ని నిజమైన మానవ ఉద్రేకంగా పరిగణిస్తుంది.

ఇక తన తండ్రితో కవికి గల సామాజిక సంబంధాన్ని "వ్యథ ఒక కథ" సూచిస్తుంది.

ఒక్కొక్కప్పుడు సమస్తం నిన్ను గాయపరుస్తున్న సమయంలో
బ్రతుకుతూ వుంటావ్

అని తన తండ్రినే సంబోధిస్తున్నాడని అనుకొంటే, ఆ సమయం జీవితంలో డబ్బూ, కీర్తి అన్నీ సాధించి కూడా అన్ని విధాలా ఏకాకై పోయిన తండ్రి, మారకపు విలువల ప్రపంచంలో ఊరట చెందలేని తాపదగ్ధ స్థితిని సూచిస్తుంది. సరుకుల మాయలో అభావం చెందిన మానవాంశ అన్నీ ఉండికూడా దేనిలోనూ మనశ్శాంతిని పొందలేని వికృతాంశగా మారిపోయింది. అతనిలో అందుకే అతని చుట్టూ

కరుణతో క్రిస్మస్ పువ్వులాగా
విడుతున్న ఉదయం నీ చుట్టూ తెగనుండి ధ్వంసమైన లాండ్ స్కేప్ వలె
వ్యాపిస్తుంది.

"కరుణతో క్రిస్మస్ పువ్వులాగా" వ్యాపించే ఉదయం సహజంగానే ఆనందాన్నిచ్చే ఉదయమైనా "క్రిస్మస్" ప్రసక్తి ఆ ఉదయం నుండి చల్లదనాన్ని, స్ఫూర్తిని పొందలేని తన తండ్రిలోని పరిస్థితిని సూచిస్తుంది. క్రిస్మస్ పువ్వు జీసస్ క్రైస్తు సందేశమైన ప్రేమను సూచిస్తే తన ఆచరణలో దాన్ని నిరాకరించిన కవి తండ్రికి ఆ పువ్వులాగా వికసించే ఉదయం మంటల వేడిని, విధ్వంసాన్నే కన్పించేట్టు చేస్తుంది. సహజంగానే సంతోషాన్నిచ్చేవన్నీ— "వెదురు పువ్వుల పచ్చటి మంచి గాలి" వంటి వన్నీ తమ వాడుక విలువల ప్రయోజనాన్ని కోల్పోయి అతణ్ణి అంధుణ్ణి చేస్తాయి. "నెమ్మదిగానే నడుస్తున్న వీధి కళ్ళు కాళ్ళ విసుర్లు వ్యాఖ్యానిస్తాయి." వీధిలో జనంతో పరాయీకరణ చెందిన ఆయన సానుభూతి శత్రుత్వ భావంగా మారిపోతుంది. "గుడ్డిగా జాలిగా అన్ని మాటల్లోనే కొరల్లా మెరిసే కైజారులు/ నీ రక్తం కోసం ప్రమత్తులై పొదిగి వుంటాయి!" అమాయకత్వంతో జాలిగా ఎవరైనా మాట్లాడితే ఆ మాటలు కూడా తన అహాన్ని పొడిచేందుకు దాచిన కైజారుల ఒరల్లాగా కన్పిస్తాయాయనకు. అలాగే ఆయన కూడబెట్టుకున్న సంపద వస్తువుల రూపంలో ఆయన ప్రాణాన్ని కాజేసి అతణ్ణి నిర్వీర్యుణ్ణి చేసివేశాయి.

నీ ప్రాణం లేని వూపిర్ని ఘనంగా పీలుస్తున్న వస్తువులు
భూతాల రూపాలయి ఎనీమిక్‌గా నీ వెన్ను వెనుక మూగుతాయి

సరుకుల మాయలో చైతన్య విహీనుడయిన ఆయన వూపిర్ని తమ స్వంతం చేసుకుని వైరూప్య జీవంతో అతని ఎనీమిక్ వెన్ను వెనుక దన్నుగానో, లేక అదను చూసి మింగేసే భూతాల్లాగానో పొంచి ఉన్నాయి, అమ్మకపు విలువలైన వస్తువులు.

అలాగే అతని అలంకరణ సామగ్రి జీవిత సముద్రంలో అతని జ్ఞాపకాల కార్గోల్ని మోస్తూ అతని ఉద్రేకాల పైపూన్లలో ఊగిసలాడుతుంది. మేడ మెట్లు మలుపుల్లో యాదృచ్ఛికమనిపించే నిపురు కప్పుకుపోయిన నిన్నటి ట్రాజెడీ అప్పటికీ కన్నీళ్ళతో తడుస్తూ కుప్పలు పడి మూల్గుతున్నవి. ఎటు తిరిగితే అటు సమాజంలో అతడి కెదురౌతూ గాయపరుస్తున్న కాలంగా అనిపిస్తున్నది అతని ఏకాకితనమే.

ఆ ఏకాకితనానికి అడ్డుగా కిటికీ తెర దించేసి మంచంమీద వాలి "ఇంకొక విస్తారమైన దృశ్యంలోకి విప్పారుదామని" పుస్తకం తెరిస్తే దానిలోని అక్షరాలు కూడా ఇదివరకటి భయోత్పాతాన్నే సృష్టిస్తున్నాయి. ప్రకృతి నుండి, సమాజం నుండి, చివరకు తననుండి తాను ఒక నైరూప్య వస్తు సంబంధంగా పరాయీకరింప బడిన అతని ఉనికి ప్రకృతిలోని అందాన్ని చూస్తే, తోటి మానవులు సానుభూతి ప్రదర్శిస్తే, పుస్తకాల్లో అక్షరాలు వ్యక్తీకరించే వాస్తవాన్ని గమనిస్తే విలవిలలాడి పోతుంది. ఈ రకమైన పరాయీకరణను అభావం చేయడానికి చివరకు అతడి మిత్రుడు ఆరోవిల్లి నుండి పంపించిన ఆత్మ సాక్షాత్కార సందేశమే పనికి వస్తుంది. ఒక సీతాకోక చిలుక అందం, ఉదయించే సూర్యుడి వెచ్చదనం, పెంపుడు పిల్లి ఆశ్వాసన అనబడు ఆత్మగత సంచలనాల్ని (subjective sensations) ప్రేమిస్తే పరాయీకరణ నధిగమించి తిరిగి, తాను మానవుడుగా జీవించవచ్చునన్న నిర్ణయానికి వచ్చినట్లు అనిపిస్తుంది ఈ కవితను పరికిస్తే. ప్రకృతితో, సమాజంతో మనిషికున్న గతితార్కిక భౌతిక సంబంధాన్ని పునరుద్ధరించకుండా సరుకుల మాయలో పడి శాంతిని కోల్పోయిన మనిషి అరవిందుని అధిభౌతిక ఆత్మ సాక్షాత్కారంలో దాన్ని పొందుతాడని అనుకోవడం అర్థ వలస, అర్థ భూస్వామ్య భావజాలంలో పూర్తిగా మునిగిపోవడమే.

అందువల్లనే ఇంకొక వ్యక్తిని సంబోధించినట్టున్నప్పటికీ ఈ కవితలో ఫోర్ పర్సన్ సింగ్యులర్ స్వగతమే పాత్రధారి.అధి వాస్తవిక వచన ధోరణే దానికి తగిన వస్తురూపం.

త్రిపుర కవితా సంకలనంలోని మిగతా తొమ్మిది కవితల్లో కూడా 'కాశీపట్నం రామారావు మాస్టారికి అర్థంకాని,' పెరాసైకాలజీ ప్రొఫెసరు పి. పి. కృష్ణారావుకి అర్థమయ్యే ఏవిటో అడగని కాఫ్కా థీమ్‌గా నెరపు భావమే వాస్తవికతా ధోరణినుండి అధివాస్తవికతా ధోరణిలోకి ప్రచ్ఛన్నంగావటమే కన్పిస్తుంది.

*　　*　　*

గతితార్కిక జీవలయ :

కవిత్వం ప్రచురణ ఐదవ సంకలనం (1991) రావిశాస్త్రి కవిత్వంగా రాయని కవిత్వం ఎన్నెలో ఎన్నెల. ఆయన రాసినవి నవలలు, కథలు ఫెయిల్డ్ పోయెట్‌నని చెప్పుకున్న రావిశాస్త్రి "కవితా రంగాన్ని వదిలిపెట్టి వచనంలోకి వెళ్ళిపోయారు" అన్నారు సంపాదకులు. అయినా "అప్పట్లో వచనం పేరుతో రావి శాస్త్రి రాసింది ఈనాటి అత్యాధునిక కవిత్వంతోపోటీ పడగల్గుతోంది...." అని కూడా అంటున్నారు వారు. కాని నిజానికి పోటీ పడటంకాదు, పెయ్యిరెట్లు మించి పోయింది అని ఉండాల్సింది.

దాదాపు కవిత్వం ప్రచురణల కవులందరికి వచన కవిత్వమంటే పోజిటివిస్టిక్ తార్కిక దృష్టే ఉంది- వచనం, కవిత్వం వేర్వేరు భాషా రూపాలని. నిజానికి ఆ రెండూ కూడ సామాజిక చైతన్యంలో స్థాయీ భేదం ఉన్నా భాగాలే. దాని రూపాలే. వచనం శాస్త్ర విషయాల్ని, సామాజిక వాస్తవాల్ని చర్చించడం, వర్ణించడం కోసం, కవిత్వం సౌందర్య భావనను (రసాన్ని) వ్యక్తం చేయడం కోసం ఉపయోగించే సాధనాలన్నదే ఆధునిక దృష్టి. కాని ఈ దృష్టి ప్రధానంగా యాంత్రిక దృష్టి అన్న విషయం మనకు స్పష్టం.

భూస్వామ్య యుగంలోని ఛందస్సుల్ని, వ్యాకరణ నియమాల్ని, సంధుల్ని, సమాసాల్ని ధిక్కరించి ప్రజాస్వామ్య యుగంలో మొదట మాత్రా ఛందాల్ని, తరువాత వచన రూపాన్ని పొందిన కవిత్వం మామూలు వచనం కంటె ముందుకు పోయి వస్తువులో రూపంలో లయప్రధానమైంది. బూర్జువా కాపిటలిస్టు సమాజంలో ఈ లయను అంతిమంగా నిర్ణయించేది సరుకుల చలనం, వాటి మధ్య సంబంధం అంటే మారకపు విలువలో ఇమిడి ఉన్న వేగం. సామ్రాజ్యవాద యుగంలో ఈ లయ వాస్తవికతా వాద ధోరణి నుండి అధివాస్తవికతా ధోరణిలోకి మారుతుంది. సమకాలీన ప్రపంచంలో సాధించిన శాస్త్ర వైజ్ఞానిక, తాత్త్విక విషయాలన్నిట్లో కవి వ్యక్తావ్యక్త ప్రపంచంలో సరుకుల మాయలో ఇమిడి ఉన్న యాదృచ్ఛిక, మార్మిక, యాంత్రిక, అధి భౌతిక లక్షణాలన్నిట్లో గల నిర్నిబద్ధలయ ఈ ధోరణిలో కనిపిస్తుంది.

అయితే నిజానికి ఈ లయ గతితార్కిక చైతన్యాంశం కావటంవల్ల భాషలో, ప్రతీకల్లో, పదబంధాల్లో, శబ్దాల ధ్వని ఒరవడిలో, శబ్దార్థాల సంఘర్షణలో,

వాటిలోనే వ్యక్తమయ్యే భావాల్లో వీటన్నిటినీ శక్తివంతం చేసే శ్రామిక వర్గ పక్షపాతం చైతన్యంలో ప్రాణం పోసుకుంటుంది. శాస్త్ర వైజ్ఞానిక తాత్త్విక విషయాలన్నీ ఈ చైతన్యంలోంచి ఉద్భవించినవే. ఈ గతి తార్కిక జీవలయను తన చైతన్యంలో భాగం జేసుకున్న రచయిత, కవి వచనం రాసినా, అంటే నవలలు, కథలు రాసినా, అది అధి భౌతికమైన పోజిటివిస్టిక్ తర్కంతో రాసిన అధి వాస్తవిక కవిత్వం కంటె వేల రెట్లు మెరుగ్గా ఉంటుంది. నిజానికి గతితార్కిక జీవలయను ప్రోది చేసుకున్న కవిత్వమే నిజమయిన కవిత్వం. ఎన్నెలో ఎన్నెల నిండా నిజమయిన కవిత్వమే ఉంది.

[జూన్, జూలై సంచికలో విశ్లేషించిన కవిత్వ ప్రచురణలు-ప్రతులకు, వివరాలకు: త్రిపురనేని శ్రీనివాస్, 40-5/6-10 ఇబ్రజీల్ పేట, బందరురోడ్డు విజయవాడ-520010]

సవరణలు

సృజన - 187, మే 1991, 'కవిత్వం-ఆధునికత' వ్యాసంలో ఈ క్రింది సవరణలు చేసుకొని చదువుకోవలసిందిగా కోరుతున్నాం.

1. పే. 44 రెండో పేరా మొదటి లైన్‌లో 'అధి భౌతిక పదార్థ చైతన్యాని' బదులుగా 'ఆది భౌతిక (Proto- materialistic) పదార్థ చైతన్యాన్ని' అని చదువుకోవాలి.
2. అదే పేరా, మూడో లైన్‌లో గూడ 'అధి భౌతిక' బదులు 'ఆది భౌతిక' అని చదువుకోవాలి.
3. పే. 49; పద్నాలుగో లైన్‌లో 'యాంత్రికముగాని' బదులు 'యాత్రికయుగాని' అని చదువుకోవాలి.
4. అదే పేజీ 18వ లైన్‌లో 'but he' బదులు 'but be' అని చదువుకోవాలి.
5. పే. 50, 14వ లైన్‌లో 'ఉదార భౌతికవాద కార్మిక సత్యాలకు బదులు 'ఉదార భౌతికవాద తార్కిక సత్యాలకు' అని చదువుకోవాలి.
6. అదే పేజి కింది నుంచి ఆరో లైన్‌లో 'eternalisationalism' బదులు 'eternal irrationlism' అని చదువుకోవాలి.

→

1. జీవిత సభ్యులకు సృజన జీవితమంతా పంపాలని మా ఆశయం నిజమే కాని సృజన జీవించాలంటే మీరూ మళ్ళీ చందాదారులుగా నమోదు కావలసిందే. ఇంక సృజనకు జీవిత సభ్యుల పద్ధతి ఉండదు. అందరూ చందాదారులే. మీరు శాశ్వత చందాదారులుగా ప్రతి సంవత్సరం రిన్యూ చేయగల ఆసక్తి గలవారని మా విశ్వాసం.

2. నలభై రూపాయలకన్న ఎక్కువ విరాళం, సహాయం కూడా సంవత్సర చందాగానే పరిగణిస్తాం.

3. సృజన పొందుతున్న ప్రతి ఒక్కరూ ఇప్పటికే 90, 91లలో చందాలు చెల్లించి, రిన్యూ చేసినవాళ్ళు కాకపోతే కనీసం చందా నలభై రూపాయలు వెంటనే పంపించండి. ఇష్టం లేకపోతే సృజన పంపించవద్దని రాయండి.

4. సృజన ప్రచురణలు కూడా వెలువరించడానికి ఇటువంటి ఆర్థిక సహాయం దోహదం చేస్తుందని గమనించండి. సృజనను గతంలో కూడా ప్రజలే తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మళ్ళీ ఒకసారి హెచ్చు సంఖ్యలో చందాలు చేర్పించడం ద్వారా, విరాళాలు సేకరించడం ద్వారా, కొత్త ప్రాంతాల్లో ఏజంట్లను కుదిర్చిపెట్టడం ద్వారా (విప్లవ సాహిత్యం ఇప్పటికీ పూర్తిగా బూర్జువా కాదు గదా, ఫ్యూడల్ పంపిణీ పద్ధతి మీదనే ఆధారపడ వలసి వస్తున్నది) ఏజంట్లు సక్రమంగా బకాయిలు చెల్లిస్తున్నారో లేదో కను క్కోవడం ద్వారా (కనుక్కుంటే సుప్రసిద్ధ పుస్తక విక్రేతలు మొదలుకొని ఎందరు పేరుకున్న బకాయిదారులుగా బయటపడతారో - కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడ్డట్టు!) ప్రజలే సృజన జీవనానికి బాసటగా నిలవవలసి వున్నది. సృజనను రక్షించుకునే బాధ్యతను విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు స్వచ్ఛందంగా స్వీకరించవలసివున్నదని మరోసారికి మరో సారి మనవి చేస్తున్నాం.

సృజన సంవత్సర చందా రూ. 40 విడి ప్రతి రూ. 4

* సృజనకు విరివిగా చందాలు సేకరించండి.
* సృజనను పదికాలాలపాటు నిలిపి ఉంచేందుకు మీ వంతు కర్తవ్యం నిర్వహించండి.

SRJANA Telugu Monthly July 1991
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజనకు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించండి !

సృజన ప్రారంభించిన పాతిక సంవత్సరాల క్రితం 'సాహితీమిత్రులు' తామే నెలకు పదిరూపాయల చొప్పున వేసుకొని పత్రిక ఆర్థిక భారాన్ని సగమైనా మోయాలనుకున్నారు. మిగతా సగం చందాదార్ల నుంచి రాకపోతుందా అనుకున్నాం.

ఇటీవల సృజన ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకున్నప్పుడు సాహితీమిత్రులు మొదట కనీసం తాము సంవత్సర చందాలు కట్టాలి, ప్రతి నెలకు ఏభై మంది కొత్త చందాదార్లను అందరు కలిసిగానీ, ఒక్కొక్కరు ఒక నెల బాధ్యత తీసుకొనిగానీ చేర్పించాలి అని తీర్మానించుకున్నాం.

పది పన్నెండేళ్ళ క్రితం సృజనకు జీవిత సభ్యత్వాలు చేర్పించాం. ఏభై మంది దాకా తలా రెండు వందలు ఇచ్చారు. ఆ మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టి దానిపై వచ్చే వడ్డీతో సృజన నిర్వహించాలని లెక్కలు గట్టాం. త్వరలోనే ఏ అంచనాకూ అందకుండా పెరిగిన కాగితం ధర, ప్రింటింగు చార్జీలు, పోస్టల్ రేట్లు ఆ డబ్బు అసలు మొత్తానికే ఎసరుపెట్టాయి.

జీవిత సభ్యత్వం అడుగుతూ ఖమ్మంలో ఒక డాక్టర్ దగ్గరికి వెళ్ళి 'జీవిత మంతా సృజన పంపుతాం' అన్నప్పుడు 'ఎవరి జీవితం ? సృజన బతికినంతకాలం పంపించండి చాలు' అన్నాడు.

అన్నట్లే ఇంతలో 86లో సృజన ఆగిపోయింది. అయితే సృజన పునః ప్రారంభం కాగానే వీళ్ళకు మళ్ళీ పంపుతూనే వున్నాం.

←

SRJANA Rs. 4/-
Flat 11, Block 2,
MIC II, Baghlingampalli,
Hyderabad-500 044.